www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
శనివారం 22 మార్చి 2025
సంపుటి :06 సంచిక : 292 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## సీఎం రేవంత్ రెడ్డి ని కలిసిన కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీ

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 21:** కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పీవీ నందకుమార్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా శుక్ర వారం నాడు కలిశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కాళోజీ హెల్త్ యూనివర్సిటీకి సంబంధించిన అన్ని అంశాలపై నేరుగా తనతో చర్చించి పరిష్కారం దిశగా ముందుకు సాగాలని సూచించారు , ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు,



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నాబార్డ్ ఛైర్మన్ షాజీ కేవీ భేటీ

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 21:** రీడీఎఫ్ కింద తక్కువ వడ్డీకి రుణాలు అందించాలని నాబార్డు చైర్మన్ షాజీ కేవీ ని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కోరారు, శుక్ర వారం నాడు సిఎం రేవంత్ రెడ్డి తో భేటీ అయిన నాబార్డ్ చైర్మన్ షాజీ తో మాట్లాడుతూ మైక్రో ఇరిగేషన్ కు నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. కో-ఆపరేటివ్ సొసైటీలను బలోపేతం చేయాలని, కొత్తగా మరిన్ని కో-

2 లో..



## చింతన్ శివీర్ కార్యక్రమం కు రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం కు ఆహ్వానం

- కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ నుంచి మంత్రి పొన్నం కు అందిన ఆహ్వానం



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 21:** వివిధ అణగారిన వర్గాల సంక్షేమం కోసం మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ మరియు ఎంపవర్మెంట్ నిర్వహించే చింతన్ శివీర్ కి తెలంగాణ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఆహ్వానంఅందింది. ఈ మేరకు కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ నుంచి మంత్రి కి ఆహ్వానం వచ్చింది, వచ్చే నెల ఏప్రిల్ 7,8 తేదీలలో డెహ్రాడూన్ లో జరగనున్న చింతన్ శివీర్ కార్యక్రమం దేశం లో అమలవుతున్న వివిధ పథకాలు మరింత సమర్థవంతంగా నిర్వహించబడడం పై చర్చించనున్న జాతీయ ,రాష్ట్ర స్థాయి మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

## రాజకీయ లబ్ధికోసమే హిందీ వివాదం

- హిందీ ఏ భాషకూ వ్యతిరేకం కాదు
- తమిళంలో మెడికల్ , ఇంజనీరింగ్ విద్య మాలక్ష్యం
- కాశ్మీర్‌లో పరిస్థితులు దారికొస్తున్నాయి
- ఉగ్రవాద నిర్మూలనలో రాజీపడే ప్రసక్తి లేదు
- రాజ్యసభలో హోంమంత్రి అమిత్ షా వెల్లడి



**న్యూఢిల్లీ,మార్చి21( వెలుతురు):** రాజకీయంగా లబ్ధి పొందేందుకు, అవినీతిని దాచి పెట్టేందుకే కొన్ని పార్టీలు భాష అంశాన్ని వివాదం చేస్తున్నాయని కేంద్ర హోంమంత్రి

2 లో..

# బొగ్గు ఉత్పత్తిలో గణనీయమైన ప్రగతి

### వందకోట్ల టన్నుల మైలురాయిని దాటిన భారత్

### ఇంధనశక్తిలో స్వాలంబనకు నిదర్శనమన్న మోడీ

**న్యూఢిల్లీ,మార్చి21( వెలుతురు):** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తిలో 100 కోట్ల టన్నుల మైలురాయిని భారత్ దాటింది. ఇది దేశానికి గర్వ కారణమని ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం అభివర్ణించారు. ఇంధన శక్తి భద్రత, స్వావలంబన విషయంలో దేశం నిబద్ధతకు ఇది సూచిక అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తిలోను, పలు పరిశ్రమల్లో ఇంధనంగా ప్రధానంగా ఉపయోగిస్తుండే బొగ్గు ప్రపంచ ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఇంధన వనరుగా ఉంటున్నది. భారత్ 2023-24 సంవత్సరంలో 997.83 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 100 కోట్ల టన్నుల మేరకు బొగ్గు ఉత్పత్తి చేయడాన్ని 'భారత్‌కు గర్వకారణం'గా ప్రధాని మోడీ

2 లో..



## అబద్ధాలతో పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్



- ఉచితంగా ఎల్ఆర్ఎల్ చేస్తామని మాటతప్పిన రేవంత్
- రైతు రుణమాఫీలోనూ మోసాలు
- అందరికీ అందని రైతు భరోసా సాయం
- శాసన సభ చర్చల్లో మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్,మార్చి21( వెలుతురు):** రేవంత్‌రెడ్డి సర్కార్ చెప్పేవన్నీ అబద్ధాలేనని, వారు ఒకటి చెప్తే ఇంకోటి చేస్తారని.. రాష్ట్రంలో గందరగోళ పరిస్థితి ఉందని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎన్నికల ముందు మార్పు పేరుతో వాగ్దానాలు ఇచ్చారని, ఎన్నికల తర్వాత ఆ వాగ్దానాలను ఏమార్చరని అన్నారు. ఎన్నికల ముందు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామన్నారని, ఇప్పుడేమో ఎల్ఆర్ఎస్ కోసం ప్రజల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రుణమాఫీకి రూ.31 వేల కోట్లు సమీకరించుకున్నట్లు చెప్పారని, రూ.20 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసినట్లు

2 లో..

## రోడ్లపై హరీష్ రావు గొప్పలు

- బిఆర్ఎస్ హయాంలో గ్రామాలకు పెద్ద ఎత్తున రోడ్లు
- వికారాబాద్ జిల్లాలో రోడ్లు లేక పిల్లను ఇవ్వడం లేదన్న స్పీకర్
- దిమ్మతిరిగి షాక్‌కు గురైన హరీష్ రావు

### గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలకే రోడ్లు వేశారన్న కోమటిరెడ్డి




**హైదరాబాద్,మార్చి21( వెలుతురు):** వికారాబాద్ జిల్లాలో రోడ్లు లేక, గ్రామాల్లో పిల్లలు ఇవ్వలేని దస్థితి ఉందని స్పీకర్ ప్రసాదరావు ముక్తసరిగా చేసిన వ్యాఖ్య..బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్ల గురించి మాట్లాడిన హరీష్ రావుకు షాక్ తగిలినట్లు అయ్యింది. బడ్జెట్ చర్చలో హరీష్ రావు మాట్లాడుతూ..బిఆర్ఎస్ హయాంలో ప్రతి గ్రామానికి, మండలానికి రోడ్డుల వేశామని అన్నారు. తమ ప్రభుత్వం గ్రామీణ రోడ్లకు అధికంగా ఖర్చుచేసిందని అన్నారు. దీనికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీటుగా జవాబిచ్చారు. గజ్వెల్, సిరిసిల్ల, సిద్ధపేట తప్ప రాష్ట్రంలో ఎక్కడా రోడ్లు వేయలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో వేసినవే తప్ప పదేళ్లలో ఎక్కడా లేవన్నారు. అలాగే ఈ మూడు నియోజకవర్గాల కోసం అన్ని నిధులను వాడారని దుయ్యబట్టారు. ఇదే సందర్భంలో స్పీకర్ ప్రసాదరావు జోక్యం చేసుకుని..వికారబాద్ జిల్లాలో రోడ్లులేక పిల్లలకు పెళ్లిళ్లు కావడం లేదని ముక్తసరిగా అన్నారు. ఈంతో హరీష్ రావుకు దిమ్మతిరిగినంత పనయ్యింది. రోడ్లపై మరోరోజు చర్చకు సిద్ధమని చెప్పి తప్పించుకున్నారు. అంతకుముందు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ...గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులకు టోల్ విధించే ఆలోచన లేదని తెలిపారు. కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన 40 శాతం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. వారికి ఆరు నెలలు

2 లో..

## ఢిల్లీ హైకోర్టు జడ్జి వర్మ నివాసంలో నోట్ల కట్టలు

- అగ్నిప్రమాద సమయంలో గుర్తించిన సిబ్బంది
- ఐటి అధికారులకు సమాచారం ఇచ్చి కట్టలు స్వాధీనం
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటనపై కొలీజియం విచారణ




**న్యూఢిల్లీ,మార్చి21( వెలుతురు):** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ అధికార నివాసంలో నోట్లకట్టలు వెలుగు చూడడం కలకలం రేపుతోంది. ఈ క్రమంలో ఆయనను బదిలీ చేయడంతో పాటు అంతర్గత విచారణకు కొలీజియం

2 లో..



## తెలంగాణ పరువును ఢిల్లీ బజారులో పెట్టారు

- మీరు..మీ కుటుంబం కలసి రాష్ట్ర పరువు తీసారు
- మండలిలో కవితకు సీతక్క ఘాటు సమాధానం

**హైదరాబాద్,మార్చి21( వెలుతురు):** శాసన మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వర్సెస్ మంత్రి సీతక్క మధ్య మాటల యుద్ధం జరిగింది. ముఖ్యమంత్రి రాష్ట్రం పరువు తీస్తున్నారని కవిత చేసిన వ్యాఖ్యలకు మంత్రి సీతక్క ఘాటుగా స్పందించింది. రాష్ట్ర పరువు తీసింది ఎవరని ఎదురు ప్రశ్నించారు. మీ కుటుంబమే రాష్ట్ర పరువు తీసింది.. మాకు ఢిల్లీ వ్యాపారాలు తెలియవు.. ఢిల్లీ వ్యాపారాలతో రాష్ట్రం

2 లో..

## విశాఖ మహానగర పాలక సంస్థ కొత్త మాస్టర్ ప్లాన్

- భోగాపురం విమానాశ్రయానికి కనెక్టివిటీ
- అవసరమైన మేర రోడ్ల విస్తరణ
- నెలాఖరులోగా విశాఖ మెట్రో రైలు టెండర్లు పూర్తి
- విశాఖ జిల్లా ఎమ్మెల్యేలతో మంత్రి నారాయణ సమీక్ష

**అమరావతి,మార్చి21( వెలుతురు):** నాలుగు నెలల్లో విశాఖ మహానగర పాలక సంస్థ కొత్త మాస్టర్ ప్లాన్ తయారు చేస్తామని ఏపీ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ చెప్పారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ రోడ్ల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయని మంత్రి నారాయణ అన్నారు. ఇందుకోసం రోడ్ల విస్తరణ చేయాల్సి ఉందని అన్నారు.ఈ ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా ఎక్కువగా ఉందని తెలిపారు. విశాఖ జిల్లా ఎమ్మెల్యేలతో శు క్రవారం మంత్రి నారాయణ సమావేశం నిర్వహించారు. నగర అభివృద్ధి, మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి సమీక్షించారు. అధికారులు కూడా ఇందులో పాల్గొన్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. మే నెలాఖరులోగా విశాఖ మెట్రో రైలు టెండర్లు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఫైనాన్షియల్ సిటీ విశాఖ మాస్టర్ ఎ÷-లాన్‌పై

2 లో..



(మొదటి పేజీ తరువాయి..)

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నాబార్డ్ చైర్మన్ షాజీ కేవీ భేటీ

ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయాలని నాబార్డు చైర్మన్ కు విజ్ఞప్తి చేసిన సిఎం.స్వయంసహాయక సంఘాల మహిళా గ్రూపులకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలని కోరిన సీఎం.ఐకేపీ, గోడౌన్స్, రైస్ మిల్లులను నాబార్డుకు అనుసంధానం చేసి రాష్ట్రంలో మిల్లింగ్ కెపాసిటీ పెంచేందుకుసహకరించాలన్న ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి.ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నాబార్డు స్కీమ్స్ నిధులు మార్చ్ 31 లోగా ఉపయోగించుకోవాలని అధికారులకు సూచించిన సీఎం.నాబార్డు పరిధిలోని స్కీములన్నింటినీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీలైనంత ఎక్కువ ఉపయోగించుకోవాలన్న సీఎం. స్వయం సహాయక మహిళా సంఘాలకు అందించే సోలార్ ప్లాంట్స్ నిర్వహణను నాబార్డుకు అనుసంధానం చేయాలని సూచించారు. కొత్త గ్రామ పంచాయతీలకు రూరల్ కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు, ఈ సందర్భంగా కొత్త జిల్లాల్లో కొన్ని డీసీసీబీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి ప్రతిపాదించిన నాబార్డు చైర్మన్ షాజీ .ఈ సమావేశంలో నాబార్డు ప్రతినిధులతోపాటు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, కోదండ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బొగ్గు ఉత్పత్తిలో గణనీయమైన ప్రగతి

సామాజిక మాధ్యమం 'ఎక్స్' పోస్ట్‌లో అభివర్ణించారు. '100 కోట్ల టన్నుల మైలురాయిని దాటడం గణనీయమైన విజయం. ఇంధన శక్తి భద్రత, ఆర్థిక వృద్ధి, స్వావలంబన పట్ల మన నిబద్ధతకుఇది ప్రతీక' అని ఆయన పేర్కొన్నారు. ఈ రంగంతో సంబంధం ఉన్న వారందరి అంకితభావాన్ని, గట్టి కృషిని ఇది ప్రతిబింబిస్తోందని మోడీ తెలిపారు. ఈ విజయం గురించి ప్రకటనతో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి సామాజిక మాధ్యమంలో చేసిన పోస్ట్‌పై ప్రధాని మోడీ ఆ వ్యాఖ్య చేశారు. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమర్థ విధానాలతో భారత్ ఉత్పత్తిని హెచ్చించడమే కాకుండా సుస్థిర, బాధ్యతాయుత గనుల తవ్వకం జరిగేలా చూసిందని మంత్రి తెలిపారు.'ఈ విజయం పెరుగుతున్న మన విద్యుత్ డిమాండ్లను తీరుస్తుంది, ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుంది, ప్రతి భారతీయునికి సముజ్వల భవిష్యత్తును సాధ్యం చేస్తుంది' అని కిషన్ రెడ్డి సూచించారు, ప్రధాని నరేంద్ర మోడీ దూరదృష్టితో కూడిన నాయకత్వంలో భారత్ ప్రపంచ ఇంధన శక్తిలో అగ్రగామి దిశగా పయనిస్తోందని ఆయన అన్నారు. ఈ మైలురాయి సాధనలో బొగ్గు రంగంలో శ్రామిక శక్తి కృషిని కూడా కిషన్ రెడ్డి శ్లాఘించారు. 202425 ఆర్థిక సంవత్సరానికి బొగ్గు మంత్రిత్వశాఖ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 108 కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలన్నది లక్షం.

### రోడ్లపై హరీష్ రావు గొప్పలు

లేదా మూడు నెలలకు చెల్లిస్తామన్నారు. ప్రతి గ్రామం నుంచి మండలానికి డబుల్ రోడ్లు వేయిస్తామని తెలిపారు. భారాస హయాంలో సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌కే రోడ్లు వేశారని చెప్పారు. ఆ మూడు చోట్ల రోడ్లకు చివరికి సింగరేణి నిధులు కూడా వాడారని పేర్కొన్నారు. ఛాలెంజ్ చేస్తున్నా.. రాష్ట్రమంతా తిరిగి చూద్దామా అని హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. కోమటిరెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. భారాస హయాంలో ఆర్అండ్‌బీ పనుల గురించి లెక్కలు తీద్దామన్నారు. రోడ్ల గురించి ఒకరోజు ప్రత్యేకంగా చర్చిద్దామని హరీష్ చెప్పారు.


### తెలంగాణ పరువును ఢిల్లీ బజారులో పెట్టారు

పరువు తీసింది మీరు, మీ కుటుంబం అని మండిపడింది. కాంగ్రెస్ పార్టీది త్యాగాల చరిత్ర.. కరప్షన్ కి కేర్ ఆఫ్ అడ్రస్ బీఆర్ఎస్.. మహిళలకు అడుగడుగున అన్యాయం చేసింది టీ–ఆర్ఎస్.. మొదటి ఐదు సంవత్సరాల్లో మంత్రి పదవిలో మహిళలు లేరు, మహిళా కమిషన్ కి సభ్యులు లేరు.. మహిళలు పొదుపు చేసుకున్న 1800 కోట్ల అభయ హస్తం నిధులు ఇవ్వలేదు.. పావలా వడ్డీ ఇవ్వలేదు.. మహిళ సంఘాలకు ఇవ్వాల్సిన రూ. 3700 కోట్ల వడ్డీలు చెల్లించలేదు అని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేసారు. తెలంగాణను మీరు సస్యశ్యామలం చేస్తే, రైతులు ఎందుకు ఇబ్బందులు పడ్డారని మంత్రి సీతక్క ప్రశ్నించింది. మేము పంట కాలువలు మూసివేసినట్లు–గా టీ–ఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుంది.. బీఆర్ఎస్ పార్టీ డీఎన్ఏ లోనే కరప్షన్ ఉంది.. ఇష్టానుసారంగా ఎస్టిమేషన్స్ పెంచి దోచుకుతున్నారు.. మీరు నోటిఫికేషన్లు ఇస్తే నియామకాలను ఎవరు అడ్డుకున్నారు అని అడిగారు. మీరు చేయలేని ఉద్యోగాల భర్తీ మేం చేస్తున్నాం.. 59 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం.. మీరు అన్ని చేస్తే ప్రజలు ఎందుకు ఓడిస్తారు.. టీ–ఆర్ఎస్ పెద్దలు ఆత్మ పరిశీలన చేసుకోవాలని తెలిపింది. మీరు బంఫర్ మెజారిటీ–తో అధికారంలోకి రాలేదు.. మీరు మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు 63 సీట్లతో వచ్చారు అని తెలిపింది. మేము 65 సీట్లతో అధికారులకు వచ్చాం.. 10 ఏళ్లలో ఎన్ని ఇండ్లు ఇచ్చారని అడిగింది. ప్రజలకు ఇండ్లు ఇవ్వలేదు కాబట్టి మిమ్మల్ని ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారు.. మేము వచ్చి 15 నెలలు అయింది.. అప్పుడే అన్ని కావాలన్నట్టు–గా అక్కసు వేల కక్కుతున్నారు అని మండిపడింది. అయితే, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు దేశం కోసం ప్రాణాలు అర్పించారు.. వారి పేరు స్కీమ్స్ కి పెడితే ఎందుకంత కడుపు మంట అని ఎమ్మెల్సీ కవితను మంత్రి సీతక్క ప్రశ్నించింది. మీరు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇవ్వలేదు.. ఎన్నో హామీలు తుంగలో తొక్కారు.. రాష్ట్రం పరువు తీసింది మీరే.. తప్పుడు ప్రచారం చేయొద్దు.. ఎఫ్ఆర్బీఎం నిబంధనలకు విరుద్ధంగా అప్పల కోసమే కార్పొరేషన్లను ఏర్పాటు– చేశారు.. మీరు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది అని మంత్రి సీతక్క చెప్పుకొచ్చారు.

## వైకాపాలో పొమ్మనలేక పొగపెట్టారు

- ఓడిని రజనీని పేటకు ఇన్‌ఛార్జ్ చేశారు
- త్వరలోనే టిడిపిలో చేరుతానన్న మర్రి రాజశేఖర్

అమరావతి,మార్చి21( వెలుతురు):



మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత విడదల రజిపై మాజీ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీలో గుర్తింపు లేదు.. తనను చులకనగా చూశారని ధ్వజమెత్తారు. శుక్రవారం మర్రి రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ.. రజినీని బలోపేతం చేయడానికి తనను అవమానించారని మండిపడ్డారు. త్వరలో టీడీపీలో చేరుతానని మర్రి రాజశేఖర్ స్పష్టం చేశారు. వైసీపీ నుంచి తాను వెళ్లిపోవడానికి వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి వైఖరీనే కారణమని అన్నారు. తనకు మంత్రి పదవి ఇస్తామని ఇవ్వలేదని మర్రి రాజశేఖర్ చెప్పారు. 2023 చివర్లో ఎమ్మెల్సీ ఇచ్చారని మర్రి రాజశేఖర్ గుర్తుచేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయిన రజినీని చిలకలూరిపేట ఇన్‌చార్జ్‌ని చేశారని చెప్పారు. వైసీపీకి మర్రి రాజశేఖర్ రాజీనామా చేయడంపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత విడదల రజినీ స్పందించారు. మర్రి రాజశేఖర్ ఆత్మ విమర్శ చేసుకోవాలని విడదల రజనీ అన్నారు. మర్రి కుటు–ంబానికి వైఎస్ కుటు–ంబం ఎంతో గౌరవం ఇచ్చిందని తెలిపారు. మర్రి గెలుపు కోసం వైఎస్సార్ ప్రచారం చేశారని గుర్తుచేశారు. రెడ్‌బుక్ పాలనలో తన వాయిస్ వినిపించి ఉంటే.. మర్రి గౌరవం ఇంకా పెరిగి ఉండేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి చెబితేనే తాను గుంటూరు వెస్ట్ నుంచి పోటీ– చేశానని విడదల రజినీ తెలిపారు. మర్రి రాజశేఖర్ రాజీనామా ఏపీ రాజకీయాల్లో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఎమ్మెల్సీకి రాజీనామా చేసిన తర్వాత ఆయన శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజును కలిసి రాజీనామా పత్రాన్ని అందజేశారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని మండలి ఛైర్మన్‌ను మర్రి రాజశేఖర్ కోరారు. వైసీపీకి రాజీనామా చేసిన ఆయన త్వరలో టీ–డీపీలో (ఃఉ) చేరుతున్నట్లు– ప్రకటించిన విషయం తెలిసిందే. రాజీనామాకు ముందు రాజశేఖర్‌ను వైసీపీ అగ్రనేతలు బుజ్జగించేందుకు ప్రయత్నించారు. రాజీనామాను ఉపసంహరించుకోవాలని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కోరారు. అయితే తాను టీ–డీపీలో చేరడానికి నిర్ణయం తీసుకున్నానని మర్రి రాజశేఖర్ అన్నారు.

# అబద్ధాలతో పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్

ఒప్పుకున్నారని వెల్లడించారు. శాసన సభలో బడ్జెట్‌పై చర్చను హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఏడాది బడ్జెట్ రూ.2 లక్షల 91 వేల 159 కోట్లు అని గొప్పగా చెప్పుకున్నారు. ఇవి అవాస్తవిక అంచనాలని నేను ఆనాడే చెప్పాను. వారు కాదు పొమ్మన్నరు. రివైజ్డ్ ఎస్టిమేషన్‌లో రూ.27 వేల కోట్లు తక్కువ చేసి చూపారు. ముఖ్యమంత్రేమో రూ.60 నుంచి రూ.70 వేల కోట్లు తక్కువగా వస్తాయని స్వయంగా చెప్పారు. అంటే అంచనా అవాస్తవం అని తేలిపోయింది. ఈ కొటేషన్ ఎవరు చెప్పారోగానీ కాంగ్రెస్ కోసమే చెప్పారు. ఎన్నికలకు ముందు మార్పు పేరిట వాగ్దానాలు ఇచ్చారు. ఎన్నికలు అయ్యాక ఆ వాగ్దానాలనే ఏమార్చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వడ్డీ లేని రుణాలకు సంబంధించి ఈరోజు వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేసింది లేదు. వడ్డీ లేని రుణాల పరిమితిని గత ప్రభుత్వంలో మేం ఇచ్చిన 5లక్షలకు మించి పెంచింది లేదు. ఇదే శాసనసభలో మేము అడిగిన ప్రశ్నకు సమాధానంగా 5లక్షల వరకే వడ్డీ అందుతుందని ప్రభుత్వమే స్పష్టంగా చెప్పింది. 5లక్షల వరకే వడ్డీ లేని రుణాలు అని మీరే అన్నరు. మళ్లీ మీరే తీసుకున్న మొత్తం రుణానికి వడ్డీ లేని రుణం అని ప్రచారం చేసుకుంటున్నరు. నేను భట్టి గారిని సూటిగా అడుగుతున్నా. మహిళా సంఘాలు తీసుకున్న మొత్తం రుణానికి వీఎల్‌ఆర్ వర్తిస్తుంది అనే ఉత్తర్వులు ఉంటే చూపండి. లేదా ఈ సభను తప్పుదోవ పట్టించినందుకు, మహిళా లోకాన్ని మోసం చేసిందనందుకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నా. ఎకరానికి రూ.15 వేలు చెల్లిస్తామన్న సంకల్పం ఏమైంది. రైతులు, కౌలు రైతులకు రైతు భరోసా, రైతు బీమా ఇస్తామని చెప్పారు. ఇప్పుడు కౌలు రైతులను రైతులే చూసుకోవాలంటున్నారు. ఈసారి బడ్జెట్‌లో అసలు కౌలు రైతుల ప్రస్తావనే లేదు. మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫామ్స్ కుట్టుకూలీ రూ.50 నుంచి రూ.75కు పెంచి ఇచ్చినట్లు చెప్పారు. రూ.75 కుట్టు కూలీ ఇచ్చిన మహిళా సంఘం పేరు చెప్పాలని లేకపోతే క్షమాపణ చెప్పాలి. ఇందిరమ్మ ఇండ్లకు నిధులు కేటాయించినట్లు చెప్పారు. కాంగ్రెస్ పాలనలో 4.5 లక్షల ఇండ్లు కాదు కాదా.. 4 ఇండ్లు కూడా కట్టలేదు. ఎస్సీ, ఎస్టీల ఇండ్లకు రూ.లక్ష అదనంగా కలిపి రూ.6 లక్షలు ఇస్తామన్నారు. ఈ సారి ప్రసంగంలో రూ.లక్ష మాయమైంది. దళిత, గిరిజనులను ప్రభుత్వం మో సం చేశారు. ఫసల్ బీమాకు రూపాయి ఇవ్వలేదని, ఫసల్ బీమా చేయట్లేదు. జాబ్ క్యాలెండర్.. జాబ్‌లెస్ క్యాలండర్ అయింది. ట్రిపుల్ ఆర్ ఉత్తరభాగానికి మా ప్రభుత్వ హయాంలో అనుమతులు తెచ్చామన్నారు. భూసేకరణకు రూ.1,525 కోట్లు పెట్టామని గత బడ్జెట్‌లో చెప్పారు. ఏడాదైనా ఒక్క ఎకరా సేకరించలేదు, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఆరు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తామని గత బడ్జెట్‌లో చెప్పారు, ఎన్ని ప్రాజెక్టులు పూర్తిచేసి.. ఎంత ఆయకట్టుకు నీళ్లిచ్చారో చెప్పాలి. ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు, పంటలకు బోనస్ ఇస్తామని మోసం చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, విద్యార్థులకు భరోసా కార్డు పేరుతో మోసం చేశారు. ఆదాయం పెంచి హామీలు నెరవేరుస్తామని ఎన్నికలకు ముందు చెప్పారు. కాంగ్రెస్ వైఫల్యం వల్ల రాష్ట్ర ఆదాయంపై ప్రభావం పడింది. రాష్ట్ర ఆదాయం క్షీణిస్తున్న సమయంలో ఏం చేయాలో భట్టి విక్రమార్క చెప్పాలి. ప్రభుత్వ వైఫల్యాలు సరిచేసుకోవాలి లేదా రేవంత్‌రెడ్డి ఫార్ములా ప్రకారం భూములు అమ్మాలి. ఎనుముల వారి పాలనలో ఎన్ని భూములు ఖతం పట్టిస్తారో తెలియదు. గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని వేలం చేయడం ద్వారా రూ.30 వేల కోట్లు రాబట్టాలని నిర్ణయించారు. టీజీఐఐసీ భూములు తాకట్టుపెట్టి రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చారు. హెచ్‌ఎండీఏ భూములు తాకట్టుపెట్టి రూ.20 వేల కోట్లు అప్పు తెస్తామని చెప్పారు. ఆ రోజు ఫార్మాసిటీకి మేము భూములు సేకరిస్తుంటే ఆ రోజు అక్కడ భట్టి విక్రమార్క, సీతక్క పాదయాత్ర చేసి భూములు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు.

# ఢిల్లీ హైకోర్టు జడ్జి వర్మ నివాసంలో నోట్ల కట్టలు

నిర్ణయించింది. అగ్ని ప్రమాదం సమయంలో వెలుగు చూసినట్లుగా పేర్కొంటున్న భారీ నోట్ల కట్టల ఘటనపై సుప్రీం కోర్టు కొలీజియం శుక్రవారం ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించింది. జస్టిస్ వర్మ నివాసంలో భారీ అగ్ని ప్రమాదం దరిమిలా భారీగా నగదు కట్టలు బహిర్గత కావడం గురించి ప్రభుత్వ అధికారులు కొందరు సమాచారం అందజేసిన తరువాత సర్వోన్నత న్యాయస్థానం కార్యోన్ముఖం అయినట్లు తెలుస్తోంది. జస్టిస్ వర్మను బదలీ చేయడమే కాకుండా ఆయనపై కఠిన చర్య తీసుకోవాలని కొలీజియంలోని సీనియర్ సభ్యులు కొందరు కోరినట్లు– తెలుస్తోంది. ఆయన రాజీనామాను కోరాలని, అందుకు నిరాకరిస్తే సర్వోన్నత న్యాయస్థానం తీర్పుల్లో సూచించినట్లుగా అంతర్గత దర్యాప్తు ప్రారంభించాల ని వారు కోరినట్లు– తెలుస్తోంది. జస్టిస్ వర్మ నివాసంలో మార్చి 14న అగ్నిప్రమాదం జరగగా అగ్నిమాపక దళాలు మంటలను ఆర్పారు. అదే సమయంలో వర్మ నివాసంలో భారీగా నడదును గుర్తించి, ఐటి అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే ప్రమాద సమయంలో వర్మ నగరంలో లేరు. ఈ క్రమంలో ఆరోపణలు రావడంతో కొలీజియం విచారణ చేపట్టింది. యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదలీ చేయాలనే సూచనలు కూడా వచ్చాయి. ఆ దర్యాప్తు సుప్రీం కోర్టు తీర్పుల్లో సూచించినట్లుగా అంతర్గత విచారణ కాదు. ఆ ఘటనపై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి ప్రాథమిక నివేదికను కూడా సుప్రీం కోర్టు కొలీజియం కోరనుంది.. భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా సారథ్యంలోని కొలీజియం వెంటనే కార్యోన్ముఖమై తక్షణ సమావేశం నిర్వహించింది. జస్టిస్ వర్మను తొలుత పని చేసిన అలహాబాద్ హైకోర్టుకు బదలీ చేసే పక్రియకు కొలీజియం శ్రీకారం చుట్టినట్లు– తెలుస్తోంది. ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించడం కేవలం ఒక చర్య అని, కొలీజియం ఈ విషయమై మరింతగా క్రియాశీలం కావచ్చునని తెలుస్తోంది. దేశ రాజధానిలో జస్టిస్ వర్మ అధికార నివాసంలో నగదు కట్టలు కనిపించడానికి సంబంధించిన వివాదం గురించి, ఆ దరిమిలా కొలీజియం సంప్రదింపుల గురించి తొలుత ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రిక తెలియజేసింది. కొలీజియం సిఫార్సును కేంద్రం ఆమోదించిన తదుపరి జస్టిస్ వర్మ ప్రతిపాదిత బదలీ చోటు చేసుకుంటుంది. కొలీజియం తన సిఫార్సును అధికారికంగా ఇంకా పంపవలసి ఉంది. జస్టిస్ వర్మ అధికార నివాసంలో మంటలను ఆర్పివేసేందుకు వెళ్లిన ఢిల్లీ అగ్నిమాపక శాఖ అధికారుల కంట పడినట్లుగా పేర్కొంటున్న అధికారిక నగదు మొత్తం ఇంకా తెలియరావలసి ఉంది. ఢిల్లీ హైకోర్టు వెబ్‌సైట్ సమాచారరం ప్రకారం, జస్టిస్ వర్మ 1992 ఆగస్టు 8న న్యాయవాదిగా నమోదు అయ్యారు. ఆయన 2014 అక్టోబర్ 13న అలహాబాద్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియుక్తుడయ్యారు. ఆయన 2016 ఫిబ్రవరి 1న అలహాబాద్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ఆ తరువాత 2021 అక్టోబర్ 11న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా నియుక్తుడయ్యారు. ఆయన ప్రస్తుతం అమ్మకం పన్ను, జిఎస్‌టి, కంపెనీ అప్పీళ్లు, ఇతర అప్పీళ్ల కేసులను పరిశీలిస్తున్న డివిజన్ బెంచ్‌కు సారథ్యం వహిస్తున్నారు. ఇది ఇలా ఉండగా, ఢిల్లీ హైకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తుల్లో రెండవ స్థానంలో ఉన్న జస్టిస్ వర్మ శుక్రవారం కోర్టులో బాధ్యతలు నిర్వర్తించలేదు. ఆ విషయాన్ని హైకోర్టు మాస్టర్ న్యాయవాదులకు తెలియజేశారు. కాగా, సీనియర్ న్యాయవాది ఒకరు బెంచ్ ముందు ఈ అంశం ప్రస్తావించినప్పుడు ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డికె ఉపాధ్యాయ బాధ, దిగ్భ్రాం÷–రతి వ్యక్తం చేశారు.

# విశాఖ మహానగర పాలక సంస్థ కొత్త మాస్టర్ ప్లాన్

**(మొదటి పేజీ తరువాయి..)**

సమీక్షించినట్లు తెలిపారు. ప్రజలు, నేతల అభిప్రాయాలతో నాలుగు నెలల్లో కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు– తెలిపారు. విశాఖ మెట్రో రైల్‌పైనా సమావేశంలో చర్చించామన్నారు. టీడీఆర్ బాండ్ల విషయంలో గతంలో అక్రమాలు జరిగాయని.. విశాఖలో 600కు పైగా టీ–డీఆర్ బాండ్లు పెండింగ్‌లో ఉన్నట్లు– చెప్పారు. వీటిని విశాఖ కలెక్టర్ త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయానికి ఇబ్బంది లేకుండా రోడ్లు ఏర్పాటు– చేస్తామన్నారు. వైకాపా హయాంలో మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా డీవియేషన్ జరిగిందని మంత్రి తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ–, ఇతర ట్రాఫిక్ సమస్యలపై ఈ సమావేశంలో చర్చించారు. గతంలో స్వార్థం కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించారని చెప్పారు. ఫైనల్ చేసిన మాస్టర్ ఎ÷–లాన్‌ను ఆన్‌లైన్‌లో ఉంచుతామని మంత్రి నారాయణ అన్నారు. ప్రజల నుంచి అభిప్రాయం తీసుకుని మాస్టర్ ప్లాన్ నాలుగు నెలల్లో ఫైనల్ చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. మాస్టర్ ప్లాన్ అంటే రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని చేయాలని చెప్పారు. కొన్ని చోట్ల రోడ్ల పరిధిని పెంచడంపై అధికారులతో చర్చించినట్లు– చెప్పారు. మెట్రో రైల్ కూడా మాస్టర్ ఎ÷–లాన్‌లో భాగమేనని తెలిపారు. 8 క్రాస్ రోడ్ల దగ్గర ఫ్లై ఓవర్లు ఉన్నాయని చెప్పారు. ఇక్కడ డబుల్ డెక్కర్ రోడ్లు ప్లాన్ చేసేలా ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలను చెప్పారని అన్నారు. టీడీఆర్ బాండ్ల విషయం అందరికీ తెలుసునని చెప్పారు. టీ–డీఆర్ బాండ్లపై అన్ని మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్ జరుగుతోందని తెలిపారు. త్వరలోనే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్‌లో తీసుకువచ్చిన సంస్కరణల అమలు, మరిన్ని మార్పులపై మంత్రి నారాయణ చర్చించారు. భవన నిర్మాణాలకు అనుమతులను మరింత సులభతరం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశానికి మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యులత, క్రెడాయ్, నరెడ్కో, ఎల్టీపీ అసోసియేషన్‌ల ప్రతినిధులు హాజరయ్యారు. భవన నిర్మాణాలకు సెట్ బ్యాక్ నిబంధనలు సరళతరం చేసేలా చర్చించినట్లు– మంత్రి నారాయణ తెలిపారు. ఇటీవల తీసుకువచ్చిన సంస్కరణలను పగడ్బందీగా అమలు చేయడంపై మంత్రి నారాయణ పలు సూచనలు జారీ చేశారు. వైజాగ్ అభివృద్ధిపై సమీక్షలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నామని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ తెలిపారు. గతంలో ఇష్టానుసారంగా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేశారని అన్నారు. ప్రజల అభిప్రాయం తీసుకుని మాస్టర్ ప్లాన్ మళ్లీ రూపొందించే ఆలోచన చేశామని చెప్పారు. నాలుగు నెలల్లో మాస్టర్ ఎ÷–లాన్ పక్కగా ఉండేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. 22ఏ భూములు, తాగు నీటి సమస్యలు, బీచ్ క్యారీడర్, ఇలా కొన్ని సమస్యలు ఉన్నాయన్నారు. చాలా కాలంగా అనకాపల్లి, గాజువాక భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటి పరిష్కారానికి మంత్రి నారాయణ ఆమోదం తెలిపారని కొణతాల రామకృష్ణ అన్నారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష చేయడం మంచిదేనని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. కొన్ని రోడ్లకు పక్కన చిన్న చిన్న స్థలాలు ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వీటికి సంబంధించి ఇబ్బందులు లేకుండా చూడమని మంత్రి నారాయణను కోరామని అన్నారు. అధికారులు మారడం వల్ల అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మాస్టర్ ఎ÷–లాన్‌పై సమీక్ష విస్తృతంగా చేయాలని చెప్పామని పల్లా శ్రీనివాసరావు అన్నారు. విజన్ 2047పై ఫోకస్ పెట్టినట్లు–గానే వైజాగ్ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు. రాష్ట్రంలో మున్సిపల్ శాఖా చాలా కీలకమని అన్నారు. వైజాగ్ మాస్టర్ ఎ÷–లాన్‌లో కొన్ని లొసుగులు ఉన్నాయని చెప్పారు. ఇవన్నీ సెట్ రైట్ చేయాలని కోరామన్నారు. వీఎంఆర్డీఏ నుంచి కార్పొరేట్ ఆస్పత్రికి భూములు ఇచ్చి పదిశాతం వరకు ఉచిత వైద్యం చేయాలని చెప్పామని.. అది జరగడం లేదని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు.

# రాజకీయ లబ్ధికోసమే హిందీ వివాదం


అమిత్ షా దుయ్యబట్టారు. భాష పేరిట ఇప్పటికే దేశంలో చాలా వరకు విభజన వచ్చిందని, ఇకపై ఎంతమాత్రం జరగబోదని రాజ్యసభలో వ్యాఖ్యానించారు. దక్షిణాది భాషలకు కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకమని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అమిత్‌షా మండిపడ్డారు. అలాగైతే తాను గుజరాత్ నుంచి, నిర్మలా సీతారామన్ తమిళనాడు నుంచి ప్రభుత్వంలో మంత్రులుగా ఎలా వ్యవహరిస్తున్నామని ప్రశ్నించారు. ఇంజినీరింగ్, మెడికల్ విద్యను తమిళంలో అందించాలని తమిళనాడు ప్రభుత్వానికి గత రెండేళ్లుగా కోరుతున్నా. దానివల్ల మీ ఆర్థిక ప్రయోజనాలు నెరవేరవని భయపడుతున్నారని డిఎంకెకు చురకలంటించారు. మేం అధికారంలోకి వస్తే మెడికల్, ఇంజినీరింగ్ విద్యను తమిళ భాషలోనే అందిస్తాంమని అమిత్‌షా అన్నారు. తమిళనాడు అసెంబ్లీకి వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. హిందీ ఏ భాషకూ పోటీ కాదని, అన్ని భాషలకూ సోదర భాష అని పేర్కొనారు. ఈ మేరకు రాజ్యసభలో ఆయన వివిధ అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య జాతీయ విద్యావిధానం, త్రిభాష అంశంపై వివాదం నెలకొన్న వేళ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కొన్ని పార్టీలు తమ సొంత రాజకీయ ప్రయోజనాల కోసం భాష అంశాన్ని వివాదం చేస్తున్నాయి. వారి అవినీతిని దాచుకునే ప్రయత్నిస్తున్నాయి. దేశంలోని అన్ని భాషలూ దేశానికి ఓ నిధి లాంటిది. హిందీ కూడా ఇతర భాషలకు సోదర భాషే అని అమిత్ షా అన్నారు. భాష పేరిట విభజన తీసుకొచ్చేందుకు చేపట్టే చర్యలేవీ ఫలించవన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యభాషా విభాగాన్ని ఏర్పాటు– చేసిందని చేశారు. తెలుగు, తమిళం, పంజాబీ, అస్సామీ.. ఇలా అన్ని భాషలనూ ప్రాచుర్యం కల్పించడం దీని



ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఇకపోతే ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదం పట్ల కఠిన వైఖరి అనుసరిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. కశ్మీర్‌లో ఇప్పుడు సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని, అక్కడి యువకులు ఉద్యోగాలు చేసుకుంటు–న్నారని తెలిపారు. సినిమాహాళ్లు నిండుతున్నాయని వెల్లడించారు. గత ప్రభుత్వాల పనితీరుపై మండిపడ్డారు. అవి ఉగ్రవాదుల పట్ల మెతకవైఖరి అనుసరించాయని దుయ్యబట్టారు. జమ్మూకశ్మీర్, ఈశాన్య భారతంలోని ఉగ్రవాదం, తీవ్రవాదం దేశ వృద్ధికి ఆటంకాలు. వాటి వల్ల 92వేల మంది ప్రాణాలు కోల్పోయారు. మోదీ ప్రభుత్వ పాలనలో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం వల్ల మరణాలు 70 శాతం తగ్గాయి. ఉగ్రఘటనలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా 'ఒకే రాజ్యాంగం– ఒకే జెండా' అనే రాజ్యాంగ నిర్మాతల కలను మోదీ ప్రభుత్వం నెరవేర్చింది. ఇప్పుడు కశ్మీర్‌లో సాయంత్రం పూట కూడా సినిమాహాళ్లు తెరిచే ఉంటు–న్నాయి. జీ20 సమావేశాలు జరిగాయి. 2019 నుంచి 2024 వరకు అక్కడి యువతకు 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య, పెట్టు–బడులు పెరిగాయన్నారు. ఉరి, పుల్వామా ఘటనలు జరిగిన రోజుల వ్యవధిలో మెరుపు దాడులు, వైమానిక దాడులు చేసిన ఈ ప్రభుత్వం పాకిస్థాన్‌కు గట్టి బదులిచ్చింది. అలాగే మార్చి 31, 2026 నాటికి వామపక్ష తీవ్రవాదం అంతమవుతుంది. రాజకీయ భావజాలం మద్దతున్న ఉగ్రవాదాన్ని విస్తరించకుండా అడ్డుకుంటాం. అలాగే రూ.1.25 లక్షల కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేశామని కేంద్రహోంశాఖ పనితీరుపై చర్చ సందర్భంగా అమిత్ షా వెల్లడించారు.

# తెలంగాణలో వడగళ్ల వానలు

- వాతావరణ కేంద్రం హెచ్చరిక
- పలు జిల్లాల్లో వడగళ్ల వానలు



**హైదరాబాద్,మార్చి21( వెలుతురు):**
తెలంగాణలోని పలు చోట్ల ఉరుములు మెరుపులు, వడగళ్లతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇదే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. ఆదివారం కొన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉండొచ్చని అంచనా వేసింది. కాకపోతే, ఈదురు గాలులు మాత్రం గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని పేర్కొంది. రాగల మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సామాన్యంగా ఉండడంతో పాటు– క్రమంగా పెరిగే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం సంచాలకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇకపోతే ఎండలు మండిపోతున్న వేళ తెలంగాణలోని పలు జిల్లాల్లో అకాల వర్షం అకాల కురిసింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌లలో పలుచోట్ల వర్షం కురవగా.. మరికొన్నిచోట్ల వడగళ్లతో పడిన వానలకు పంటలు దెబ్బతిన్నాయి. నిజామాబాద్ జిల్లాలో ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో వర్షం కురిసింది. ధర్పల్లిలోని వాడి గ్రామంలో వడగళ్ల వానకు వరిధాన్యం నేలరాలింది. మెదక్ పట్టణంలోని జంబికుంట వీధిలో ఓ ఇంటిపై పిడుగు పడింది. దీంతో సిద్ధయ్య అనే వ్యక్తి ఇంట్లో సామగ్రి ధ్వంసమైంది. ఆ సమయంలో మనుషులు ఎవరూ ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కరీంనగర్‌లోని చొప్పదండి మార్కెట్లో మొక్కజొన్న తడిసిపోయింది. మెదక్ పట్టణం, మెదక్, పాపన్నపేట మండలాల్లో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి మామిడికాయలు నేలారాలాయి. సిద్ధిపేట జిల్లాలో దుబ్బాక, మిర్దొడ్డి, తొగుట మండలాల్లో వర్షం కురిసింది.

# వివేకా హత్య కేసు విచారణలో కీలక పరిణామం

- సిబిఐని ప్రతివాదిగా చేర్చాలని సునీత వినతి
- కేసు విచారణపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్




**హైదరాబాద్,మార్చి21( వెలుతురు):**
మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణపై తెలంగాణ హైకోర్టులో వివేకా కుమార్తె సునీత పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ఆమె సీబీఐని ప్రతివాదిగా చేర్చారు. సీబీఐ కోర్టులో తన తండ్రి హత్య కేసును రోజువారీగా విచారించేలా ఆదేశించాలని పిటిషన్‌లో ఆమె కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రస్తుతం ఈ కేసు సీబీఐ కోర్టులో విచారణలో ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటికే దాదాపు నాలుగేళ్లుగా ఈ కేసు విచారణ కొనసాగుతున్నా.. పురోగతి ఏమీ లేదని సునీత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టులో విచారణ సందర్భంగా సునీత తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. 2019 మార్చి 14న అర్ధరాత్రి ఈ హత్య చోటు–చేసుకుందని.. సీబీఐ అధికారులు విచారణ చేపట్టి ఇప్పటికే రెండు ఛార్జిషీట్‌లు దాఖలు చేశారన్నారు. ఇంకా సీబీఐ కోర్టులోనే విచారణ కొనసాగు తోందని.. దీన్ని ఆరు నెలల్లోగా ముగించేలా కోర్టును ఆదేశించాలని హైకోర్టును కోరారు. సీబీఐ అధికారులు ఇప్పటికే కొన్ని పత్రాలకు సంబంధించి హార్డ్ డిస్క్‌లో ప్రతివాదుల తరఫు న్యాయవాదులకు ఇచ్చారనీ.. అయితే, హార్డ్‌డిస్క్‌లో ఉన్న కాపీలు ఓపెన్ కావడంలేదు గనక నేరుగా ప్రింటింగ్ ప్రతులు కావాలని వారు కోరిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే, లక్షల సంఖ్యలో పేజీలు ఉండటంతో ప్రింటింగ్‌కాపీలు ఇవ్వడం కుదరదు గనక హార్డ్ డిస్క్‌లను ఓపెన్ చేయాలని సీబీఐ అధికారులు చెబుతుండటంతో.. దాదాపు 15 నెలలుగా విచారణ ముందుకు సాగడంలేదని సునీత న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, సునీత ప్రధానంగా సీబీఐ అధికారులతో పాటు– తన తండ్రి హత్య కేసులో నిందితులుగా ఉన్నవారందరినీ ప్రతివాదులుగా చేర్చారు. ఈ అంశంపై విచారణ జరిపిన ప్రత్యేక ధర్మాసనం సీబీఐతో పాటు– ఈ కేసులో నిందితులందరికీ నోటీ–సులు వ్యక్తిగతంగా నోటీ–సులు ఇచ్చేందుకు సునీత న్యాయవాదికి అనుమతి ఇచ్చింది. ఈ కేసు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# తెలంగాణలో ఆన్‌లైన్ గేమింగ్‌ను బ్యాన్

- సైబర్ సెక్యూరిటీ అడిషనల్ ఎస్పీ వెల్లడి

**హైదరాబాద్,మార్చి21( వెలుతురు):**
తెలంగాణలో ఆన్‌లైన్ గేమింగ్‌ను బ్యాన్ చేశారు. బెట్టింగ్ యాప్స్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్యపై సరైన క్లారిటీ లేదని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అడిషనల్ ఎస్పీ ప్రసాద్ అన్నారు. 2017 గేమింగ్ యాక్ట్ ప్రకారం తెలంగాణాలో ఆన్‌లైన్ గేమింగ్ బ్యాన్ అయింది.. మొత్తం 108 ఇల్లీగల్ యూఆర్ఎస్‌లను బ్లాక్ చేశాం.. చైనీస్ యూఆర్ఎల్‌లను ఫాలో కాకుండా అనేక ఇల్లీగల్ పంపుతున్నారు.. ప్రజలకు తమ మొబైల్స్ ద్వారా వచ్చే పాప్ అప్స్ పైనా సైబర్ క్రైమ్ కు ఫిర్యాదు చేస్తే వాటిని బ్లాక్ చేస్తామన్నారు. వేరు వేరు ప్రాంతల నుంచి ఫేక్ జీపీఎస్ ద్వారా జీయో ఫెన్సింగ్ యాక్సెస్ జరుగుతుంది.. స్కిల్ గేమింగ్ అని చెప్పే మాటలు అబద్ధం.. గేమింగ్ ద్వారా నష్టపోయిన ఒక్క గెమింగ్ కంపెనీ లేదని పేర్కొన్నారు. అయితే, గేమింగ్ కంపెనీ ఏర్పాటు– చేసిన సాఫ్ట్ వేర్ వారు పన్నిన పన్నాగం మాత్రమే.. స్కిల్ గేమ్స్, ఆన్‌లైన్ గేమ్స్ కు దూరంగా ఉండాలి అని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అడిషనల్ ఎస్పీ ప్రసాద్ సూచించారు. స్కిల్ గేమ్, నాన్ స్కిల్ గేమ్స్ తో సంబంధం లేదు.. ప్రతి గేమ్ వలన నష్టాలు ఉన్నాయి.. స్కిల్ గేమ్స్, నాన్ స్కిల్ గేమ్స్ పైనా లీగల్ అభిప్రాయాలు తీసుకుని ముందుకు వెళ్తామని చెప్పుకొచ్చారు. భారత చట్టాల ప్రకారం ఇన్‌ఫ్లుయెన్సర్లపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

# అడవుల చెంతకు సాంకేతిక విద్య

- మంత్రి సీతక్క
- విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు

**వెలుతురు , ములుగు జిల్లా, మార్చి 21:**
అడవుల చెంత నుంచి సాంకేతిక భవిష్యత్తు వైపు అడుగులేస్తున్న ములుగు జిల్లా అని ప్రపంచం ఏఐ వైపు పరుగెడుతుంటే, తండాలు, గూడాల్లోని అట్టడుగు వర్గాల విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సీతక్క అన్నారు, తెలంగాణ రాష్ట్రం లో ములుగు జిల్లా వెనుక బడిన గిరిజనులుండే అటవీ ప్రాంతంలో తాము సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు, గిరిజన అభివృద్ధి కోసం చిన్న ప్రయత్నం చేస్తున్నామని విద్యా సమానత్వమే నిజమైన అభిరుద్దే ధ్యేయమని మంత్రి సీతక్క తెలిపారు, అలాగే



ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి తో పాటుగా ఆదివాసీ గిరిజన విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రీ సీతక్క అన్నారు.

అలాగే ములుగు జిల్లాలోని అన్ని గిరిజన గ్రామాల్లో గిరిజనులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు, గిరిజనులకు మెరుగైన సంకేతవిద్య అందిస్తామని ఇక్కడి




గిరిజనుల విద్యార్థులు ప్రపంచం లో ఎక్కడ అయిన పోటీ పడే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అందులో భాగంగానే గిరిజనుల విద్యార్థుల అభ్యున్నతికి కంప్యూటర్ల విద్య అందించడం జరుగుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు

# కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో చామన్ పల్లిలో ఈరోజు ఉదయం 'ఉచిత మెగా వైద్య శిబిరం'

- అవసరమైన వారికి వెంటనే ఆపరేషన్, చికిత్స చేసేలా చర్యలు
- ఈ సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరిన మెడిసిటీ యాజమాన్యం

**కరీంనగర్ వెలుతురు మార్చి 21:**
కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈరోజు (శనివారం) కరీంనగర్ లోని చామన్ పల్లిలో మెడిసిటీ హాస్పిటల్ 'ఉచిత మెగా వైద్య శిబిరం' నిర్వహిస్తోంది. చామన్ పల్లిలోని గందె రామారావు కళ్యాణ మండపంలో ఉదయం 8 గంటలకు ఈ వైద్య శిబిరాన్ని బండి సంజయ్ ప్రారంభిస్తారు. సాయంత్రం వరకు నిర్వహించే ఈ శిబిరంలో జనరల్ సర్జన్స్, ఈఎన్టీ, నేత్ర వైద్యులు, గైనకాలజిస్ట్, స్కిన్ స్పెషలిస్టులు హాజరవుతారు. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరం ఉన్న వారికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహిస్తారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో ఆపరేషన్, చికిత్స అవసరమైన వారికి ప్రత్యేక బస్సుల్లో మేడ్చల్ లోని



మెడిసిటీ ఆసుపత్రికి తరలించి ఆపరేషన్ నిర్వహిస్తారు. రోగులకు అవసరమైన భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామని మెడిసిటీ యాజమాన్యం పేర్కొంది. వ్యాధి నిర్ధారణ పరీక్షలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ, ఆధార్ కార్డులను వెంట తీసుకుని రావాలని కోరారు.

# ఉద్యోగాల భర్తీకి తక్షణ నోటిఫికేషన్లు

- ఓయూలో తెలంగాణ జెఎసి ఆందోళన

**హైదరాబాద్,మార్చి21( వెలుతురు):**
రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మెయిన్ లైబ్రరీ ఎదుట నిర్వహించిన నిరసన అనంతరం జేఏసీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా చట్టబద్ధమైన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో హామీ ఇచ్చిన ప్రకారం ఇప్పటివరకు 13 ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. నోటిఫికేషన్లు ఇంకా విడుదల చేయొద్దని నిరుద్యోగులు కోరుతున్నారని డిప్యూటీ– సీఎం బట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సంవత్సరానికి రెండున్నర లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని దుయ్యబట్టారు . నోటిఫికేషన్లు విడుదల



చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వచ్చేనెల 1వ తేదీ లోపు నోటిఫికేషన్లు విడుదల చేయకపోతే వచ్చే నెలలో సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిరుద్యోగులతో భారీ సింహగర్జన నిర్వహించనున్నట్లు– తెలిపారు. అప్పటికి స్పందించకపోతే ఢిల్లీలోని ఏఐసిసి కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని ప్రకటించారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ అంశంపై చర్చించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరారు.

# సిఎంతో బిఆర్ఎస్ ఎమ్మెల్యేల భేటీ

- అభివృద్ధి పను గురించి మాట్లామన్న హరీష్ రావు
- మెడికల్ సీట్లు పెంచాలని కోరిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



**హైదరాబాద్,మార్చి21( వెలుతురు):**
తెలంగాణ అసెంబ్లీలోని సీఎం ఛాంబర్ లో రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, పద్మారావు కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో అరగంటకు పైగా ఇద్దరు భేటీ అయ్యారు. ఇక, సమావేశం తర్వాత మాజీ మంత్రి హరీష్ రావు, పద్మారావు మీడియాతో చిట్ చాట్ చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఉన్న సమస్య కోసం సీఎం దగ్గరకు వెళ్ళాం.. మేము వెళ్లేసరికి సీఎం రూమ్ నిండా మంది ఉన్నారు.. 15 నిమిషాల పాటు రేవంత్ రెడ్డితో ఏమి మాట్లాడలేదు.. ఆ తర్వాత పద్మారావు నియోజకవర్గంలో కేసీఆర్ మంజూరు చేసిన హై స్కూల్, కాలేజీ పనులను వెంటనే ప్రారంభించాలి కోరాం.. సీఎం వెంటనే వేం నరేందర్ రెడ్డికి ఓ పేపర్ ఇచ్చి చేయమని చెప్పారు.. పద్మారావు రమ్మన్నాడు అని నేను కూడా వెళ్ళాను అని హరీష్ రావు చెప్పుకొచ్చారు. ఇక, డీ లిమిటేషన్ పై కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో పెట్టిన మీటింగ్ ను బహిష్కరించామని హరీష్ రావు తెలిపారు. చెన్నైలో జరిగే మీటింగ్ కాంగ్రెస్ ఆర్గనైజ్ చేయట్లేదు అని వెల్లడించారు. డీఎంకే పార్టీ వాళ్ళు పిలిచారు అని మేము వెళ్తున్నాం.. డీఎంకే మాకు ఫ్రెండ్లీ పార్టీ అని పేర్కొన్నారు. అయితే, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై పీసీ ఘోష్ కమిటీ నివేదిక గురించి నాకు తెలియదు.. అది ఎప్పుడు వస్తుందో కూడా నాకు గుర్తు లేదు అని తేల్చి చెప్పారు. అలాగే, వీరితో పాటు మాజీ మంత్రి మల్లారెడ్డి ఫ్యామిలీ సైతం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. మెడికల్ కాలేజీ సీట్ల పెంపు కోసం ముఖ్యమంత్రిని కలిసినట్లు– తెలిపారు.

# ప్రజాప్రతినిధులపై కేసులపై హైకోర్టు విచారణ

**హైదరాబాద్,మార్చి21( వెలుతురు):**
ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ పురోగతిపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ అంశంపై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం శుక్రవారం విచారించింది. మాజీ ఎంపీ హరిరామజోగయ్య దాఖలు చేసిన ప్రయోప్రయోజన వ్యాజ్యాన్ని కలిపి విచారణ జరిపింది. జగన్‌పై నమోదైన సీబీఐ, ఈడీ కేసులను వేగంగా విచారించాలని హరిరామజోగయ్య గతంలో ఫిర్యాదు చేశారు. తెలంగాణలోని వివిధ కోర్టుల్లో ప్రజాప్రతినిధులపై 309కి పైగా కేసులున్నాయని ఏఏజీ కోర్టుకు తెలిపారు. విచారణలో పురోగతిపై కౌంటర్ దాఖలకు సమయం కోరారు. విచారణ వేగవంతం చేయాలని హైకోర్టు ఆదేశించిందని హరిరామజోగయ్య తరఫు న్యాయవాది తెలిపారు. మార్చి 31వరకు ఉన్న కేసుల పురోగతి తెలపాలని ఏఏజీకి ఆదేశించిన ప్రత్యేక ధర్మాసనం.. అందుకు నాలుగు వారాల సమయం ఇచ్చింది.



# ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- సీఎం రేవంత్ రెడ్డి

- అకాల వర్షాలు కురుస్తాయని హెచ్చరికల నేపథ్యంలో సీఎం అధికారులకు ఆదేశాలు



(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 21:**
ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో ఈదురు గాలులు, వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముందస్తు చర్యలు చేపట్టాలని అప్రమత్తం చేశారు. వెంటనే సంబంధిత జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. తర్వాత సంబంధిత జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన శాంతి కుమారి రానున్న 48 గంటలలో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని సూచన ఉన్నందున అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలంటూ అవసరమైన సూచనలు చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై అనుమానాలు

- బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 21:**
రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై మాకు అనుమానాలు ఉన్నాయని బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీ జనాభా కుల గణనలో తగ్గించి చూపించారని విమర్శలు గుప్పించారు,రాష్ట్రంలో 56% ఉన్న బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వడం ఆహ్వానిస్తున్నాం కానీ, దానిలో ముస్లిం మైనార్టీలకు 10% మతపరమైన రిజర్వేషన్లు వ్యతిరేకిస్తున్నామని పాయల్ శంకర్ అన్నారు,కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్ర బీసీలు గమనిస్తున్నారని చెప్పారు,ముస్లిం మైనార్టీలకు 10% ఇస్తే ఇది బీసీలను మోసం చేసినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు,ముస్లిం మైనార్టీలకు మతపరమైన రిజర్వేషన్లు మేము కల్పించమని ప్రభుత్వం ప్రతిపాదించాలని డిమాండ్ చేశారు.బీసీలు ప్రభుత్వాన్ని నిక్కచ్చిగా అడగాలని కోరారు,మేము అడిగినా దీనికి సమాధానం రాలేదనీ చెప్పారు, ప్రభుత్వానికి సమయం ఇస్తున్నాం. ఈలోపు నిర్ణయం తీసుకోకపోతే సోమవారం జరిగే చర్చలో దీన్ని అసెంబ్లీలో లేవనెత్తుతామనీ అన్నారు,డీలిమిటేశన్ విషయం ఇంకా కొలిక్కి రాలేదు. అప్పుడే కాంగ్రెస్, తెరాస చెన్నయ్ లో జరిగే సభకు పోతున్నాయని అంటున్నారు తెరాస, కాంగ్రెస్ రెండు ఒక్కటే అని అర్థం అవుతోందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు,.

# సంపాదకీయం..

## దక్షిణాధిపత్య రాజకీయం !

దక్షిణ రాష్ట్రాల్లో పాగా వేయలన్నది బిజెపి ఆశ..దాన్ని ద్దుకోవాలన్నది డిఎంకె తదిర ప్రాంతీయ పార్టీల వ్యూహం. అందుకే తొలుత హిందీ వ్యతిరేకతతో మొదలైన యుద్దం ఇప్పుడు డీ లిమిటేషన్ వ్యవహారం తెరపైరకి తెచ్చారు. నిజానికి డీ లిమిటేషన్ వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదు. అయితే రాజకీయం కనుక రచ్చ చేయాలన్నదే రాకీయ పార్టీల లక్ష్యం. మొన్న పార్లమెంట్ ఎన్నిల్లో బిజెపి కోరుకున్న 400 మార్కును దాటలేక పోయారు. దీంతో కొత్త వ్యూహాలను అమలు చేసేందుకు సిద్దం అవుతారని అందరికీ తెలుసు. బిజెపిని అధికారం నుంచి తొలగించకుండా పక్కాగా ప్లాన్ చేయడమెలా అన్నది మోడీ ద్వయానికి బాగా తెలుసు. అందుకే వారు దక్షిణాది వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఉత్తరాదిలో రాముడు రక్షిస్తాడన్న ధీమా వచ్చేసింది. రామనామం ఉత్తరాదిలో ఊపేస్తోంది. అనన్య సాధ్యమైన అయోధ్య సాకారం అయ్యింది. దీంతో ఉత్తరాదిలో బిజెపికి తిరుగులేదన్న విధంగా పరిస్థితులు ఉన్నాయి. కానీ దక్షిణాది పరిస్థితి వేరు. కర్నాటక కూడా చేజారిపోయింది. తెలంగాణలో వచ్చిన అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకున్నారు. తెలంగాణలో 17 సీట్ల కోసం పోటీపడి 8సీట్లు సాధించారు. ఇదే తరహాలో మిగతా రాష్ట్రాల్లోనూ గెలవాల్సి ఉంది. ఒడిషాలో అధికారం చేపట్టారు. అందుకే తమిళనాడు, కర్నాటక, కేరళ, తెలంగాణల్లో పట్టు సాధించేంవదుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. దక్షిణాదిని గుప్పిట పెట్టుకోవాలని పట్టుదలగా ఉన్నారని కనిపిస్తోంది. తాజాగా కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ దారికొచ్చారు. మోడీని, ఆయన విదేశాంగ విధానాన్ని సమర్థిస్తున్నారు. ఇలా కొందరు నేతలతో బిజెపిని పొగిడించుకోవడం కూడా ఓ ఎత్తుగడే. తమిళనాట అన్నాడిఎంకె దూరమైనా చిన్నాచితక పార్టీలతో జతకట్టారు. గవర్నర్‌గా ఉన్న తమిళసై మళ్లీ రాజకీయ అరంగేట్రం చేసినా ఫలితం దక్కలేదు. అయితే అన్నామలై అక్కడ గట్టిగానే పోరాడుతున్నారు. బిజెపిని ముందునుంచి ప్రజలు ఉత్తరాది పార్టీగానే గుర్తిస్తూ వచ్చారు. అయితే దానిని తిరగరాస్తూ కర్నాటకలో కాలుమోపారు. కానీ స్థానిక నాయకత్వం నిర్లక్ష్యం, అవినీతి కారణంగా గత అసెంబ్లీ మూల్యం చెల్లించుకోక తప్పలేదు. బిజెపి జాతీయవాదానికి దేశవ్యాప్త ఆమోదం కోసం యత్నిస్తోంది. భారతదేశంలో బిజెపి అంతటా విస్తరించిందని చెప్పుకోవడం కూడా అవసరం. అందుకే విజయం కోసం భారతీయ జనతాపార్టీ తీవ్రంగా యత్నిస్తోంది. గత పదేళ్ల బిజెపి పాలనా కాలం తీసుకుంటే అన్ని రాష్ట్రాల్లో విస్తరించేందుకు చేయని ప్రయత్నం లేదు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా అభివృద్ధి, సెంటిమెంట్ ఎజెండాలను కలుపుకుని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈశాన్యంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధికి పెద్దపీట వేసింది. బెంగాల్ లోను, దక్షిణ రాష్ట్రాల్లో గెలుపు కోసం బూత్‌లెవల్ కార్యాచరణను అమలు చేస్తోంది. క్షేత్రస్థాయి నుంచి పనిచేసుకుంటూ పథకం ప్రకారం బలాన్ని పెంచుకోగలిగిన శక్తిని బీజేపీ ప్రదర్శిస్తోంది. కార్యశీలురైన నాయకులు, కార్యకర్తలు దండిగా ఉన్నారు. ఫలితాలు ఎట్లా ఉన్నా, వారు అలుపెరగకుండా ప్రయత్నాలన్ని చేస్తూనే ఉన్నారు. కర్ణాటక అపజయం బీజేపీకి కొత్తేమీ కాదు. పొత్తులతోనో, ఫిరాయింపులతోనో బీజేపీ కర్ణాటకలో ఒకటి రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు ఒక మైనర్ భాగస్వామిగా అయినా ప్రభుత్వంలో ఉన్నది. తెలంగాణలో తగినంత ఉనికితో ఎప్పటి నుంచో సత్తా చాటుతోంది. గత పార్లమెంటు ఎన్నికలలో 8 స్థానాలతో, సుమారు 20 శాతం ఓట్లతో తన ఉనికిని విస్తరించుకోగలిగింది. కేరళలో 2016లో ఒక ఎమ్మెల్యేను గెలిపించుకున్న బీజేపీ, 2021లో 11 శాతానికి పైగా ఓట్లను సంపాదించింది. అక్కడక్కడా ఉనికిలో ఉన్నప్పటికీ దక్షిణాది ఇంకా పట్టుబడలేదన్న లోటు మాత్రం బీజేపీకి ఉన్నది. దక్షిణాదిలో విస్తరించాలన్న ఆకాంక్ష బీజేపీకి, మోదీకి అంతిమలక్ష్యంగా మారింది. అందుకే దక్షిణాదిపై ఎక్కువగా దృష్టి సారించారు. తమిళనాట చెలరేగుతున్న నిరసలు, ఉద్యమాలను తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. హిందీ వ్యతిరేకతను ప్రజలే ఛీత్కరించుకునేలా చేస్తున్నారు. డీలిమిటేషన్ కారణంగా ఉత్తరాదిలో మరిన్ని సీట్లు పెరిగే అవకాశమున్నట్లు డిఎంకు తదితర పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. తమిళనాడు, కేరళల్లో ప్రస్తుతానికి పరిస్థితి ఆశాజనకంగా ఉంది. మోడీ వ్యక్తిగత ఛరిష్మా కూడా పనిచేస్తోంది. ఆ రెండు రాష్ట్రాల్లో గతం కంటే ఓట్లు, సీట్లు పెంచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కర్ణాటకలో ఇప్పటికే కాంగ్రెస్ పాలన మీద విముఖత కలిగిందన్న ప్రచారం మొదలయ్యింది. గతంలో ఉన్న బలాన్ని నిలుపుకోవడం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమి ఏర్పాటు కావడంతో అక్కడ విజయం సాధించడం ద్వారా కొంత పట్టు నిలుపుకుంది. పవన్ కళ్యాణ్ పేరుకు జనసేనానిగా ఉన్నా, ఆయన ఆశలు,ఆశయాలు బిజెపితో పెనవేసుకుంటున్నాయి. ఆయన వీరికి తురుపుముక్కగా ఉంటారనడం లో సందేహం లేదు. ఈ కలయిక దీర్ఘకాలికంగా బీజేపీ విస్తరణ ప్రయత్నాలకు తోడ్పడగలదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభావం గణనీయంగానే పెరిగింది. ఇప్పుడది ఆ పార్టీకి కీలకమయిన విజయం అవుతుందని భావిస్తోంది. తెలంగాణలో అధికప్రభావం చూపగలిగితే కనుక, బీజేపీ వెంటనే రెండో స్థానానికి, అతి త్వరలో అధికారస్థానానికి చేరుకోగలుగుతుంది. దక్షిణ భారతదేశంలో తమిళనాడుతో పాటు మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో పాగా కోసం బిజెపి అహరహరం అందుకే కృషి చేస్తోంది. డిఎంకె ఎత్తులకు పైఎత్తులు వేస్తోంది. వారు చేసే డీలిమిటేషన్, హిందీవ్యతిరేక ఆందోళనలను తనకు అనుకూలంగా మలచుకుంటోంది. తమిళనాడులో గత బీజేపీకి ప్రస్తుత బీజేపీకి పూర్తిగా తేడా కనిపిస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నామలై బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో పార్టీ బలపడుతూ వస్తోంది. పాదయాత్రలతో పాటు.. డీఎంకే అవినీతిపై ఆయన ఆరోపణలు చేస్తూ.. ఆధారాలు విడుదల చేశారు. దీంతో డీఎంకే సైతం బీజేపీని టార్గెట్ చేయడం మొదలుపెట్టింది. దీంతో డీఎంకే, అన్నాడీఎంకే మధ్య పోరు.. డీఎంకే, బీజేపీగా అన్నామలై మార్చేశారు. ప్రధాని మోదీ సైతం తమిళనాడుపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇలా కేరళలోనూ ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో బిజెపికి కేంద్రంలో అధికారంలో ఉండడం కలసి వస్తోంది.

# నేడు చెన్నైలో జాయింట్ యాక్షన్ కమిటీ భేటీ

- డీలిమిటేషన్‌పై కార్యాచరణపై చర్చ
- సమావేశానాకి సంబంధించి స్టాలిన్ వీడియో విడుదల



**చెన్నై,మార్చి21( వెలుతురు):**
లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రంలోని భాజపాకు, పలు రాష్ట్రాల ప్రభుత్వాలకు మధ్య వివాదం కొనసాగుతున్న వేళ తమిళనాడు సిఎం స్టాలిన్ అధ్యక్షతన శనివారం చెన్నైలో అఖిలపక్ష నేతల భేటీని ఏర్పాటు చేశారు. దీనిపై చర్చించేందుకు పలు రాష్ట్రాల నాయకులతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముందు స్టాలిన్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో జనాభా ప్రాతిపదికన విభజన జరిగితే రాష్ట్రాల హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఎక్స్ వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ– సమావేశానికి హాజరువుతున్న ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ , కేరళ, కర్ణాటక, ఒడిశా, పశ్చిమ బెంగాల్, పంజాబ్ నాయకులకు నా హృదయపూర్వక స్వాగతం. మార్చి 5న జరిగిన అఖిలపక్ష సమావేశం ఒక మైలురాయి. 2026 ఏడాదిలో జరిగే పునర్విభజన జనాభా ప్రాతిపదికన జరిగితే పార్లమెంటులో మన ప్రాతినిథ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. ఇది కేవలం ఎంపీల సంఖ్య గురించి మాత్రమే కాదు.. రాష్ట్ర హక్కుల భంగం గురించి. అందుకే దీనిపై భాజపా తప్ప మిగిలిన పార్టీలన్నీ ఏకమయ్యాయి. తమిళనాడులోని 58 పార్టీలు సైతం విభేదాలను పక్కనపెట్టి సముచితమైన పునర్విభజనకు ఒక్కటయ్యాయి. జనాభా ప్రాతిపదికన పునర్విభజన ను తొలుత తమిళనాడు వ్యతిరేకించింది. దీనికి అన్ని రాష్ట్రాలు చేతులు కలపడంతో ప్రస్తుతం ఇది ఒక జాతీయ ఉద్యమంగా మారింది’ అని స్టాలిన్ పేర్కొన్నారు. ఈసందర్భంగా శనివారం జరిగే సమావేశం దేశ భవిష్యత్తును రూపొందించే ఉద్యమానికి నాంది అని ఆయన అభివర్ణించారు. ఈనెల 5న స్టాలిన్ నేతృత్వంలో చెన్నైలో అఖిలపక్ష సమావేశం జరిగింది. అందులో పునర్విభజనను ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తున్నట్లు అఖిలపక్ష సమావేశం తీర్మానించింది. పార్లమెంటు సభ్యుల సంఖ్యను పెంచే పక్షంలో 1971 జనాభా లెక్కల ఆధారంగా ఇరు సభల్లో రాష్ట్రాల మధ్య ప్రస్తుతమున్న నిష్పత్తి మేరకు నియోజకవర్గాల సంఖ్యను పెంచడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈక్రమంలో పునర్విభజన వల్ల జరిగే నష్టాలు, తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించేందుకు కలిసి రావాలని ఏడు రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ లేఖలు రాశారు. ఈనెల 22న చెన్నైలో నిర్వహించే సమావేశానికి ప్రతినిధులను పంపాలని ఆయన అందులో కోరారు. దీనికోసం తెలంగాణ నుంచి సిఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు.

# హనీట్రాప్‌పై రాజకీయ దుమారం

- సిబిఐ విచారణకు బిజెపి పట్టు
- విచారణలో దోషులను వదలోమన్న సిఎం



**బెంగళూరు,మార్చి21( వెలుతురు):**
కర్ణాటకలో మంత్రులు సహా అనేకమందిపై 'హనీ ట్రాప్' వ్యవహారం అక్కడి రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నది. ఈ విషయాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష భాజపా నేతలు లేవనెత్తడంతో గందరగోళం నెలకొంది. దీనిపై సీబీఐ దర్యాప్తు చేయాలని వారు డిమాండ్ చేశారు. హనీ ట్రాప్‌పై విచారణను పక్కనపెట్టి ప్రభుత్వం ముస్లిం కోటా బిల్లును పాస్ చేయడాన్ని విమర్శిస్తూ.. స్పీకర్ చుట్టూ చేరి నిరసన తెలిపారు. భాజపా నేతల తీరుపై రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకసారి కేసు నమోదై.. దర్యాప్తు ప్రారంభం అయితే హనీట్రాప్‌లో ఎవరి ప్రమేయం ఉన్నట్లు– తేలినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వానికి ఎవరినీ రక్షించే ఉద్దేశం లేదని.. చట్టప్రకారం దోషులకు తప్పక శిక్ష పడుతుందని వ్యాఖ్యానించారు. ఉన్నతస్థాయి కమిటీ–తో విచారణ జరిపిస్తామని హోంమంత్రి జి.పరమేశ్వర హామీ ఇచ్చినప్పటికీ అసెంబ్లీలో భాజపా నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని సీఎం విమర్శించారు. దీంతో 15 నిమిషాల పాటు సభ వాయిదా పడినట్లు తెలుస్తోంది.రాష్ట్రానికి చెందిన అనేకమంది రాజకీయ నేతలు హనీ ట్రాప్‌లో చిక్కుకుపోయారని కర్ణాటక సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న ఇటీ–వల అసెంబ్లీలో పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైంది. తనకు తెలిసినంతవరకు కనీసం 48 మంది ఇందులో బాధితులుగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. సీడీలు, పెన్‌డ్రైవ్‌లలో వారి అసభ్య వీడియోలు ఉన్నాయన్నారు. ఇది ఏ ఒక్క పార్టీకో పరిమితమైన విషయం కాదన్నారు. అధికారపక్షం సహా విపక్షానికి చెందినవారు ఈ బాధితుల్లో ఉన్నారన్నారు. అంతకుముందు ఇదే అంశంపై మంత్రి సతీశ్ జార్కిహోళీ మాట్లాడుతూ.. ఒక మంత్రిపై రెండుసార్లు హనీ ట్రాప్ యత్నం జరిగిన విషయం వాస్తవమేనన్నారు. అయితే, ఇది రాష్ట్రానికి కొత్త కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం కొంతమంది వీటిని వాడుకుంటు–న్నారని పేర్కొన్నారు.

# సూడాన్‌లో రాజకీయ అనిశ్చితి

- అధ్యక్షభవనాన్ని స్వాధీనం చేసుకున్న సైన్యం



**న్యూఢిల్లీ,మార్చి21( వెలుతురు):**
దాదాపు రెండేళ్ల తర్వాత సూడాన్ సైన్యం ఖార్టూమ్‌లోని అధ్యక్ష భవనాన్ని ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ నుంచి తిరిగి స్వాధీనం చేసుకొంది. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. దీనిపై ఆర్‌ఎస్‌ఎఫ్ వర్గాలు ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. దాదాపు రెండేళ్ల క్రితం రాజధాని ఖార్టూమ్‌లో భయంకరమైన అంతర్యుద్ధం మొదలైంది. దీంతో ఆ నగరంలోని చాలా ప్రాంతాలను ఆర్‌ఎస్‌ఎఫ్ అధీనంలోకి తీసుకొంది. తాజాగా ఈ ప్రదేశంపై పట్టు– సాధించడం సైన్యానికి అతిపెద్ద విజయమనే చెప్పొచ్చు. ఇటీ–వల ఆర్మీ మధ్య సూడాన్‌లోని ప్రాంతాల్లో వరుసగా విజయాలు సాధిస్తోంది. గురువారం రిపబ్లికన్ ప్యాలెస్ వద్ద డ్రోన్లు, యుద్ధ విమానాలు దాడులు చేశాయి. సూడాన్‌లోని పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్స్ దళాన్ని సైన్యంలో విలీనం చేసేందుకు రూపొందించిన ప్రతిపాదన.. రెండు బలగాల మధ్య ఘర్షణలకు దారితీసింది. ఈవిషయమై సైన్యాధినేత అబ్దుల్ ఫతాఅల్ బుర్హాన్, పారామిలిటరీ కమాండర్ మహ్మద్ హందాన్ డగ్లో మధ్య కొన్ని వారాలుగా నెలకొన్న విభేదాలు.. తీవ్రస్థాయికి చేరడంతో అంతర్యుద్ధం మొదలైంది. ఆ తర్వాత అధ్యక్ష భవనం, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి వాటిని ఆర్‌ఎస్‌ఎఫ్ అధీనంలోకి తీసుకొంది. ఇక ఈ యుద్ధాన్ని ఆపేందుకు యత్నించిన ఐరాస సంస్థలను కూడా దేశం వీడేలా చేశారు.

# ఉగాది నుంచి తెల్లరేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం

**హైదరాబాద్,మార్చి21( వెలుతురు):**
రాష్ట్రంలోని తెల్ల రేషన్‌కార్డుదారులకు ఉగాది నుంచి రేషన్ షాపులలో సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. ఉగాది రోజున హుజూర్ నగర్ నియోజకవర్గంలో సన్నిబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంబించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఉగాది రోజు ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీసమేతంగా మటంపల్లి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో పూజ అనంతరం సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తారని తెలిపారు. మటంపల్లి ఆలయంలో పంచాంగ శ్రావణ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. కాగా రాష్ట్రంలోని అన్ని రేషన్ షాపుల్లో ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీని చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీని మటంపల్లిలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేలా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం స్థల ఎంపికకు చర్యలు తీసుకున్నామని, అన్ని వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని పేద, దిగువ మధ్య తరగతి వర్గాల కోసం చారిత్రక నిర్ణయం తీసుకునే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ఆహార భద్రత కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. కుటుంబంలో ఎంత మంది ఉంటే ఒకొక్కరికీ 6 కిలోల చొప్పున అందజేస్తారు. అయితే, ప్రస్తుతం పంపిణీ చేస్తున్న దొడ్డు బియ్యం తినడానికి అనువుగా ఉండడం లేదు. రేషన్‌కార్డుదారుల్లో దాదాపు 85 శాతం మంది ఆ బియ్యాన్ని కిలోకు రూ.10 చొప్పున బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని, సన్న బియ్యం కొనుక్కుంటున్నారు. ఆ బియ్యాన్ని మరింతగా పాలిష్ చేసి, సన్న బియ్యంగా మార్చడం ద్వారా దళారులు భారీగా లాభపడుతున్నారు. దీంతో రేషన్‌కార్డుదారులకు దొడ్డు బియ్యం బదులుగా సన్న బియ్యం ఇస్తే.. నూటికి నూరు శాతం మంది తినడానికి వినియోగించుకుంటారని ప్రభుత్వం భా విస్తోంది. అది కూడా ఉచితంగా ఇస్తే పేదలకు ఉపయోగకరంగా ఉండడంతోపాటు సర్కార్‌కు మంచి పేరు వస్తుందన్న ఆలోచన చేసింది. ఈ నిర్ణయంతో బహిరంగ మార్కెట్‌లో మేలిమి రకం సన్న బియ్యం ధరలు సైతం దిగొస్తాయని అంచనా వేస్తోంది. ప్రస్తుత వానాకాలంలో పండిన సూపర్ ఫైన్ బియ్యాన్నే రేషన్ షాపుల్లో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

**హైదరాబాద్,మార్చి21( వెలుతురు):**
రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ ఏడాది మొత్తం 11,547 పాఠశాలల నుంచి 5.09 లక్షల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వీరి కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,650 సెంటర్లు ఏర్పాటుచేశారు. 25 మంది విద్యార్థులకు ఒకరి చొప్పున 28,100 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా విద్యార్థులను పరీక్షలకు అనుమతించారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు.

(ఆధ్యాత్మికచింతన )

## సత్యానికి ఓటమి తాత్కాలికమే !

**తిరుమల,మార్చి21( వెలుతురు):**
సత్యానికి తాత్కాలిక ఓటమి ఉంటుంది. అయితే శాశ్వత కీర్తిని మాత్రం పొందుతుంది. మన పురాణాలు, ఇతిహాసాలు, వేదాలు ఇదే చెబుతున్నాయి. సత్యం మరచిన వారు సమాజంలో అరచకాలకు పాల్పడతారు. సత్యం,ధర్మాలను మనం ఆచరిస్తే అవి మనలను కాపాడుతాయి. అందుకే ఈ రెంటినీ విడవకుండా జీవనం సాగించాలి. మహాభారతంలోని ఉద్యోగ పర్వంలోసత్యం, ధర్మం తెలిసి కూడా ఆచరణలో పెట్టలేని కౌరవులకు మళ్లీ ఒకసారి గుర్తు చేయడానికే కూర్చబడినట్టు పండితులు చెబుతారు. కృష్ణపరమాత్మ కౌరవ పాండవుల మధ్య సంధి చేయ కౌరవ సభకు వచ్చి యుద్ధం నివారింప బడాలని చెబుతూ పాండవులు అయిదుగురికి ఐదు ఊర్లు ఇచ్చినా సంతృప్తిపడ తారని కౌరవులకు నచ్చజెప్ప ప్రయత్నించాడు. అయినా కౌరవులు పరమాత్మని వచనాలు పెడచెవిన బెట్టడమేగాక కృష్ణ భగవాణున్ని



సామాన్యునిగా భావించి బంధించ ప్రయత్నించారు. అసత్యపరులు అహంకారులు తనను తెలుసుకోలేని అజ్ఞానులని భావించిన భగవానుడు తన విశ్వ రూపాన్ని ప్రదర్శించి తనెవరో తెలియజేసాడు. ప్రస్తుత కాలంలో విజ్ఞానపరంగా మనం ఎంతో అభివృద్ధిని సాధించాం. సాధిస్తున్నాం కూడా! కానీ సత్యం, న్యాయం, ధర్మం వంటి వాటిపై శ్రద్ధ చూపడం లేదనేది ముమ్మాటికి నిజం. సత్య ధర్మాలపై అశ్రద్ధ కారణంగానే మనం ప్రకృతి వైపరీత్యా లకు గురవుతున్నాం. ప్రాణాలను పణంగా పెట్టుకుంటున్నాం. ఇకనైనా మనం మేలుకొని సత్యంతో కూడిన ఆలోచనలు, ఆచర ణలు ఆచరించ ప్రయత్నిద్దాం. సత్యంలోనే భగవంతుడున్నాడని నమ్మడంతో పాటు ఆచరణలోకి తేవాలి. అప్పుడే మనిషి సుఖశాంతులతో జీవించగలడు.

# శ్రీరాం నగర్ కాలనీ ఎన్ ఓ సి సమస్య పరిష్కారం చేయాలి



**వెలుతురు, వనస్థలి పురం, మార్చి 21:**
రంగారెడ్డి జిల్లా ఎల్బీ నగర్ నియోజక వర్గం బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ కలన్ 201/1 సర్వేలో రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారం జరిగింది కానీ ఈ సర్వే నెంబర్ లో భాగంగా ఉన్న శ్రీరాం నగర్ కాలనీకి ఎన్ ఓ సి సర్టిఫికెట్ రాకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు, ఈ విషయమై స్పందించిన బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అధికారుల దృష్టికి తీసుకురావడంతో శుక్ర వారం నాడు సంబంధిత కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి కార్పొరేటర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి ని కలిసి కాలనీవాసులకు గల ఇబ్బందులు తొలగించి వారికి యధావిధిగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నందుకుఎన్ ఓ సి సర్టిఫికెట్ జారి చేయాలని కోరారు. దీంతో స్పందించిన ఎఫ్ ఆర్ ఓ అధికారులు అతి త్వరలోనే శ్రీరామ్ కాలనీలో రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు కలగకుండా ఎన్ ఓ సి సర్టిఫికెట్ జారీ చేసేవిధంగాచర్యలుతీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, బి.యన్ రెడ్డి నగర్ దేవి పోచమ్మ ఆలయ చైర్మన్ ప్రదీప్ రెడ్డి, కాలనీ సభ్యులు రవీందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి మరియు తదితరులు ఉన్నారు.

# వెన్నుముక సమస్య బాధితుడికి ఎల్ ఓ సి అందజేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**వెలుతురు, ఎల్ బి నగర్, మార్చి 21:**
ఎల్.బి. నగర్ నియోజకవర్గ పరిధిలోని చైతన్యపురి డివిజన్లో భవాని నగర్ కి చెందిన గౌరవ్ గౌడ్ (24) గత కొన్ని రోజులుగా వెన్నుముక సమస్యలతో బాధపడుతున్నారు. ఈ విషయమై , వారి కుటుంబ సభ్యులు ఎల్.బి. నగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు.ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఎల్.ఓ.సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) క్రింద రూ. 2,00,000 (రెండు లక్షల రూపాయలు) మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎల్ ఓ సి మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి బాధితుడి గౌరవ్ గౌడ్ తల్లి సంధ్యకు శుక్ర వారం నాడు అందజేశారు.

# ఆదిభట్ల కాంగ్రెస్ అధ్యక్షుడి మాతృ మూర్తి మృతి



**వెలుతురు, ఆదిభట్ల మున్సిపాలిటీ, మార్చి 21:**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, ఆదిభట్ల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌని బాల్ రాజ్ గౌడ్ మాతృ మూర్తి గౌని బాలమ్మ శుక్ర వారం నాడు మృతి చెందారు, ఆమె మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం తెలియజేశారు, సంతాపం ప్రకటించిన వారిలో స్థానిక ఇబ్రహీంపట్నం నియోజక వర్గ నాయకుల దండెం రాంరెడ్డి పటేల్ గూడ లోని వారి స్వగృహానికి వెళ్లి బాలమ్మ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులు అర్పించారు,బాల్ రాజ్ గౌడ్ మరియు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# కేపీ ఎస్ 21st సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి. కృష్ణ ప్రదీప్ జన్మదిన వేడుకలు.



**హైదరాబాద్ వెలుతురు మార్చి 21:**
హైదరాబాద్‌లోని KPs 21st సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ శ్రీ పి. కృష్ణ ప్రదీప్ జన్మదిన వేడుకలు అశోక్ నగర్ ,ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని అకాడమీ క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే శ్రీ ముఠా గోపాల్ మరియు ఆయన కుమారుడు ముఠా జయసింహ హాజరై, శ్రీ కృష్ణ ప్రదీప్‌కు సుదీర్ఘ ఆయురారోగ్యాలతో సఫలమైన జీవితం గడపాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను అని ఆయన తెలిపారు . అకాడమీ డైరెక్టర్లు శ్రీ భవాని శంకర్, శ్రీ వరుణ్, మరియు శ్రీ వేణు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో శ్రీ హరికృష్ణ గౌడ్ మరియు ఇతర బోధనా సిబ్బంది, అకాడమీ సభ్యులు కూడా పాల్గొని, సివిల్ సర్వీసెస్ విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి ఆయన చేస్తున్న అసాధారణమైన కృషికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాజ బహదూర్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

- **బుద్వేల్ లో నిర్మిస్తున్న రాజ బహదూర్ వెంకట్రామి రెడ్డి భవన సముదాయాలను పరిశీలించిన కలెక్టర్ నారాయణ రెడ్డి**
- **15 ఎకరాలలో 13,63 కోట్ల తో నిర్మాణాలు**





**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, మార్చి 21:**
రంగారెడ్డి జిల్లా బుద్వేల్ గ్రామ పరిధిలో కేటాయించిన 15 ఎకరాల స్థలంలోరాజ బహదూర్ వెంకట్రామిరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలోనిర్మిస్తున్న రెడ్డి హాస్టల్, విద్యాసంస్థల భవన సముదాయాల పనులను వేగవంతంచేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం బుద్వేల్ లో 13.63 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నిర్మాణాల పనులను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10 కోట్ల రూపాయలను ఓడిఎఫ్ నిధుల కింద మంజూరు చేయడం జరిగిందని, మిగతా మూడు కోట్ల 63 లక్షలు సొసైటీ తమ వాటాగా నిధులు విడుదల చేసిందని తెలిపారు. పనులు గత కొంత కాలంగా నిలిచిపోవడానికి గల కారణాలనుసంబంధిత కాంట్రాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. తదుపరి కాంట్రాక్టర్ పనులు చేయకుండా నిలుపుదల ఎందుకు చేశారో తెలపాలని కలెక్టర్ అన్నారు. ఇప్పటికైన పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు కాంట్రాక్టర్లకుసూచించారు. ఈ కార్యక్రమంలో రాజ బహదూర్ వెంకట్రాంరెడ్డి, ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు వెంకట్ రంగారెడ్డి, సెక్రటరీ మోహన్ రెడ్డి, ఈఈ పంచాయతీరాజ్ రామకృష్ణ, డి.ఈ ఖలీముద్దీన్ తదితర రెడ్డి సంఘ సభ్యులు, రాజేంద్రనగర్ ఎమ్మార్వో రాములు తదితరులు పాల్గొన్నారు.

# "రాజీవ్ యువ వికాస్" పథకానికి రేషన్ కార్డ్ అర్హత నిబంధనను ఎత్తివేయాలి

- జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు మార్చి 21:**
నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకంలో రేషన్ కార్డు నిబంధనను ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులకు అవకాశం కల్పించకపోవడంతో 11 సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునే అవకాశం లేక పెళ్లిళ్లు జరిగి వేరుగా నివాసం ఉంటున్న ఎందరో యువకులు ఇంకా తల్లిదండ్రులు రేషన్ కార్డులోనే కొనసాగుతున్నారు.కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించడంతో నిబంధనలు ప్రకారం పాత రేషన్ కార్డులు డిలీట్ అయితేనే కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండడంతో చాలా మంది డిలీట్ ఆప్షన్ ద్వారా పాత రేషన్ కార్డులలో డిలీట్ అయ్యారని.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అర్హులైన నిరుద్యోగ యువతకు చేయూతనందించేందుకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాస్ పథకం కింద 50 వేల రూపాయల నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు సబ్సిడీ రుణాలు అందించేందుకు ప్రభుత్వం ముందుకొస్తుందని దీనికీ రేషన్ కార్డ్ అర్హత నిభందన ఉండడంతో చాలా మంది అనర్హులు అవుతున్నారని కావున ప్రభుత్వం ఈ నిబంధనను ఎత్తివేయాలని లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

# రామచంద్రాపురంలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాట శ్రీనివాస్ గౌడ్

**రామచంద్రాపురం వెలుతురు మార్చి 21:**
పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రామచంద్రాపురం ఈద్గాలో ముస్లిం సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని 112 డివిజన్ ప్రెసిడెంట్ ఈశ్వర్ సింగ్ మరియు నరేష్ ముదిరాజ్ గార్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఉపవాస దీక్షలు విరమించారు. అనంతరం స్వయంగా ముస్లిం సోదరులకు భోజనం వడ్డించి, వారితో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, స్థానిక ప్రముఖులు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు





# నూతన కోర్టు భవనాల నిర్మాణానికి వెయ్యి కోట్లు

- **శాసనమండలిలో లో మంత్రి శ్రీధర్ బాబు.**



( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 21:**
నూతన కోర్టు భవనాల నిర్మాణం కోసం రూ. 1000 కోట్ల నిధుల విడుదలకు పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్టు ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. కొత్తగా ఏర్పాటైన 13 జిల్లాల్లో వీటి నిర్మాణాలు జరుగుతాయని శుక్రవారం శాసనమండలిలో తెలిపారు. అడ్వకేట్ లు, గుమాస్తాల సంక్షేమ చట్టం సవరణ బిల్లు 2025 ను ప్రవేశపెట్టిన సందర్భంగా సభ్యులు ప్రస్తావించిన అంశాలపై ఆయన వివరణ ఇచ్చారు. నూతన హైకోర్టు భవన నిర్మాణానికి సిఎం రేవంత్ రెడ్డి 100 ఎకరాల స్థలం కేటాయించిన విషయం గుర్తు చేశారు. నూతన హైకోర్టు, న్యాయమూర్తుల నివాస సముదాయాల నిర్మాణానికి 2600 కోట్లు వ్యయం చేయనున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. 19,830 మంది అడ్వొకేట్లు, వారి కుటుంబ సభ్యులు మొత్తం 55,000 మందికి రూ.2 లక్షల పరిమితితో హెల్త్ కార్డులు జారీచేస్తున్నట్టు ప్రకటించారు. రూ. 10 లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. న్యాయవాదుల భద్రత కోసం చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు. వామనరావు దంపతుల దారుణ హత్యలు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోందనీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

# పార్కింగ్ విషయంలో తలెత్తిన వివాదం

***ఏపీ ఆర్టీసీ డ్రైవర్‌పై విచక్షణారహితంగా దాడి***
***కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్‌పై సస్పెన్షన్ వేటు***
***దాడి ఘటనపై విచారణకు చైర్మన్ కొనకళ్ల ఆదేశం***

**బెంగళూరు,మార్చి21( వెలుతురు):**
పార్కింగ్ విషయంలో తలెత్తిన వివాదంలో ఏపీ ఆర్టీసీ డ్రైవర్‌పై విచక్షణారహితంగా జరిగిన దాడిపై ఏపీ ఆర్టీసీ యాజమాన్యం తీవ్రంగా స్పందించింది. ఈ దారుణంపై కర్ణాటక అధికారులకు ఫిర్యాదు చేయగా.. అక్కడి ఉన్నతాధికారులు కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్‌పై సస్పెన్షన్ వేటు- విధించారు. ఏపీఎస్ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై విచారణ జరపాలని బెంగళూరులోని ఏపీఎస్ ఆర్టీసీ అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించా రు. కడప జిల్లా ఆర్టీసీ డ్రైవర్‌పై కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్ తీవ్రంగా దాడి ఘటన తీవ్ర కలకలం రేపింది. ప్రొద్దుటూ రు డిపోలో పనిచేసే ఎన్ఆర్ఎస్ రెడ్డి విధి నిర్వహణలో భాగంగా గురువారం బెంగళూరుకు వెళ్లగా.. పార్కింగ్ విషయంలో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ఎన్ఆర్ఎస్ రెడ్డిపై కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్ విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ముఖంపై పిడిగుద్దులు కురిపిస్తూ.. కింద పడేసి కాళ్లతో తన్నాడు. బాధతో అతడు ఆర్తనాదాలు చేసినా వదలకుండా చితకబాదాడు. ఈ ఘటనపై ఏపీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాలు మండిపడ్డాయి. తక్షణమే కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసేలా ఏపీఎస్ఆర్టీసీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. దీంతో ఈ వ్యవహారంపై ఆర్టీసీ యాజమాన్యం తీవ్రంగా స్పందించింది. బెంగళూరులోని ఏపీఎస్ఆర్టీసీ ట్రాఫిక్ మేనేజర్ ద్వారా కర్ణాటక అధికారులకు ఫిర్యాదు చేయించడంతో సదరు ఆర్టీసీ డ్రైవర్‌ను సస్పెండ్ చేశారు. బెంగళూరులో ఏపీ ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనపై ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు స్పందించారు. ఈ ఘటనపై విచారణ జరపాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును ఆదేశించారు. దాడి చేసిన కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్‌పై చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేయాలని సూచించారు. దాడికి గురైన ఏపీ ఆర్టీసీ డ్రైవర్‌కు మెరుగైన వైద్యం అందించాలని ఎండీకి ఆదేశాలు జారీ చేశారు.

# రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడు పంతంగి రాంభూపాల్ గౌడ్ గారికి అభినందనలు తెలిపిన బిజెపి నాయకులు



**రంగారెడ్డి జిల్లా వెలుతురు మార్చి 21:**
భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షునిగా నియమితులైన శ్రీ పంతంగి రాం భూపాల్ గౌడ్ గారిని శంషాబాద్ లో వారి నివాసం లో కలిసి పుష్పగుచ్చానిచ్చి శాలువతో శుభాకాంక్షలు తెలిపిన బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, బిజెపి రాష్ట్ర ఎస్సిమోర్చా కోశాధికారి బచ్చిగళ్ళ రమేష్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ బిజెపి మాజి అధ్యక్షులు తూళ్ళ నర్సింహా గౌడ్, మైలారం బాబు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- **కాట సుధా శ్రీనివాస్ గౌడ్**





**అమీన్ పూర్ వెలుతురు మార్చి 21:**
అమీన్ పూర్ మున్సిపాలిటీ బీరంగూడలోని ఎస్.కె. బృందావన్ బ్యాంకెట్ హాల్ లో వసుధ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కాట సుధా శ్రీనివాస్ గౌడ్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలు సమాజంలో ప్రతి రంగంలో ముందుకు వెళ్లాలి, తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. మహిళల ఎదుగుదలకు అనుకూలమైన విధానాలను అందించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు.

# త్రాగునీరు సమస్యను వెంటనే పరిష్కరించాలి

**హైదరాబాద్ వెలుతురు మార్చి 21:**
శుక్రవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ లోని విట్టల్ వాడిలో త్రాగునీరు సమస్య ఉందని తెలుసుకున్న హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ అక్కడికి వెళ్లి చూడడం జరిగింది వెంటనే వారు అధికారులకు ఫోన్లు చేసి దానినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో రామ్మూర్తి, అనిల్ ముదిరాజ్, సందీప్, జగదీష్ పాల్గొన్నారు.



# ప్రపంచ అటవీ దినోత్సవం

- కేబీఆర్ పార్కుల్లో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా నేను చెట్ల సంరక్షణలో భాగస్వామ్యం అవడం చాలా సంతోషంగా ఉన్నది.
- మన సంస్కృతి, సాంప్రదాయంలోనే వృక్ష సంరక్షణ ఉన్నది.
- వృక్షో రక్షతి రక్షితః చెట్టును మనం కాపాడితే..చెట్టు మనల్ని కాపాడుతుంది. ఇది జగమెరిగిన సత్యం.





(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 21:**
అడవుల పరిరక్షణ ఆవశ్యకత అందరికీ తెలియాలనే ఉద్దేశ్యంతో, జనంలో చైతన్యం రావాలని మార్చి 21ని ప్రపంచ అటవీ దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించి.ప్రతి ఏటా నిర్వహిస్తుందని మంత్రి కొండా సురేఖ తెలిపారు,పర్యావరణ పరిరక్షణ, జీవజాలం మనుగడకు అడవులే ఆధారం. జీవజాలానికి, వనాలకు విడదీయరాని సంబంధం ఉందని నా అభిప్రాయమని చెప్పారు,అడవులను ప్రజలు తమ స్వలాభం కోసం నాశనం చేస్తూ... తమ ఉనికిని తామే ప్రశ్నార్థకం చేసుకొంటున్నారు.ప్రకృతి మాత్రమే శాశ్వతమైనదనే సత్యాన్ని గుర్తిస్తే, మానవ మనుగడకు ఆధారంగా నిలుస్తున్న అడవులను జాగ్రత్తగా కాపాడుకునేలా ఉద్యమించాలి మనమంతా.ప్రకృతిని సంరక్షిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడంలోనే అర్థవంతమైన జీవితం ఉన్నది. అడవుల ప్రాముఖ్యత, అడవులతో మనిషికి ఉన్న అనుబంధం, అడవుల సంరక్షణకు అనుసరించాల్సిన కార్యాచరణ ఈ సందర్భంగా మనమంతా గుర్తు చేసుకోవాలని మంత్రి చేశారు, అడవులను సంరక్షించుకోకపోతే తలెత్తే విపత్కర పరిస్థితులను అటవీ దినోత్సవం సందర్భంగా మనమంతా మననం చేసుకోవాలన్నారు, పట్టణీకరణ, పరిశ్రమల స్థాపన, ప్రాజెక్టుల నిర్మాణం, పోడు వ్యవసాయం, గృహాల నిర్మాణం వంటి కారణాలతో అడవులు నానాటికీ అంతరించి పోతున్నాయన్నది మనమంతా ఆవేదన వ్యక్తం చేయాల్సిన అవసరం ఉన్నది.భూ విస్తీర్ణానికి అనుగుణంగా అడవుల విస్తరణ లేకపోవడంతో గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో కఠిన సమస్యలు ఎదుర్కొంటున్నామని తెలిపారు,పర్యావరణంలో సమతుల్యత





లోపించి విపత్తుల బారిన పడుతున్నాం,వన్య ప్రాణులకు ఆవాసాలైన అడవులను కాపాడుకుంటేనే జీవవైవిధ్యం వర్ధిల్లుతుంది.ప్రభుత్వం చేపట్టే చర్యలకు ప్రజలు కూడా తమవంతు సహకారం అందిస్తేనే అడవుల విస్తీర్ణంలో వృద్ధి నమోదవుతుంది. ఇందు కోసం ప్రజలు అందరూ కలిసి రావాలని ప్రజలకు పిలుపునిస్తున్న అటవీ శాఖ మంత్రిగా.ఓ వైపు ఉన్న అడవులను సంరక్షించుకుంటూనే, మరోవైపు అటవీ సంపదను పెంచేందుకు సమర్పణ, సంకల్పంతో ముందుకు సాగుతున్నమని చెప్పారు తెలంగాణ ప్రభుత్వం కూడా వనమహోత్సవం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతుంది.ఇందు కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నది.ఈ కార్యక్రమంలో భాగస్వాములైన మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పెస్కోవా, అటవీ శాఖ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సంఘాలు, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు.

# బడ్జెట్లో విద్యా రంగాన్నీ విస్మరించినంధుకు నిరసిస్తు బిఆర్ఎస్వీ అసెంబ్లీ ముట్టడి

- బి ఆర్ ఎస్ వి నకిరేకల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు జెట్టి శివ ప్రసాద్ యాదవ్
- విద్యను పాతాళానికి తొక్కుతున్న రేవంత్ రెడ్డి.

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 21**
అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో కేవలం 7.53 శాతమే అనగా 23,108 కోట్ల బడ్జెట్ ను విద్యా రంగానికి కేటాయించడం వల్ల విద్య పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉందో, ఈ కాంగ్రెస్ సర్కార్ మన ముందు కనబడుతుంది. అని అన్నారు. ఇప్పటికే ఈ రాష్ట్రంలో దాదాపు 8,000 కోట్లు విద్యార్థులకు రావాల్సిన బకాయిలు అనగా స్కాలర్షిప్లు గాని, ఫీజు రియంబర్స్మెంట్ గాని, పెండింగ్లో ఉన్నాయి కానీ నిన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో, విద్యారంగానికి కేవలం 23,108 కోట్లు మాత్రమే కేటాయించారు ఈ బడ్జెట్ ఫీజు రీయింబర్స్మెంట్ కూడా సరిపోని పరిస్థితి ఉన్నది.హామీలు మాత్రం గంపేడిచ్చి బడ్జెట్ మాత్రం అరకొర కేటాయించి విద్యా వ్యవస్థను అందా:పాతాళానికి తొక్కడం దుర్మార్గం అని అన్నారు.ప్రతి విద్యార్థికీ 5 లక్షల విద్య భరోసా కార్డుకు బడ్జెట్లో సున్నా కేటాయింపులు. ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఊసే లేదు.. ప్రతి మండలానికి ఒకటి అని చెప్పి నేడు నియోజకవర్గానికి ఒకటి ఇంటర్నేషనల్ స్కూల్ ఇస్తామని అనడం దానికి బడ్జెట్ కేటాయించకపోవడం దుర్మార్గం. ప్రతి మండలానికి ఎస్సీ ఎస్టీ రెసిడెన్షియల్ స్కూలు ఏర్పాటు మోసం.ప్రతి మండలంలో నవోదయ విద్యాలయంతో పాటు సమానంగా బీసీలకు ఒక కొత్త



గురుకులం అని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్ కు సిగ్గు చేటు అని అన్నారు. ప్రతి మండల కేంద్రంలో హైస్కూల్ ఇంటర్ కాలేజీ మరియు ప్రతి నియోజకవర్గంలో ఒక డిగ్రీ కాలేజీ అదేవిధంగా జిల్లా కేంద్రంలో పీజీ కాలేజీ లను నిర్మిస్తామని చెప్పినారు కానీ బడ్జెట్ మాత్రం సున్నా కేటాయించారు ఎలా సాధ్యమవుతుంది? మూడు లక్షల వార్షికో ఆదాయం లోపు ఉన్నవారికి బీసీలకు మొత్తం ఫీజు రియంబర్స్మెంట్ ఇస్తామని చెప్పి మోసం.ఉన్నత చదువులు చదివే వారికి పది లక్షల వరకు రుణాలు ఇస్తామని చెప్పడం మోసం ఉద్యమంలో చనిపోయిన విద్యార్థి అమరులకు 25వేల పింఛన్ హామీ పచ్చి మోసం.18 ఏళ్ల పైబడి చదువుకునే విద్యార్థినిలకు ఎలక్ట్రిక్ స్కూటీస్ ఇస్తామని చెప్పడం దుర్మార్గం. అదేవిధంగా ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థులకు 10 పాస్ అయితే 10000, ఇంటర్ పాస్ అయితే 15000, డిగ్రీ పాసైతే 25000, పీజీ పాస్ అయితే ఒక లక్ష, పిహెచ్డి ఎంఫిల్ పాస్ అయితే ఐదు లక్షలు ఇస్తా అని చెప్పడం పచ్చి మోసం. యూనివర్సిటీలో చదువుకునే వారికి 10000 వేల ఫెలోషిఫ్ హామీ సున్న. విదేశీ యూనివర్సిటీలో చదువుకునే ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఆర్థిక సాయం సున్నా. ఫీజు రియాంబర్స్మెంట్ ఇంతవరకు ఇవ్వలేదు. దాదాపు 8 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ ఈ రాష్ట్రంలో పెండింగ్లో ఉంది. వీటన్నిటికీ బడ్జెట్ కేటాయించకుండా, విద్యారంగాన్ని అతలాకుతలం చేసినటువంటి, మూర?త్వపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట శ్రీను, రాష్ట్ర నాయకులు కుర్వ పల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన ఎమ్మెల్యే రాగమయి

**వెలుతురు, ఖమ్మం జిల్లా, మార్చి 21:**
శుక్ర వారం నాడు హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని ఆయన సీఎం చాంబర్ లో మర్యాదపూర్వకంగా సత్తుపల్లి-కిష్టారం సింగరేణి ఓసి లోని శైలో బంకర్,వివిధ సమస్యలపై పలువురు ప్రముఖులు కలిశారు, ప్రజలు ఇబ్బంది గురించి మరియు సత్తుపల్లి నియోజకవర్గంలో నూతన ప్రభుత్వ ఐటిఐ కాలేజ్ ని మంజూరు కొరకు నియోజకవర్గం లో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సీఎం రేవంత్ రెడ్డి కు విజ్ఞప్తి చేశారు,అనంతరం కాళోజీ నారాయణరావు యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (%ఖచీ=ఖనూ%) నూతన వీసీ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి .వీ నందన్ కుమార్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్య క్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు,





# మైనారిటీ నాయకులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను కార్యకర్తలను గుర్తించండి
- ఎండి అక్బర్ అలీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు మార్చి21:**
యదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి అక్బర్ అలీ తనకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని పత్రిక ప్రకటన ద్వారా కోరారు.కాంగ్రెస్ పార్టీ కోసం తను ఎంతో పనిచేశానని తనుకు ప్రస్తుతం 65 సంవత్సరాలు ఉన్నాయాని గత 40 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీ లో కొనసాగుతున్నానని గతం లో ఎంపీటిసి గా,వ్యవసాయ సహకార బ్యాంకు డైరెక్టర్ గా కూడా పోటీ చేశాను, కాంగ్రెస్ పార్టీ గత 10 పది సంవత్సరాలుగా అధికారం లో లేకున్నా పార్టీ పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని తన సొంత డబ్బులతో నిర్వహించను అని తెలిపారు.గతంలో టిఆర్ఎస్,కమ్యూనిస్టులతో అనేక పోరాటాలు చేశానని గత జిల్లా అధ్యక్షులు ప్రస్తుత భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ రెడ్డీ కీ కూడా నా పనుల గురించి తెలుసు అని నారాయణపురం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నరసింహ కూడా గతంలో అనేకమార్లు విన్నవించుకున్నానని కూడా తెలిపారు.ఈసారి పార్టీ అధికారం లో వచ్చింది ప్రస్తుతం మార్కెట్ కమిటీ నియామకాలు జరుగుతున్నందున తనకు మైనారిటీ కోటలో అయినా పదవీ ఇస్తారని ఆశిస్తునాను .గత ఉపఎన్నికలో చాలా మంది పార్టీని వదిలి వెళ్ళిన తాను మాత్రం పార్టీ నే నమ్ముకొని పనిచేశానని గుర్తుచేశారు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని వారు తెలిపారు.ఈ సందర్భంలో తనకు సరైన గుర్తింపు దొరకడం లేదని అక్బర్ అలీ ఆవేదన చెందారు.



# కార్గో ద్వారా భద్రాద్రి సీతారాముల కళ్యాణ తలంబ్రాలు

- ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలి
- - చిలువేరు సమ్మయ్య గౌడ్



**కేసముద్రం వెలుతురు మార్చి 21:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో ఏప్రిల్ 6న సీతారాముల కళ్యాణం జరుగుతుండగా,ఈ కార్యక్రమానికి వెళ్ళలేని భక్తుల కోసం స్వామివారి కల్యాణ తలంబ్రాలను టిజీఎస్ఆర్టిసి కార్గో సేవల ద్వారా బుక్ చేసుకుని,వాటిని పొందవచ్చని కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ తెలిపారు. శుక్రవారం కేసముద్రంలో స్వామివారి కల్యాణానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ కేసముద్రం మున్సిపాలిటీ లోని కార్గో కార్యాలయంలో ముందస్తుగా భక్తులు శ్రీ సీతారాముల కళ్యాణ తలంబ్రాల కోసం రూ.151 చెల్లించి బుక్ చేసుకోవాలని తెలిపారు..మున్సిపాలిటీలోని, మండల కేంద్రంలోని ప్రజలందరూ ఆ సీతారాముల కరుణాకటాక్షాలు పొందాలని ఈ సదవకాశాన్ని అందరూ సద్వినియోగపరుచుకోవాలని విజ్ఞప్తి చేశారు చిలువేరు సమ్మయ్య గౌడ్.పూర్తి వివరాల కోసం కేసముద్రం కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వేల్పాద్రి సెల్ నెం 9154298968, కార్గో ఆఫీస్ నెంబర్ 9100477150, కేసముద్రం 91214 44477 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## ముస్లిం పేద కుటుంబాలకు చేయుత

- రంజాన్ తోఫా పంపిణీ చేసిన జఖీ, అలీమ్ సాహెబ్



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు మార్చ్ 21:**
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామంలో రంజాన్ పర్వదిన ఉపవాస దీక్షలను పురస్కరించుకొని హైదరాబాద్ నగరానికి చెందిన మహమ్మద్ జఖీ సాహెబ్, జనాబ్ మహమ్మద్ అలీమ్ సాహెబ్ దాదాపు ఒక లక్ష పదివేల రూపాయల విలువైన సరుకులను కాశీ గూడెంలో ముస్లిం పేద కుటుంబాలకు స్థానిక మసీదులో తుర్క కాశ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్కే బడేసాబ్ ఆధ్వర్యంలో ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యవసర సరుకుల తో పాటు రంజాన్ పర్వదినం రోజున షురుకుర్మా సామాగ్రి సేమియాలు,చక్కెర తదితర రకాల సామాగ్రిని అందజేస్తూ ఆర్థిక సహాయం చేయడం జరిగింది. అనంతరం రాష్ట్ర తుర్క కాశ కార్మిక సంఘం అధ్యక్షులు బడేసాబ్ మాట్లాడుతూ రంజాన్ పర్వదినం సందర్భంగా నిరుపేద ముస్లిం మైనార్టీ కుటుంబాలకు జఖీ సాహెబ్, హలీం సాహెబ్ చేసిన సహాకారాలు మరువలేము అని అన్నారు. అదేవిధంగా నిరుపేద కుటుంబాల బతుకుల్లో సంతోషం చూడాలని ఏకైక లక్ష్యంగా ముందుకు నడుస్తున్న జఖీ, అలీమ్ సాహెబ్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వారికి పేద ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని అదేవిధంగా వారిని ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలనీ మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో జానీ, కరీం సాబ్ ,చాంద్ సాబ్,నజీర్,షరీఫ్,అహ్మద్,ఖాసీం, మదార్, గాలిబ్,బాబా, రహీమ్,సలీం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో విద్యారంగానికి నిధుల కొరత




**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మార్చ్ 21 :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించకపోవడంతో సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు దాసరి ప్రకాష్ తిగుళ్ళ శ్రీనివాస్ అన్నారు శుక్రవారం రోజున ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యలో జాతీయ రహదారిపై రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య రంగానికి తక్కువ నిధులు కావాలనే రేవంత్ రెడ్డి సర్కారు కేటాయిస్తుందన్నారు. 23 వేల నూట ఎనిమిది కోట్లు రూపాయలు రాష్ట్ర విద్య రంగా అభివృద్ధికి సరిపోవు అన్నారు. ఈ తెలంగాణ రాష్ట్రంలో స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్ కు సంబంధించింది 8 వేల కోట్ల దాకా పెండింగ్లో ఉన్నాయన్నారు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి కేవలం 7.57 % మాత్రమే నిధులు కేటాయించారన్నారు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ విద్య సంస్థలు అన్ని ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలు హాస్టల్స్ గురుకులాలు యూనివర్సిటీలు అభివృద్ధి కావాలంటే 30% నిధులు విద్యారంగానికి కేటాయిస్తేనే అభివృద్ధి చెందుతాయి అన్నారు రాను రాను విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసే విధంగా ఉంది అన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రినీ కేటాయించ లేదు పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్స్ ను మరియు ఫీజు రీయింబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేసి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు దోనూర్ శ్రావణ్ రెడ్డి, నాయకులు సాగర్, అజయ్, మల్లేష్, సాయి చందు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ తోనే అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం ..

- కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్..



**కూకట్ పల్లి మార్చి 21 వెలుతురు:**
తెలంగాణ శాసనసభలో బీసీలకు 42 శాతం, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందిన సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తన పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాం లోనే అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరుగుతుందని, ఎస్సీ వర్గీకరణ, 42 శాతం తో బీసీ రిజర్వేషన్ బిల్లు చట్టబద్ధత కల్పించడం ఇందుకు నిదర్శనమనీ అన్నారు. ఈ ప్రభుత్వం ప్రజల మద్దతు పొందిన ప్రభుత్వమని, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వమని అన్నారు. మహిళలకు ఎన్నో అభివృద్ధి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో చేపట్టారని, నిరు పేదలైన అన్ని వర్గాలకు సంబంధించిన వారికి ఉపాధి కల్పించే దిశగా రాజీవ్ యువ వికాసాం పథకం ప్రవేశ పెట్టారని, ఈ పథకం ప్రతి ఒక్కరు సద్వినియం చేసుకొని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, శివరాజ్ గౌడ్, గుడ్ల శ్రీనివాస్, కాశినాథ్ యాదవ్, షౌకత్ అలీ మున్నా, మల్లేష్, యాదగిరి, ముజీబ్, మహేష్, ఖలీమ్, షకీల్ మున్నా, మోజెస్, వాలి నాగేశ్వరరావు, భిక్షపతి, మధులత, రామదాసు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సేవలు అభినందనీయం...

- కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్




**కూకట్ పల్లి మార్చి 21 వెలుతురు:**
ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని జయశంకర్ కాలనీలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ వారి ఆధ్వర్యంలో, జె.టి.ఎక్స సంస్థ వారి సహకారంతో డివిజన్ లోని మహిళలకు ట్రైనింగ్ ఇచ్చి వారి నైపుణ్యా లకి అనుగుణంగా వారికి కుట్టు మిషన్లు, ఇస్త్రీ పెట్టెలు, నిత్యావసర సరుకులు అందిస్తూ వారి భవిష్యత్ కు భరోసా ఇస్తూ, నిర్వహించిన మహిళా జీవనోపాధి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై వారి చేతులమీదుగా కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ వారు తమ డివిజన్ లో ఎన్నో సహాయ కార్యక్రమాలు చేసారని అన్నారు. కరోన టైం లో కూడా ఎంతో మందికి సహాయం చేసి ఆదుకున్నారని గుర్తుచేశారు. డివిజన్ లో ఉన్న పేద మహిళలకు వారికి ఆసక్తి ఉన్న రంగాలలో శిక్షణ ఇస్తూ, చిన్న పిల్లలకు చదువులు చెప్తూ, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ వారికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మంచి కార్యక్రమాలు చేసి డివిజన్ లో ఉన్న పేద వారికి ఆసరాగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడ్ల శ్రీనివాస్, మల్లేష్, పోశెట్టిగౌడ్, యాదగిరి, కుమార్, షేక్ బీబీ, యునైటెడ్ వే ఆ హైదరాబాద్ సభ్యులు కె.రాములు, ప్రశాంత్, పి.రమేష్, టి.శ్రీపతి, ఎం.అక్షిత, కె.లక్ష్మి, ఈ. విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మహిళను నాయకత్వం కోసం శక్తివంతం చేయడమే లక్ష్యం

- శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్ పర్సన్ ఇందుమతి శ్రీరంగం..

**కూకట్ పల్లి మార్చి 21 వెలుతురు:**




మహిళలు రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నప్పుడే నిజమైన సమానత్వం, న్యాయం సాధించబడతాయని శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్ పర్సన్ ఇందుమతి శ్రీరంగం అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఇందిరా ఫెలోషిప్ బూట్ క్యాంపు ఇందిరా ఫెలోషిప్ కన్వీనర్ విజయలక్ష్మి, రమణి రెడ్డి ఆధ్వర్యంలో బేగంపేట్ లోని తాతచారి నగర్ లో నిర్వహించిన జిల్లా స్థాయి బూట్ క్యాంప్ గొప్ప విజయాన్ని సాధించింది. ఈ బూట్ క్యాంపు కి ముఖ్య అతిథులుగా సనత్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ కోట నీలిమ, శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్ పర్సన్ ఇందుమతి శ్రీరంగం, జాతీయ పరిశోధనా అధిపతి హానికా రేషే ఏఐసీసీ, మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజానోళ్ళ లక్ష్మి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ప్రముఖ అతిథి ఆహ్వానితుల నుండి శక్తివంతమైన, ప్రేరణాత్మక ప్రసంగాలు చేసారు. కోట నీలీమా తన మాటలతో హాజరైన వారిని ప్రేరేపించారు. శ్రీరంగం ఫౌండేషన్ సహ వ్యవస్థాపకురాలు ఇందు శ్రీరంగం మహిళలను శక్తివంతం చేయడం, మహిళలకు నిజమైన నాయకత్వం అనే తన అద్భుతమైన ప్రయాణాన్ని పంచుకున్నారు. సమాన హక్కులు, యాజమాన్యం అనే ఆలోచన ఆధారంగా మహిళా కేంద్రీకృత రాజకీయాలను బలోపేతం చేయడం, అట్టడుగు స్థాయి మహిళా రాజకీయ నాయకులను సృష్టించడం శక్తి అభియాన్ లక్ష్యం అని అన్నారు. ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి ఈ కార్యక్రమానికి ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. వారి సమిష్టి కృషి ఈ కార్యక్రమాన్ని పాల్గొన్న వారందరికీ చిరస్మరణీయమైన, ప్రభావవంతమైన అనుభవంగా మార్చింది. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా బ్లాక్ అధ్యక్షురాళ్లు, డివిజన్ మహిళా అద్యక్షులురాళ్లు కృష్ణవేణి, రాధ, రజిత, జోజమ్మ, చంద్రకళ, జ్యోతి, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి

- రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయాలి
- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేకా అశోక్ రెడ్డి

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 21**



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేకా అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిపురం గ్రామంలో రైతు సంఘం సభ్యత నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, సంవత్సరం క్రితం రాష్ట్రంలో అధికారం కు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అనేక హామీలు ఇచ్చిందని రైతాంగ హామీల నెరవేర్చడంలో చొరవ చూపాలని అన్నారు. 42 లక్షల మంది రైతులకు కేవలం 25 లక్షల మంది రైతులకు31వేల కోట్లకు గాను 21వేల కోట్లు చెలించగా ఇంకా 17 లక్షల మంది రైతులకు 10 వేల కోట్లు ఋణమాఫీ కాలేదని అన్నారు. రైతులు అప్పులు తెచ్చి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతు భరోసా 15వేల రూ. ప్రకటించి దానిని 12 వేలకు కుదించి పూర్తిస్థాయిలో అందివ్వకపోవడంతో, రైతులు ఆందోళన చెందుతున్నారని, ఇప్పటికీ మూడు ఎకరాల వరకు కూడా పడలేదని భరోసా ఇవ్వాలని అన్నారు. బోనస్ 500రూ పూర్తి స్థాయిలో చెల్లించలేదని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. రైతు బీమా 59 సంవత్సరాల నుండి 65 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. కరువు తాండవించడంతో, వరి పంట వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయి ఆందోళన చెందుతున్నారని పంట నష్టపరిహారాన్ని అంచనా వేయలేదు, నష్టపోయిన రైతులకు ఎకరానికి 30 వేల రూపాయల పరిహారం అందివ్వాలన్నారు. ధర్మారెడ్డి పల్లి, పిలాయిపల్లి కాల్వలకు నీరందక భూగర్భ జలాలు అడిగింటాయని దీని మూలంగానే పంటలు ఎండిపోయాయని వెంటనే ఈ రెండు కాలువలను పూర్తి చేసి చెరువులు కుంటలు నింపి నీరందివ్వాలని లేనిపక్షంలో రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు బల్గూరి అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, మాజీ ఎంపిటిసి బడుగు రమేష్,రాపోలు ప్రభాకర్, బలుగూరి ఉపేందర్, మాజీ చైర్మన్లు దోమలపల్లి నర్సింహా సిల్వారు సత్తయ్య, దాడి మల్లారెడ్డి,ఏళ్ల రుక్మారెడ్డి, దాడి సుభాష్ రెడ్డి, మోటే మల్లేశం, బల్గురి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి అధికారికి ఇంకా అందలం ఎందుకు?

- విద్యుత్ కనెక్షన్ లేని మిల్లులకు ధాన్యం కేటాయింపులు ఏం ప్రాతిపదిక
- పీవీ పేరుతో వాటాలేసుకున్న తోడు దొంగలు
- ఒకరిని సస్పెండ్ చేసినా...ఇంకొకరిని ఎందుకు కాపాడుతున్నారు?
- కేసులు నమోదు చేశామని చెబుతూ... ధాన్యం రికవరీపై దృష్టి ఏదీ ?
- ఈ విధానం వల్ల రైస్ మిల్లర్లకే అధిక లాభం చేస్తున్న సివిల్ సప్లయ్ అధికారి
- అర్హత ఉన్న 40 మిల్లులకు కాకుండా.. అసంపూర్తి మిల్లులకు, పక్కా జిల్లా మిల్లులకు సీఎంఆర్ కేటాయింపులు
- డిఎస్ఓ అవినీతిపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలి
- బీసీ పొలిటికల్ జెఏసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

**వనపర్తి వెలుతురు మార్చి 21:**



సివిల్ సప్లయ్ శాఖలో ధాన్యం పేరుతో కోట్లాది రూపాయలు దండుకున్న అవినీతి అధికారి కాశీ విశ్వనాథ్ ను ఇంకా ఎన్ని రోజులు అందలం ఎక్కిస్తారని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాశీ విశ్వనాథ్ వనపర్తి డీఎస్ఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, జిల్లాలో దాదాపు 40 మిల్లులకు అర్హత ఉన్నా.. తప్పుడు సమాచారంతో పక్క జిల్లాలకు ధాన్యం కేటాయించారన్నారు. సస్పెండైన పాత డీఎం ఇర్ఫాన్ మరియు డిఎస్ఓ కాశీ విశ్వనాథ్ తోడు దొంగల్లా దోపిడీ చేసి ఫిజికల్ వెరిఫికేషన్ పేరుతో వసూళ్లకు పాల్పడి...ఆపై వాటాలేసుకున్నారని మండిపడ్డారు. విద్యుత్ కనెక్షన్ లేని మిల్లులకు ధాన్యం కేటాయింపులు ఏ ప్రాతిపదికన కేటాయించారో చెప్పాలని, కెపాసిటీకి మించి డబ్బులు ఇచ్చిన వారికి సన్నధాన్యం, ఇవ్వని వారికి దొడ్డు ధాన్యం కేటాయింపులు చేశారన్నారు. సస్పెండ్ వరకు వెళ్లిన డిఎస్ఓ.. ఎంత ముడుపులు ఇస్తే ఇక్కడ కొనసాగించేందుకు ఉన్నతాధికారులు ఒప్పుకున్నారని ప్రశ్నించారు. అవినీతి అక్రమాల నేపథ్యంలో ఒకరిని సస్పెండ్ చేసినా.. ఇంకొకరిని ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. డీ ఫాల్టర్ల మీద కేసులు నమోదు చేశామని చెబుతున్న అధికారులు ధాన్యం రికవరీపై దృష్టి ఎందుకు పెట్టడం లేదో చెప్పాలన్నారు. ఈ విధానం వల్ల సివిల్ సప్లయ్ అధికారి రైస్ మిల్లర్లకే అధిక లాభం చేస్తున్నారని, అర్హత ఉన్న 40 మిల్లులకు కాకుండా.. అసంపూర్తి మిల్లులకు, పక్కా జిల్లా మిల్లులకు సీఎం ఆర్ కేటాయింపులు చేసినట్లు రుజువైనా చర్యలు తీసుకోకుండా అతడిని ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, పట్టణ అధ్యక్షులు దేవర శివ, కొత్తకోట మండల అధ్యక్షుడు ఆంజన్న యాదవ్, పెద్దమందడి మండల అధ్యక్షుడు రమేష్ సాగర్, శేఖర్ గౌడ్, రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వం బడ్జెట్ లో పేదల సంక్షేమానికి పెద్దపీట

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.

**కూకట్ పల్లి మార్చి 21 వెలుతురు:**



అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అనే మూడు అంశాలు తమ నినాదం అని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 2025 - 2026 ప్రజారంజక బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ని, సహచర మంత్రివర్గ మండలిని అభినందిస్తూ గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు డా. సత్యం శ్రీరంగం, రవళి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ అసెంబ్లీ లో ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ రూ.3,04,965 కోట్లతో రాష్టాభివృద్ధి, పేదల సంక్షేమాన్ని సమన్వయం చేసుకుని రూపొందించిన బడ్జెట్ గా ఉందని అన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంకు రూ.1,143 కోట్లు కేటాయించగా.. గ్యాస్ సిలీండర్ రాయితీకి రూ.723 కోట్లు కేటాయించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంకు రూ.600 కోట్లు, విద్యుత్ రాయితీకి రూ. 11,500 కోట్లు, రాజీవ్ యువ వికాసం పథకంకు రూ. 6వేల కోట్లును బడ్జెట్లో కేటాయింపులు చేశారన్నారు. రూ.2 లక్షలలోపు రైతురుణాలు మాఫీ చేశామని, 25.35 లక్షల మంది రైతులకు 20,616 కోట్లు మాఫీ జరిగిందన్నారు. వ్యవసాయ చరిత్రలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం గొప్ప మైలు రాయిగా నిలిచిందన్నారు. విద్య, వైద్యం సంక్షేమానికి అధిక నిధులు కేటాయించి ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఎస్సీ సంక్షేమం కోసం రూ.40,232 కోట్లు, ఎస్టీ సంక్షేమం కోసం రూ.17,169 కోట్లు, బీసీ సంక్షేమం కోసం రూ.11,405కోట్లు, మైనారిటీ సంక్షేమం కోసం రూ.3,591 కోట్లు దాదాపు 72,397 కోట్లు కేటయించడం హర్షణీయమన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, పశు సంవర్ధక ప్రాముఖ్యత కల్పించారన్నారు. సబ్బండ వర్గాలకు అండగా ప్రజాప్రభుత్వం ఉంటుందని మరోసారి రుజువుఅయ్యిందని అన్నారు. మహిళా, శిశు సంక్షేమం కోసం రూ.2,862 కోట్లు కేటాయించడం జరిగిందని, పేదల దీర్ఘకాలిక, శాశ్వత ప్రయోజనాలు లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని అన్నారు. గత ప్రభుత్వం మహిళా సంక్షేమానికి వివక్ష చూపితే ఈ ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి, వారి ఆర్థికాభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించడం సంతోషదాయకం అన్నారు. కేటీఆర్, హరీష్ అవాకులు చెవాకులు ప్రజలు గమనిస్తున్నారన్నారు అని అన్నారు. గవర్నర్ ప్రసంగం కాంగ్రెస్ పార్టీ ప్రసంగం అన్నారు. గవర్నర్ ప్రసంగం ఏ పార్టీ ఉంటే ఆ పార్టీ లైన్ లోనే మాట్లాడతారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి మీరు మంత్రిగా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పలుకులే గవర్నర్ పలుకుతారాని చిన్న విచక్షణ జ్ఞానం లేకుండా పోయిందన్నారు. మీరు చేసిన దరిద్రపు పాలనలో చేసిన అప్పులకే 15 నెలల్లోనే 90 వేల కోట్లు పోయిందన్నారు. మీ హయాంలో ఏ వర్గంకు న్యాయం చేసారు, అన్ని వర్గాలను మోసం చేసారని అన్నారు, అనేక పాఠశాలలు మూసి వేశారు, విద్యార్థులను మోసం చేసారు, విద్య రంగాన్ని భ్రష్టు పట్టించారు. ప్రజా ప్రభుత్వంలో 58 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం 11 వేల కోట్లతో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగం భృతి, ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా ఐదు సంవత్సరాలు నట్టేటా ముంచారు. నిరుద్యోగులు ఇప్పుడు ప్రజాప్రభుత్వంలో పండుగ చేసుకుంటున్నారని, దాదాపు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని అన్నారు. నిరుద్యోగులు న్యాయం చేకూర్చే విధంగా ప్రతి నోటిఫికేషన్ ను పకడ్బందీగా, ప్రణళికబద్దంగా ఉద్యోగాలు కల్పిస్తున్నాము అన్నారు. ఈ బడ్జెట్ లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన ఆరు గ్యారంటీలకు పెద్దపీట వేశారన్నారు. అబద్దపు విమర్శలను తిప్పి కొడుతూ వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం మా బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ 2050 అనే ప్రణాళికతో సీఎం పాలనను ముందుకు నడిపిస్తున్నారు. నేడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిణామం 200 బిలియన్ డాలర్లు. రాబోయే ఐదేళ్లలో ఐదు రెట్లు అభివృద్ధి చేసి 1000 బిలియన్ డాలర్లు ఉండేలా కార్యాచరణ ఉంటుందన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన జహీరాబాద్ బిఆర్ఎస్ నాయకులు.

**జహీరాబాద్ వెలుతురు మార్చి 21:**
మాజీ మంత్రి సిద్దిపేట శాసన సభ్యులు హరీశ్ రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన ఫోన్ ట్యాపింగ్ కేసు అనేది బోగస్ అని నిన్న తెలంగాణ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో శుక్రవారం అసెంబ్లీ లోని బిఆర్ఎస్ ఎల్పి కార్యాలయంలో హరీష్ రావుని, మాజీ మంత్రి బాల్కొండ శాసన సభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డిని జహీరాబాద్ శాసన సభ్యులు కొనింటి మానిక్ రావులతో జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం , కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు , మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి , యువ నాయకులు మిథున్ రాజ్ లు మర్యాదపూర్వకంగా కలిసి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అసెంబ్లీ లోని విజిటర్



గ్యాలరీలో కూర్చొని హరీష్ రావు ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు.

# కర్ణాటక రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలనీ రిలే దీక్ష

## రిలే దీక్షకు మద్దతు తెలిపిన సంగారెడ్డి జిల్లా ఎంఎస్పి ఉపాధ్యక్షులు జయరాజ్ మాదిగ



**జహీరాబాద్ వెలుతురు మార్చి 21:**
ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలనీ డిమాండ్ చేస్తూ కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు నరసప్ప ఆధ్వర్యంలో రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా ఎంఎస్పి ఉపాధ్యక్షులు జయరాజ్ మాదిగ దీక్షా శిబిరాన్ని సందర్శించి రిలే దీక్షకు మద్దతుగా తెలపడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎస్పి ఉపాధ్యక్షులు జయరాజ్ మాదిగ మాట్లాడుతూ... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్నారని కాబట్టి అదే విధంగా కర్ణాటక రాష్ట్రంలో ఉన్న మాదిగ ఉపకులాలకు ఏబిసిడి వర్గీకరణ జరిపించాలని అన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావుపై అధికార పార్టీ పెట్టిన కేసు విగడంపై హర్షం



**జహీరాబాద్ వెలుతురు మార్చి 21:**
ధర్మానికి అధర్మం మధ్య జరిగిన పోరులో ధర్మమే విజయం సాదించిందని పిచారేగడి సహకార బ్యాంక్ చైర్మన్, జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు స్రవంతి అరవింద్ రెడ్డి అన్నారు. అధికారంలో వచ్చిన వెంటనే మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుపై అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు పెట్టి వేదించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం శతవిధాల ప్రయత్నాలు చేయడంతో న్యాయస్థానన్ని ఆశ్రయించడంతో విచారించిన హైకోర్టు కేసులో ఎలాంటి ఆధారాలు లేవని చెబుతూ మాజీ మంత్రి హరీష్ రావుని క్లిన్ చిట్ ఇవ్వడాన్ని చైర్మన్ స్రవంతి రెడ్డి స్వాగతించి ఇంకా న్యాయం బ్రతికే ఉందని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించడం, అసెంబ్లీలో అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసలపై ఎప్పుటికప్పుడు నిలదీయడంతోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి కి జీర్ణం కనందునే అక్రమ కేసు బనాయించి కోర్టులో ఒడిపోయారని అన్నారు.

# వడగళ్ల కు నెల రాలిన మామిడి





**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 21**
మంచిర్యాల జిల్లాలో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో భారీ రాళ్ల వర్షం పడుతుంది. మంచిర్యాల జిల్లా కేంద్రంతో పాటు చెన్నూరు, బెల్లంపల్లి మండలంలోని పలు గ్రామాలలో ఈదురు గాలులతో భారీ వర్షం పడుతుంది. మంచిర్యాల పట్టణం ప్రధాన రహదారి రోడ్డు వర్షంతో జలమయం గా మారింది. కొమురంభీం జిల్లా కాగజ్ నగర్ పట్టణంతో పాటు మండలంలో భారీ ఈదురుగాలులు వీచాయి. నెలకొరిగిన భారీ వృక్షాలు. పలు చోట్ల వడగండ్లతో కూడిన వర్షం. రహదారులపై చెట్లు విరిగి పడడంతో గంట పాటు స్థంభించిన రాకపోకలు. మంచిర్యాల పట్టణంలో భారీ ఈదురు గాలుల తో కురుస్తున్న వాన. జలమయం అవుతున్న లోతట్టు ప్రాంతాలు నెన్నెల లో మామిడి మొక్కజొన్న వరి పంట రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు వడగళ్ల కు రాలిన మామిడి కాయలు కిందపడ్డ మొక్కజొన్న, వరి పంటలు తీవ్రంగా నష్టపోయిన రైతాంగం

# మూసీ ప్రక్షాళనకు నిధుల విడుదల చేయండి: ఈటెల

**న్యూఢిల్లీ,మార్చి21( వెలుతురు):**
మూసీ ప్రక్షాళన, మురుగునీటి శుద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించాలని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. పార్లమెంట్ లో మాట్లాడిన ఆయన.. శుభ్రమైన తాగునీటి కోసం తెలంగాణకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో పట్టణీకరణ వేగంగా పెరిగిపోతుండటంతో.. నీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇక, పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వాలు తగినంత మౌలిక సదుపాయాలు, సేవలను అందించడంలో ఇబ్బంది పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ సవాళ్లను గుర్తించి కేంద్రం స్మార్ట్ సిటీ-స్, అమృత్ పథకాల కింద నిధులు ఇవ్వడం ఎంతో ప్రశంసనీయమైందన్నారు.

# 10వ తరగతి వార్షిక పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 21**
జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయని, పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆర్.బి.హెచ్.వి., జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, తహశిల్దార్ రఫతుల్లా లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. త్రాగునీరు, విద్యుత్ సరఫరా, ఆర్.టి.సి. బస్సులు, ప్రశ్నా, జవాబు పత్రాల రవాణా, బందోబస్తు, పారిశుద్ధ్యం అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పరీక్షల నిర్వహణ కొరకు 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షల మొదటి రోజు 9 వేల 183 మంది హాజరు కావలసి ఉండగా 9 వేల 163 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారని, ఒకసారి అనుత్తీర్ణులైన వారు 6 మంది హాజరు కావలసి ఉండగా ఇద్దరు హాజరయ్యారని, 99.74 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని తెలిపారు.





### విధులలో నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు

మొదటి రోజున జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష 2 గంటల ఆలస్యంగా ప్రారంభమైందని తెలిపారు. రోజు వారిగా, ప్రశ్నాపత్రాల సెట్ల వారిగా పోలీస్ స్టేషన్ నుండి ప్రశ్నాపత్రాలను బందోబస్తు మధ్య ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని పరీక్షా కేంద్రాలకు తరలించడం జరుగుతుందని, ఆఖరి నిమిషం వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకునే ప్రశ్నాపత్రాల వివరాలు ఎవరికి తెలియదని తెలిపారు. మంచిర్యాల పోలీస్ స్టేషన్ నుండి స్టేషన్ పరిధిలోని పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు తరలించవలసి ఉంటుందని, ఈ క్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం-03015 కు తరలించే ట్రంక్ బాక్సులో రెండవ రోజు పరీక్ష సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఉన్నాయని గమనించి, పరీక్షా కేంద్రానికి రావలసిన ప్రశ్నాపత్రాలు బాక్సును వెతకడంలో 1.30 గం॥ల సమయం పట్టిందని, ఉన్నతాధికారుల అనుమతి పొంది, పరీక్షా కేంద్రానికి తరలించి, విద్యార్థులకు ప్రశ్నాపత్రాలను అందించడంలో మొత్తం 2 గంటల ఆలస్యం జరిగిందని, విద్యార్థులు పరీక్ష వ్రాసేందుకు ఉదయం 11.30 గం॥ల నుండి మధ్యాహ్నం 2.30 గం?ల వరకు నిబంధనల ప్రకారం 3 గంటల సమయం ఇవ్వడం జరిగిందని, 2 గంటల ఆలస్యంగా పరీక్ష ప్రారంభమైనందున విద్యార్థులకు స్నాక్స్ అందించడం జరిగిందని తెలిపారు. ట్రంక్ బాక్స్లో గుర్తించి రెండవ రోజు పరీక్ష ప్రశ్నాపత్రాలను తెరువలేదని, రాష్ట్ర ప్రభుత్వ సీల్తో పోలీస్టేషన్లో అలాగే భద్రపర్చబడి ఉందని తెలిపారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని, ఒక ప్రశ్నాపత్రానికి బదులు మరొక ప్రశ్నాపత్రం ఇచ్చారని, పేపర్ లీక్ అయింది అంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తెలిపారు. విధులలో నిర్లక్ష్యం, అలసత్వం వహించిన పరీక్షా కేంద్రం ముఖ్య పర్యవేక్షకులు మీర్ సప్తర్ అలీఖాన్, శాఖ అధికారి ఎన్.ఆర్. పద్మజ లను సస్పెండ్ చేయడం జరిగిందని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి పొరపాట్లు పున:రావృతం కాకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడడమే ప్రధాన లక్ష్యం

- పూర్తిస్థాయిలో ప్రమాదాల నివారణకు చర్యలపై సమీక్షా
- పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 21**
రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోనీ జాతీయ రహదారి NH-63, NH-363 మరియు రాష్ట్ర రహదారి SH-1, SH-24, SH-08, Other Roads లలో 2022 నుండి 2024 వరకు జరిగిన ప్రమాదాల వివరాలు, చనిపోయిన వారికీ వివరాలు, ప్రమాదం గల కారణాలు, ప్రమాదాల నివారణ తీసుకొన్న చర్యలు, బ్లాక్ స్పాట్స్ గుర్తింపు, తదితర అంశాలపై ట్రాఫిక్ పోలీస్, సంబందింత పోలీస్ స్టేషన్ ల అధికారులతో రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా "రోడ్డు సేఫ్టీ" సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. పోలీస్ అధికారులు వారి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరుగు ప్రాంతాలను, బ్లాక్ స్పాట్స్ ను పవర్ గూగుల్ మ్యాపింగ్ ద్వారా సీపీ కి వివరించడం జరిగిందన్నారు. సిపి మాట్లాడుతూ ..... రామగుండం పోలీస్ కమిషనర్ పరిధి మొదల నుంచి చివరి వరకు ప్రయాణించే వారికి ట్రాఫిక్, రోడ్డు సేఫ్టీ పై ఒక నమ్మకం, భరోసా కలగాలి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని , బ్లాక్ స్పాట్ల వద్ద పోలీస్, ట్రాఫిక్ అధికారులు, ఇతర సంబందిత అధికారుల తో కలిసి స్పాట్స్ సందర్శించి ప్రమాదాలకు సంబందించిన కారణాలు గుర్తించాలి, నివారణ మార్గాలను గుర్తించి పరిష్కార మార్గాల ఏర్పాటుకు కృషి చేయాలి. రేడియం స్టికర్లతో కూడిన సూచికలను ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారుల పై అవసరమైన చోట వాహన వేగాన్ని నియంత్రించే స్పీడ్ బ్రేకర్స్ లను ఏర్పాటు చేయాలని, కెమెరాలు, లైట్లు, స్పీడ్ కెమెరాలు, జంక్షన్ ల వద్ద, పాదచారులు రోడ్డు దాటే దగ్గర జిబ్రా క్రాసింగ్, లైటింగ్, రోడ్డు రిఫ్లెక్టింగ్ లైట్లు ఏర్పాటు చేయాలని సిపి గారు సూచించారు. మీ మీ పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాలను సందర్శించాలి ప్రతి విషయం తెలుసుకోవాలి, ఇన్ఫర్మేషన్ వ్యవస్థను పటిష్టం చేయాలి. రోడ్డుపై విజిబుల్ పోలీసింగ్ ఉండాలి. సిసి కెమెరాల ఏర్పాటు కు ప్రాముఖ్యత ఇవ్వాలి నేర నియంత్రణలో ప్రధాన పాత్ర సీసీ కెమెరాలు పోషిస్తాయి. ప్రజలు రద్దీ ఉండే ప్రాంతాల్లో విసిబుల్ పోలీసింగ్ ఉండాలి తద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ కాకుండా స్నాచింగ్, రాబరీ, గంజాయి అక్రమ రవాణాను మరియు ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించవచ్చు. డ్యూటీ సమయంలో సిబ్బంది మరియు అధికారులు స్వీయ రక్షణ పాటిస్తూ , జాగ్రత్తలు తీసుకోని విధులు నిర్వహించాలి అని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, ట్రాఫిక్ ఏసిపి నరసింహులు, టాస్క్ ఫోర్స్ ఏసిపి మల్లారెడ్డి, రామగుండం శ్రీ ప్రవీణ్ కుమార్, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఐటీసీ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్, ఇన్స్పెక్టర్ రమేష్ బాబు, సిసి హరీష్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.





# ఎల్.ఆర్.ఎస్. ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిశోర్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 21**
ఎల్.ఆర్.ఎస్.-2020 పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత గల వారు రుసుము చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ %డ% అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిశోర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రిజిస్ట్రేషన్ %డ% స్టాంప్స్ శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాష్ జ్యోతి, జోనల్ కమీషనర్ అపూర్వ లతో కలిసి జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ %డ% అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ జిల్లాలో అనుమతి లేని లే-అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియపై ప్రజలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. లే-అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులలో అర్హులైన దరఖాస్తుదారులు ఈ నెల 31వ తేదీ నాటికి పూర్తి ఫీజు చెల్లించినట్లయితే 25 శాతం ఫీజు తగ్గించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయంపై ఫీజు చెల్లించేందుకు దరఖాస్తుదారులకు వివిధ ప్రసార, ప్రచార మాధ్యమాల ద్వారా సమాచారం అందించి ఫీజు చెల్లించే విధంగా విస్తృత ప్రచారం చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎల్.ఆర్.ఎస్.-2020 పథకంలో అర్హులైన ప్రతి లబ్దిదారుడు రుసుము చెల్లించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఎఫ్.టి.ఎల్. / నిషేధిత భూములకు సంబంధించి ఎల్-2 లాగిన్ లో ఆప్షన్ ఇవ్వడం జరిగిందని, నూతన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, రుసుము చెల్లించిన వారికి పట్టాల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. మున్సిపల్ కమీషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారులు, మండల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణాలు అధికంగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎల్.ఆర్.ఎస్.-2020 పథకంలో అర్హులైన అభ్యర్థుల నుండి రుసుము చెల్లించే విధంగా జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తు సమయంలో దరఖాస్తుదారుల మొబైల్ నంబర్, చిరునామా వివరాలు తీసుకోవడం జరిగిందని, వారికి ఫోన్ కాల్ చేసి రుసుము చెల్లింపు వివరాలు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఎఫ్.టి.ఎల్. /నిషేధిత భూములకు సంబంధించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# నారా దేవాన్ష్ పుట్టినరోజు

- శ్రీవారిని దర్శించుకున్న నారా కుటుంబం



**తిరుమల, మార్చి21 ( వెలుతురు):**

టీడీపీ అధినేత చంద్రబాబు మనవడు నారా దేవాన్ష్ పుట్టినరోజు.. సందర్భంగా నారా కుటుంబ సభ్యులు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. నారా లోకేష్, భువనేశ్వరి, బ్రహ్మణి, దేవాన్ష్ శ్రీవారి సేవలో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాన్ష్ ప్రతి పుట్టిన రోజున తిరుమలలో ఒక్కరోజు అన్న వితరణకు అయ్యే ఖర్చు టిటిడి అన్నప్రసాదం ట్రస్ట్‌కు లోకేష్ విరాళమిచ్చారు. ఉదయం అన్నప్రసాద సముదాయంలో యాత్రికులకు అల్పాహారాన్ని వడ్డించారు. శుక్రవారం ఉదయం చంద్రబాబు కుటుంబంతో కలిసి తిరుమల శ్రీవారి సేవలో పాల్గొన్నారు. తర్వాత వెంగమాంబ అన్నదాన వితరణ కేంద్రంలో కుటుంబసభ్యులతో కలిసి ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవాన్స్ కూడా భక్తులకు అన్న ప్రసాదాల పంపిణీ చేశారు. దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా అన్న ప్రసాదాలకు ఒకరోజు అయ్యే ఖర్చును టీటీడీ అన్నదాన ట్రస్ట్‌కు చంద్రబాబు విరాళంగా అందజేశారు. కాగా దేవాన్ష్ బర్త్ డే సందర్భంగా ప్రతి ఏడాది తిరుమలలో ఒక్క రోజు అన్నదానానికి అయ్యే ఖర్చును చంద్రబాబు కుటుంబం విరాళంగా అందజేస్తున్న సంగతి తెలిసిందే.

# ఎపిలో డ్రగ్స్, మెడికల్ షాపులపై దాడులు

- డిజిపి ఆదేశాలతో ఈగిల్ బృందాల తనిఖీలు

**విజయవాడ, మార్చి21 ( వెలుతురు):**

ఆంధ్రప్రదేశ్ లో మెడికల్ షాపులు, ఏజెన్సీలపై డ్రగ్ ఇన్స్పెక్టర్లు, విజిలెన్స్, పోలీస్ అధికారులు దాడులు నిర్వహించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మెడికల్ ఏజెన్సీలు మందుల షాపులపై విజిలెన్స్, డ్రగ్ ఇన్స్పెక్టర్లు, ఈగల్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. మందుల నాణ్యత, రికార్డులను అధికారులు పరిశీలించారు. విజిలెన్స్ ఎస్పీ ఎం. స్నేహిత, డ్రగ్స్ ఏడి నాగమణి రాజమండ్రి తిరుమల శ్రీనివాస్ మెడికల్ ఏజెన్సీలో ఆకస్మిక తనిఖీలు చేశారు. మెడికల్ గా ఒకే మోతాదులో వినియోగించే సిరఫ్, ఇంజక్షన్లు మత్తు మందులను కొంతమంది యువత అక్రమంగా వినియోగిస్తోంది. ఈ నేపథ్యంలో డీజీపీ ఆదేశాలతో మెడికల్ షాపులలో నాలుగు ప్రత్యేక బృందాలు ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. రాజమండ్రిలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా తిరుమల ఏజన్సీలో విక్రయిస్తున్న ట్రమడాలు మత్తుమందు 255 ఇంజక్షన్లను విజిలెన్స్ ఎస్పీ స్నేహిత పట్టు–కున్నారు. యువత కొంతమంది తప్పుడుగా వైద్యం కోసం వినియోగించే మత్తు కలిగించే మెడిసిన్స్ ను విరివిగా వాడుతున్నట్టు సమాచారం. అందుకే డిజేపీ ఆదేశాలతో జిల్లాలో 16 చోట్ల దాడులు చేస్తున్నామని తెలిపారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ ఏజెన్సీలో, మెడికల్ షాపులలో ట్రమాడాల్ ఇంజక్షన్లు, మత్తు కలిగించే సెరఫ్ లు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 100 బృందాల ఆధ్వర్యంలో ఆపరేషన్ గరుడ నిర్వాహిస్తున్నామని ఈగల్ టీమ్ ఐజీ రవికృష్ణ తెలిపారు. గుణదల మెడికల్ షాప్ లో ఆకస్మిక దాడులు చేశారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్న మెడికల్ షాపులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతి లేని మందులు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రిస్క్రిప్షన్ మీద అమ్మవలసిన మందులు మాత్రమే మందుల షాపులో విక్రయించాలి. అలా లేనియెడల వారిపై చర్యలు తీసుకుంటామని డ్రగ్స్ డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్ వెల్లడించారు.

# బెట్టింగ్ యాప్ కేసు కొట్టేయండి: శ్యామల




**హైదరాబాద్, మార్చి21 ( వెలుతురు):**

బెట్టింగ్ యాప్‌ల కేసులో యాంకర్ శ్యామల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బెట్టింగ్ యాప్ కేసులో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని పిటిషన్ వేశారు. దీనిపై కోర్టులో విచారణ జరగనుంది. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో శ్యామలపై కేసు నమోదైన విషయం తెలిసిందే. సామాజిక మాధ్యమాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో టీ–వీ యాంకర్ విష్ణుప్రియ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ రీతూచౌదరిలను పంజాగుట్ట పోలీసులు నిన్న సుదీర్ఘంగా విచారించిన విషయం తెలిసిందే.

# త్వరలో స్వదేశానికి మరికొంతమంది అక్రమ వలసదారులు

**న్యూఢిల్లీ, మార్చి21 ( వెలుతురు):**

తాను గెలిస్తే అక్రమ వలసదారులను దేశం నుంచి సాగనంపుతానంటూ చేసిన శపథాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నెరవేర్చుకుంటున్నారు. అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వలసదారులపై కొరడా ఝుళిపిస్తున్నారు. ఇప్పటికే అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న పలు దేశాలకు చెందిన వారిని ప్రత్యేక విమానాల్లో స్వదేశాలకు పంపిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వందలాది మంది భారతీయులను కూడా స్వదేశానికి తరలించారు. యూఎస్‌లో అక్రమంగా నివసిస్తున్న 300 మందికిపైగా భారతీయుల్ని ట్రంప్ సర్కార్ ప్రత్యేక విమానాల్లో స్వదేశానికి తరలించింది. తాజాగా మరో 295 మంది భారతీయుల్ని వెనక్కి పంపనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. ఈ మేరకు అక్రమ వలసల అంశంపై పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగ శాఖ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది. 'జనవరి 2025 నుంచి ఇప్పటి వరకూ మొత్తం 388 మంది భారతీయుల్ని అమెరికా వెనక్కి పంపింది' అని రాజ్యసభలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు.

# మూడున్నర కోట్ల జనాభా... నాలుగున్నర కోట్ల మొబైల్ ఫోన్లు

**హైదరాబాద్, మార్చి21 ( వెలుతురు):**



తెలంగాణలో జనాభా కంటే మొబైల్ ఫోన్ల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇది ఆధునిక టెక్నాలజీ వినియోగం, రాష్ట్రంలోని కనెక్టివిటీ స్థాయిని సూచిస్తుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ జనాభా సుమారు 3.50 కోట్లు (35 మిలియన్లు)గా ఉంది. అయితే, 2025 నాటికి ఈ సంఖ్య కొంత పెరిగి 3.77 కోట్లు లేదా అంతకంటే ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేయవచ్చు, ఎందుకంటే రాష్ట్ర జనాభా దశాబ్ద వృద్ధి రేటు (2001–2011) 13.58%గా ఉంది. మొబైల్ ఫోన్ సంఖ్యల విషయానికొస్తే, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా తాజా డేటా ప్రకారం, తెలంగాణలో యాక్టివ్ మొబైల్ కనెక్షన్ల సంఖ్య జనాభా కంటే ఎక్కువగా ఉంది. 2023 సెప్టెంబర్ నాటికి తెలంగాణలో 4.5 కోట్లకు పైగా మొబైల్ సబ్‌స్క్రిప్షన్లు ఉన్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఇది జనాభా కంటే సుమారు 20–25 ఎక్కువ.

బహుళ సిమ్ వినియోగం: చాలా మంది వ్యక్తులు ఒకటి కంటే ఎక్కువ సిమ్ కార్డులను ఉపయోగిస్తారు ఒకటి వ్యక్తిగత వినియోగం కోసం, మరొకటి వ్యాపారం లేదా ఇంటర్నెట్ కోసం. ఇది మొబైల్ కనెక్షన్ల సంఖ్యను పెంచుతుంది.

ఇంటర్నెట్ వ్యాప్తి: తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో, ఇంటర్నెట్ వినియోగం చాలా ఎక్కువ. దీని కోసం చాలా మంది డేటా సిమ్‌లను అదనంగా కొనుగోలు చేస్తారు.

వ్యాపార కనెక్షన్లు: ఐటీ హబ్‌గా ఉన్న హైదరాబాద్‌లో వ్యాపార సంస్థలు, కంపెనీలు ఉద్యోగుల కోసం బహుళ కనెక్షన్లను నిర్వహిస్తాయి.

పిల్లలు, వృద్ధులు: జనాభాలో కొంత శాతం (పిల్లలు, వృద్ధులు) ఫోన్‌లను ఉపయోగించకపోయినా, కనెక్షన్ల సంఖ్య వారిని కూడా మించిపోతుంది.

5 కోట్లకు చేరే అవకాశం..

ఈ ట్రెండ్ కొనసాగితే, తెలంగాణలో మొబైల్ కనెక్షన్ల సంఖ్య 5 కోట్లకు చేరవచ్చు, అదే సమయంలో జనాభా 4 కోట్ల లోపే ఉండవచ్చు. ఇది జనాభా కంటే ఫోన్ సంఖ్యలు ఎక్కువగా ఉన్నాయనే వాస్తవాన్ని బలపరుస్తుంది. ఈ ధోరణి భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా కనిపిస్తుంది, కానీ తెలంగాణలో ఐటీ రంగం మరియు అధిక అక్షరాస్యత (66.46% – 2011, ఇప్పుడు మరింత పెరిగి ఉండవచ్చు) దీనిని మరింత ప్రోత్సహిస్తున్నాయి.

# ఎస్సీ వర్గీకరణతో దేశానికి ఆదర్శంగా తెలంగాణ

***30 ఏళ్ళ వర్గీకరణ పోరాటానికి దారి చూపిన కాంగ్రెస్***

**,పెద్దపల్లి మార్చి21 ( వెలుతురు):**




బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చారిత్రాత్మకం, 11ఏళ్ళలో తెలంగాణకు బీజేపీ చేసిందేమీలేదని, సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించి దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఎస్సీ వర్గీకరణ, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం పట్ల పెద్దపల్లి పట్టణం లోని చేకురాయి క్రాస్ నుండి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఈ సందర్భంగా జెండా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ, మాదిగ ఉపకులాలు చేసిన పోరాటానికి దారిచూపిన ఘనత కాంగ్రెస్ దేనన్నారు. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ పేరు ప్రఖ్యాతులు గల 4 గురు న్యాయవాదులను నియమించి 7 గురు న్యాయమూర్తుల ధర్మాసనానికి బలమైన వాదనలు వినిపించి 6 గురు న్యాయమూర్తులు వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పు వచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేశారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం జరిగిందన్నారు. అందరినీ సమన్వయం చేస్తూ ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి మండలికి కృతజ్ఞతలు తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాజ్యాంగం మేరకు రాష్ట్రంలో షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ ద్వారా ఎస్సీలను 3 భాగాలుగా విభజించిన 15 శాతం రిజర్వేషన్లు వాటా తేల్చామని అన్నారు. 1930లో బ్రిటీష్ కాలంలో కుల గణన జరిగిందని, 95 ఏళ్ళ తర్వాత తెలంగాణలో బీసీ కులగణన నిర్వహించడం చారిత్రాత్మకమన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించారని తెలిపారు. బీసీ బిల్లును కేంద్రానికి పంపి పార్లమెంటులో చట్టబద్ధత పొందేవరకు పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ పోరాడాలని కోరారు. పార్లమెంటులో బీసీ బిల్లుకు ఆమోదం తెలిపి బీజేపీ తన చిత్తశుద్ధిని నిరూపించు కోవాలని హితవు పలికారు. 11 ఏళ్ళ పాలనలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేసిందేమీలేదని విమర్శించారు. ఎన్డీయే పాలనలో దేశం ఆర్థికంగా దివాళ తీసిందని, మోడీ అసమర్థ పాలనకు ఇదే నిదర్శనమన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు గుండు సున్నా ఇచ్చారని ఎద్దేవా చేశారు. నల్ల చట్టాల పేరుతో రైతులను ఢిల్లీ నడి ఒడ్డున కాల్చి చంపిన బీజేపీకి కాంగ్రెస్ పై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 1200 కోట్లు సన్నవడ్లకు బోనస్ చెల్లిస్తే పెద్దపల్లి నియోజక వర్గ రైతులకు రు.58.62 కోట్లు సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించమని తెలిపారు. యువ వికాసం ద్వారా అర్హులైన యువతకు ఉపాధి కోసం సబ్సిడిపై రుణాలు అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పారదర్శకంగా పాలన చేస్తూ అభివృద్ధి, సంక్షేమం సాధిస్తుంటే బీఆర్ఎస్ నేత కేటీఆర్ కళ్ళు, చెవులు లేని గుడ్డి, చెవిటి వాడిలా ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. రానున్న యాసంగిలో కూడా గింజ కటింగ్ లేకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, సన్న వడ్లకు రూ. 500 బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించేందుకు నిరంతరం కాల్వల వెంట తిరుగుతున్నామని, పొలాలు ఎండకుండా సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పార్టీ కార్యకర్తల కృషితోనే పార్టీకి మనుగడ ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి పునాది అని, యువ వికాసం పథకం ద్వారా అర్హులైన కార్యకర్తలకు సబ్సిడీ రుణాలు అందజేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలని వివరించారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, ప్రకాష్ రావు, తిరుపతి రెడ్డి, నాయకులు గోపగాని సారయ్య గౌడ్, మస్రత్, బూశనవేణ సురేష్ గౌడ్, సందనవేన రాజేందర్, బండారి సునీల్, ఆరె సంతోష్, కడార్ల శ్రీనివాస్, దొడ్డుపల్లి జగదీష్, జాని, బొడ్డుపల్లి శ్రీనివాస్, బూతగడ్డ సంపత్, సుధాకర్ రెడ్డి, నేతెట్ల కుమార్, గుజ్జుల కుమార్, ఆరగొండ రాజ్ కుమార్, రవీందర్, పరమేశ్వర్, దాసరి రాజేశం, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేటీఆర్ పాదయాత్రకు అంతా సిద్ధం

**హైదరాబాద్,మార్చి21 ( వెలుతురు):**




భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్త టూర్ ప్రారంభమైంది. తెలంగాణ జిల్లాల్లోని పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశమవుతున్నారు. సూర్యపేట జిల్లా బీఆర్ఎస్ కార్యకర్తలతో కేటీఆర్ భేటీ అయ్యారు. సడెన్‌గా ఇలా కార్యకర్తల వద్దకు వెళ్లాలనే నిర్ణయం వెనుక చాలా పెద్ద కారణమే ఉంది. ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం. 25 సంవత్సరాలు పూర్తి చేసుకోనుంది గులాబీ పార్టీ. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సంబరాలు తెలంగాణ వ్యాప్తంగా జరుపుకోవాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. పార్టీ ప్లీనరీ సభ, ఏప్రిల్ 10 నుంచి 27వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఏప్రిల్ 27వ తేదీన వరంగల్‌లో జరిగే భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై కేటీఆర్ ఈ భేటీల్లో చర్చిస్తారు. దీని కోసం అన్ని జిల్లాల్లో సన్నాహక సభలు నిర్వహించనున్నారు. తెలంగాణ వ్యాప్తపర్యటన ఇప్పుడు పార్టీ వర్గాల్లోను, రాజకీయంగాను చర్చ సాగుతోంది. పార్టీకి కేటీఆర్ అండ్ హరీశ్‌రావు రెండు కళ్లు. 2018 ఎన్నికల తర్వాత కేటీఆర్‌కు వర్కింగ్ ప్రసిడెంట్‌గా కేసీఆర్ ప్రమోషన్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచిన తర్వాత కేసీఆర్ కేబినెట్‌లో కేటీఆర్‌తోపాటు హరీశ్‌రావుకు చోటు కల్పించలేదు. పార్టీలో కేటీఆర్‌కు ప్రమోషన్ ఇచ్చిన కేసీఆర్ హరీశ్‌కు ఏడాది తర్వాత ఆర్థికమంత్రిగా ఛాన్స్ ఇచ్చారు. గత శాసనసభ ఎన్నికల్లోను కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తే హరీశ్‌రావు మాత్రం మెదక్ జిల్లాకే పరిమితమయ్యారు. హరీశ్‌రావును కూడా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించేలా చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదన్న వాదన హరీశ్ అభిమానులు, పార్టీ నేతలు ప్రస్తావిస్తుంటారు. గతంలో ఇలా లీడ్ తీసుకొని పార్టీ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్న సందర్భాలు చాలా తక్కువ. ప్రత్యేక కార్యక్రమాలకే వెళ్లారు తప్ప ఇలా ఎప్పుడూ వెళ్లలేదు. ఇప్పుడు మాత్రం రాష్ట్రవ్యాప్తంగా టూర్ పెట్టుకున్నారు. ఈ మధ్య కాలంలోనే కేటీఆర్ మనసులో మాట చెప్పారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని ప్రకటించారు. అప్పట్లో ఇదో పెద్ద చర్చకు దారి తీసింది. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచనతోనే ఈ ప్రకటన చేశారా లేక కేటీఆర్ తనకు తానుగానే కార్యాచరణ ప్రకటించారా అన్న డిస్కషన్ పార్టీ వర్గాల్లో నడిచింది. ఇప్పుడు పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తోంది. దీన్ని విజయవంతం చేసే బాధ్యతను వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఉన్న కేటీఆర్‌కు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ అప్పగించారు. అందుకే కేటీఆర్ రాష్ట్ర టూర్ చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో సన్నాహక సభలు నిర్వహించి పార్టీ నేతలతో మాట్లాడతారు. ఇది కేవలం సిల్వర్ జూబ్లీ వేడుకల కోసం చేస్తున్న సన్నాహకం మాత్రమే కాదంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఇది ఓ రకంగా పార్టీ అంతా కేటీఆర్ కనుసన్నల్లోకి తీసుకొచ్చే ఎత్తుగడగా చెబుతున్నారు. కేటీఆర్‌కు కీలక బాధ్యతలు అప్పగిస్తారని ఎప్పటి నుంచో చర్చ నడుస్తున్నా అదే టైంలో సీనియర్ అయిన హరీశ్ పరిస్థితి ఏంటీ ఏ బాధ్యతలు అప్పగిస్తారనే మాట కూడా వినిపిస్తోంది. గులాబీ పార్టీలో సీనియర్ లీడర్లలో హరీశ్ రావు ఒకరు. పార్టీ ట్రబుల్ షూటర్‌గా ఆయనకు పేరు ఉంది. కేసీఆర్ పార్టీపరంగా అప్పగించే ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించడంలో దిట్ట. పార్టీలో ఏ సంక్షోభం వచ్చినా దాన్ని చల్చార్చేది హరీశ్ రావేనని పార్టీ నేతలు చెబుతారు. అటు పార్టీ సీనియర్లను, జూనియర్లను సమన్వయం చేస్తూ పార్టీకి అనుసంధానకర్త పాత్ర పోషిస్తారని టాక్. పార్టీలో కేటీఆర్ కన్నా హరీశ్‌రావే సీనియర్. అయితే కేటీఆర్‌కు ప్రమోషన్ ఇచ్చిన కేసీఆర్ హరీశ్ రావు పాత్ర మాత్రం తేల్చలేదు. మరి ఇప్పుడు గులాబీ సంబరాల సన్నాహక సభలకు కేవలం కేటీఆర్ ఒక్కరే వెళ్తారా... లేక హరీశ్ రావు కూడా జిల్లాలు పర్యటిస్తారా అన్న స్పష్టత ఇంకా లేదు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సంబరాలు, పార్టీ సభ్యత్వ నమోదు, ఏప్రిల్ 27 నాటి బహిరంగ సభ నిర్వహణకు టైం లేదు. దీంతో జిల్లాల పర్యటన బాధ్యతలు హరీశ్‌రావుకు కూడా అప్పగిస్తారా అప్పగించరా అన్న ఉత్కంఠ నెలకొంది. సాధారణంగా భారీ బహిరంగ సభలను విజయవంతం చేసే బాధ్యతలను హరీశ్ రావుకే ఎక్కువగా కేసీఆర్ అప్పగించిన సందర్భాలు ఉన్నాయి. వాటిని విజయవంతం చేసిన చరిత్ర హరీశ్ రావుకు ఉంది. ఏప్రిల్ 27వ తేదీ భారీ బహిరంగ సభ బాధ్యతలు హరీశ్ రావుకే అప్పగించవచ్చన్న వార్తలు వస్తున్నాయి. పార్టీలో ఉద్యమం నాటి నుంచి తనకుంటూ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న ఎమ్మెల్సీ కవితకు అప్పగించే బాధ్యతలు ఏంటనే మరో చర్చ నలుగుతోంది. మద్యం కేసులో జైలుకు వెళ్లి వచ్చినప్పటి నుంచి కవిత దూకుడుగా రాజకీయాల్లో పాల్గొంటున్నారు. ఎస్సీ, బీసీ వర్గాల సమస్యలు, డిమాండ్లపై సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీకి కౌంటర్లు ఇస్తూ పార్టీని బలోపేతం చేసే విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆమెకు కూడా ఎలాంటి పార్టీ పదవి ఇవ్వలేదు. కేటీఆర్‌కు పార్టీలో లీడింగ్ పోజిషన్ ఇచ్చిన కేసీఆర్, హరీష్ అండ్ కవితకు అప్పగించే బాధ్యతలు ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. వీరంతా కేసీఆర్ కుటుంబ సభ్యులే. అయినా ఉద్యమాలు చేశారు. రాజకీయాల్లో కూడా ప్రూవ్ చేసుకున్నారు. పార్టీ క్యాడర్‌పై ఈ ముగ్గురి ప్రభావం చాలా ఉంటుంది. అందుకే హరీశ్రావు, కవితకు భవిష్యత్ ఏంటని పార్టీలో వారి పాత్ర గురించే అందరూ ఎదురు చూస్తున్నారు.

# బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజల ప్రయోజనాలు పట్టవు

- ఆ రెండు పార్టీలకు ఓట్లు.. సీట్లే ముఖ్యం : కేటీఆర్



**హైదరాబాద్, మార్చి21( వెలుతురు):**
బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వారి స్వప్రయోజనాలే ముఖ్యమని.. ఎన్నడూ రాష్ట్ర ప్రజల ప్రయోజాల గురించి పట్టించుకున్న పాపానపోలేదని మాజీమంత్రి కేటీఆర్ విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ప్రజల గురించి ఆలోచిస్తే ఈపాటికే ఇంకా ఎంతో అభివృద్ధి సాధించేవారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఎప్పటికీ ఓట్లు, సీట్లే ముఖ్యమని ఆ రెండు పార్టీలకు తెలంగాణ ప్రయోజనాలు, అభివృద్ధి, ఆకాంక్షలు పట్టవని విమర్శించారు. ఆ పార్టీల ప్రజాప్రతినిధులు కొత్త పరిశ్రమలు కావాలని అడగరని, ఉన్న పరిశ్రమలను ఉంచాలని కోరరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూల్చే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా, తూకానికి అమ్మే పనిలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఉన్నాయని మండిపడ్డారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ పెట్టరని, ఆదిలాబాద్‌లో సీసీఐ ఫ్యాక్టరీ వేలానికి పెడ్తరని ధ్వజమెత్తారు. అందుకే మంటికైనా ఇంటోడే కావాలని ఊరికే అనలేదన్నారు. 'బయ్యారంలో ఉక్కు పరిశ్రమ పెట్టరు... ఆదిలాబాద్‌లో సీసీఐ ఫ్యాక్టరీ వేలానికి పెడ్తరు. బీజేపీ నుంచి ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక్కరూ నోరు తెరిచి దీని గురించి మాట్లాడరు. కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది ఎంపీలు, 64 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక్కరూ ఈ అన్యాయాన్ని ప్రశ్నించరని నిలదీశారు. ఈ కాంగ్రెస్, బీజేపీలకు ఎప్పటికీ ఓట్లు, సీట్లే ముఖ్యం. తెలంగాణ ప్రయోజనాలు, తెలంగాణ అభివృద్ధి, తెలంగాణ ఆకాంక్షలు ఈ పార్టీలకు పట్టవు.' అని కేటీఆర్ విమర్శించారు.

# కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో పల్టీ

- 17మందికి గాయాలు.. 5గురి పరిస్థితి విషమం



**మహబూబాబాద్, మార్చి21( వెలుతురు):**
కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో బోల్తాకొట్టడంతో 17మందికి గాయాలైన సంఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పెద్దనాగారం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం కూలీలతో వెళ్తున్న ఆటోను పెద్దనాగారం స్టేజి సమీపంలో ఓ లారీ ఢీకొట్టింది. దీంతో 17 మంది గాయపడ్డారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండగా, మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన 14 మంది, ఫతేపుర గ్రామానికి చెందిన ముగ్గురు మొత్తం 17 మంది మహిళా కూలీలు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలంలో మిర్చి ఏరడానికి ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో పెద్దనాగారం స్టేజీ సమీపంలోని ఇటుకల బట్టి వద్ద ఎదురుగా వస్తున్న లారీ.. ఆటోను ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన ఆటో రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. అందులో ఉన్నవారంతా చెల్లాచెదురుగా పడిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మూడు అంబులెన్సుల్లో మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. గాయపడినవారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు వెల్లడించారు. వారిలో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు.

# 133 బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌కు నోటీసులు

- బెట్టింగ్ ప్రమోషన్‌లో దూకుడుపెంచిన పోలీసులు
- 108 బెట్టింగ్ యాప్స్ బ్లాక్




**హైదరాబాద్, మార్చి21( వెలుతురు):**
తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలతో బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వ్యవహారంలో పోలీసులు దూకుడుగా ముందుకెళ్తున్నారు. బెట్టింగ్ యాప్స్ యజమానులే టార్గెట్‌గా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే బెట్టింగ్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న బాధితుల వివరాలు సేకరించారు. బెట్టింగ్ ఊబిలో చిక్కుకుని ఒక్క ఏడాదిలో 15 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. తెలంగాణ వ్యాప్తంగా 15 కేసులు నమోదు చేశారు. ఆయా బెట్టింగ్ యాప్స్ గుర్తించే పనిలో పడ్డారు పోలీసులు. బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు, ప్రమోటర్లను నిందితులుగా చేర్చనున్నారు. అయితే బెట్టింగ్ యాప్స్ కేసులపై పోలీస్‌శాఖ లీగల్ ఒపీనియన్‌కు వెళ్లబోతుంది. స్కిల్ బేస్డ్ గేమ్స్‌కి మాత్రమే ప్రకటనలు చేశామంటున్నారు విజయ్, రానా. అయితే సెలబ్రిటీల నుంచి కీలక అంశాలు రాబట్టిన పోలీసులు. బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులపైన ఫోకస్ పెట్టారు. ఇప్పటివరకు 108 అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్లు బ్లాక్ చేశారు. మరో 133 బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌కు నోటీసులు ఇచ్చారు. బెట్టింగ్ వెబ్‌సైట్లు తెలంగాణలో యాక్సెస్ కాకుండా. జియో-ఫెన్సింగ్ టెక్నాలజీతో చర్యలు తీసుకుంటోంది. కాగా బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో ఇప్పటికే విష్ణుప్రియ, రీతూచౌదరి, తేస్టీ తేజ, కిరణ్‌గౌడ్‌లను పోలీసులు విచారించారు. శ్యామల, అజయ్ సన్నీ, సుప్రీత, సన్నీ సుధీర్‌లను విచారణ కోసం సంప్రదించగా వారి ఫోన్లు స్విచాఫ్ వచ్చినట్లు సమాచారం. అలాగే మరికొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు కూడా ఇంకా అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది. విచారణ భయంతో హర్షసాయి, ఇమ్రాన్, భయ్యా సన్నీయాదవ్‌లు పరారీలో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌తో సినీనటులు, ఇన్‌ఫ్లూయెన్సర్లు భారీగా లబ్ధి పొందారని, అసలు వారికి ఏయే మార్గాల్లో డబ్బు వచ్చిందని పోలీసులు ఆరా తీస్తున్నారు.

# కాళేశ్వరాన్ని చతికిలపడుతోందా... పడేస్తున్నారా



**కరీంనగర్, మార్చి21( వెలుతురు):**
నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వారి పర్యవేక్షణలో రెండు అడుగులు కుంగిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టును మళ్లీ కట్టాలని అంటున్న ఈ తరుణంలో తెలంగాణలో వ్యవసాయ రంగానికి, తాగునీటికి ఇబ్బందికరంగా మారే పరిస్థితులు వచ్చే అవకాశముందని కాంగ్రెస్ ఎమ్మెల్యే రాంచందర్ నాయక్ శాసన సభలో ప్రకటన చేయడం చర్చకు దారితీసింది.అంటే కాళేశ్వరం గొప్పతనాన్ని కాంగ్రెస్ పార్టీ ఒప్పుకున్నట్లేననే ప్రచారానికి బీఆర్ఎస్ పార్టీ వర్గాలు తెరలేపారు. అయితే ఆ ప్రకటన ఏ సందర్భంలో చేశారు. ఎందుకు ఒక ఎమ్మెల్యే ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేయించిందనే విషయమై సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది.కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన ప్రధాన బ్యారేజీ మూడు గేట్లు కుంగిపోవడంతో ప్రమాదకరమని భావించి, గద్దెనెక్కిన కొన్ని రోజుల వ్యవధిలోనే బ్యారేజీలో ఉన్న నిలువనీటిని పూర్తిగా విడిచిపెట్టారు. ఇది తొందరపాటు చర్య అని బీఆర్ఎస్ తీవ్రంగా ప్రభుత్వంపై విరుచుకుపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో కుట్ర పూరితంగా వ్యవహరించిందని, మూడు గేట్లు కుంగిపోవడం వల్ల జరిగే నష్టం ఏమిలేదని, వాటిని మరమ్మతు చేస్తే సరిపోతుందని బీఆర్ఎస్ నాయకులు నెత్తినోరు మొత్తుకున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా పిలువబడే ఈ ప్రాజెక్టు ఇలాగే కొనసాగితే అపర భగీరథుడని కేసీఆర్ పేరు చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతుందని, లేనిపోని ఆరోపణలు చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు జరిగాయని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారమని ఆరోపించారు. అయితే ఒకవైపు ఈ విషయమై ట్రిబ్యునల్ ప్రాజెక్టు నిర్మాణంలో బాధ్యులైన వారందరినీ ప్రశ్నించే ప్రక్రియ నడుస్తుండగా, మరోవైపు ఈ ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేసి నీటి నిలువ చేయకుంటే సాగు, తాగు నీటి సమస్యలు తలత్తే అవకాశాలు ఉన్నాయని తన అభిప్రాయం వ్యక్తం చేసింది.ప్రాజెక్టు ఎత్తిపోతల మూలంగా గోదావరి ఎగువ ప్రాంతంలో నీటి సమస్య లేకుండా జలకళ ఉట్టిపడింది. అలాగే భూగర్భ జలాలు పెరిగి సాగుకు సమస్య లేకుండా చేశాయి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు చతికిల పడడంతో నీరు ఎతిపోసే అవకాశం లేకుండా పోవడంతో జలశయాల్లో నీటి మట్టం రోజురోజుకు తగ్గుముఖం పట్టడం వల్ల ఆందోళనకు కారణమవుతోంది. గత రబీ, ఖరీఫ్ సీజన్లలో నీటి సమస్య పెద్దగా కనిపించలేదు. ప్రస్తుత రబీకి పంట పొలాలకు నీరందించడమే కాకుండా తాగునీటికి కూడా సమస్యగా పరిణమించవచ్చని భావిస్తున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు పడుతున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా ప్రస్తుతం వేసవి కాలంలో సమస్యలు తలత్తే అవకాశాలున్నాయని, అందుకు ప్రభుత్వం తీసుకునే చర్యలకు సహకరించాలని ముందస్తు శాశనసభ వేదికగా ఒక ఎమ్మెల్యే ద్వారా దీనికి సంబంధించి ఒక ప్రకటన విడుదల చేయడం వెనుక ఆంతర్యం బోధపడుతోంది. ఈ ప్రకటన ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనాన్ని కాంగ్రెస్ పార్టీ ఒప్పుకుందనే ప్రచారానికి ఊతమిచ్చినట్లైంది. ఇప్పటి వరకు కాళేశ్వరం ప్రాజెక్టు లోపభూయిష్టమని, పనికిరాని ప్రాజెక్టు కట్టి ప్రజల నెత్తిన అప్పుల భారం మోపారని, ప్రాజెక్టు ఆగిపోయినా అనుకున్న స్థాయిలో సాగుతో పాటు ఎక్కువ దిగుబడి వచ్చిందని ప్రచారం చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు శాశనసభ సమావేశాల్లో ఒక ఎమ్మెల్యేతో ఇలాంటి ప్రకటన చేయించడానికి కారణాలేమై ఉంటాయని చర్చ మొదలయ్యింది. నిజంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం మూలంగా సాగుబడి ఎక్కువైందా, తాగునీటి సమస్య పూర్తిగా లేకుండా పోయిందా అనే విషయం మళ్లీ చర్చకు దారితీసిందిఅయితే ఈ ప్రాజెక్టు నిర్మాణం, ఎత్తిపోతల ద్వారా ప్రధాన జలాశయాలను నీటితో నింపడమనే ప్రక్రియతో ఎక్కడ చూసినా జలకళ కనిపించిన మాట వాస్తవమే. కాని శ్రీపాదసాగర్(ఎల్లంపల్లి), శ్రీరాంసాగర్ ప్రాజెక్టులకు దిగువ కాళేశ్వరం ప్రాజెక్టు కింద భాగం వరకు కొత్తగా ఒక్క ఎకరానికి ఈ ప్రాజెక్టు మూలంగా నీరు అందలేదని ఆయా ప్రాంతాల రైతులు చెబుతున్నారు. ఎకబిగిన వరుసగా నీటిని ఎత్తిపోసే ప్రక్రియలో తమ భూములకు నీరు అందించాలనే ఆలోచన పాలకులు చేయలేదని ఆరోపించారు. కేవలం కొన్ని ప్రాంతాలకు మాత్రమే కాలువల ద్వారా నీరందించారని, తమ ప్రాంతంలో కనీసం కాల్వల నిర్మాణం చేయలేదని అంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం అద్భుతమే కాని తమకు మాత్రం ఈ ప్రాజెక్టు వల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని వారు అభిప్రాయపడ్డారు.

# సీసీఐపై సన్నగిల్లుతున్న ఆశలు



**అదిలాబాద్, మార్చి21( వెలుతురు):**
ఆదిలాబాద్ జిల్లాలో పరిశ్రమల పునరుద్ధరణ, కొత్త పరిశ్రమల ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. జిల్లాలో ఇప్పటివరకు చెప్పుకోదగ్గ భారీ పరిశ్రమలేవీ లేకపోవడంతో అభివృద్ధిలో వెనుకబడింది. ఇటీవల వరంగల్ ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సైతం అనుమతి వస్తుందని ప్రజలంతా భావించారు. కానీ వరంగల్‌కు అనుమతి ఇచ్చిన కేంద్రం.. ఆదిలాబాద్ ఎయిర్ పోర్టును మాత్రం పక్కన పెట్టింది.మరో వైపు ముప్పై ఏండ్ల కింద మూతబడిన సీసీఐ (సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఫ్యాక్టరీని అయినా తిరిగి ప్రారంభిస్తారన్న ఆశతో ఉన్న ప్రజలకు మరోసారి నిరాశ తప్పలేదు. ఫ్యాక్టరీలోని సామగ్రిని తుక్కు కింద అమ్మేందుకు కేంద్రం టెండర్లు పిలవడంతో ప్రజలంతా హతాశులయ్యారు. ఫ్యాక్టరీని తిరిగి తెరిపించాలంటూ ఆందోళన బాట పడుతున్నారు.ఆదిలాబాద్ పట్టణ శివారులో ఏర్పాటైన సీసీఐ ఫ్యాక్టరీలో 1982 ఆగస్టు 15న సిమెంట్ ఉత్పత్తి ప్రారంభమైంది. సీసీఐకి సొంతంగా 870 ఎకరాలు ఉండగా మరో 2 వేల ఎకరాల భూమిని లీజుకు తీసుకుంది. ఫ్యాక్టరీలో సుమారు 4 వేల మంది ఉద్యోగులు, కార్మికులకు పనిచేసేవారు. 1984లో అప్పటి సీఎం ఎన్‌టీ.రామారావు, కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి తివారీ చేతుల మీదుగా జాతికి అంకితం చేశారు. అప్పటినుంచి 1991 వరకు సిమెంట్ ఉత్పత్తి చేస్తూ దేశంలోని నలుమూలలకు సరఫరా చేశారు.1991, 1992, 1993లో మూడేళ్ల పాటు వేల కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో ప్రభుత్వం లేవీ పద్ధతి (60 శాతం ప్రభుత్వ కొనుగోళ్లు)ని రద్దు చేయడంతో సీసీఐకి బడ్జెట్ కేటాయింపులు నిలిచిపోయాయి. దీంతో 1993 అక్టోబర్‌లో సీసీఐలో ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ఫ్యాక్టరీని తెరిపించాలని ముప్పై ఏండ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తూనే ఉన్నా ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదు.ముప్పై ఏండ్లుగా మూతబడిన ఫ్యాక్టరీ ఎన్నటికైనా తిరిగి ప్రారంభం అవుతుందని స్థానిక ప్రజలు ఎంతో ఆశతో ఉన్నారు. కానీ సీసీఐ ఫ్యాక్టరీలోని యంత్రాలకు సంబంధించిన సామగ్రిని తుక్కు కింద అమ్మేందుకు కేంద్రం మార్చి 7న టెండర్లు ఆహ్వానించింది. సిమెంటు ఉత్పత్తికి వినియోగించిన యంత్రాల సామగ్రి, ఇతర అవసరాలకు వినియోగించిన ఇనుము, పాత వాహనాలు.. ఇలా మొత్తం 71 యంత్రాలు, భవనాల ఇనుప తుక్కు సామగ్రిని అమ్మేందుకు నిర్ణయించిన కేంద్రం, మొత్తం రూ.43.30 కోట్లతో టెండర్లు ఆహ్వానించింది.దీనిపై పెద్దఎత్తున వ్యతిరేకత రావడం, జిల్లాలో ఆందోళనలతో పాటు కార్మిక సంఘాలు కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో యాజమాన్యం టెండర్ ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేసింది. కానీ ఎప్పటికైనా సీసీఐని అమ్మాలన్న ఉద్దేశంతోనే కేంద్రం ఉందంటూ జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే సీసీఐని కాపాడుకునేందుకు పార్టీలు, సంఘాలకు అతీతంగా ఉద్యమ బాట పడుతున్నారు.సీసీఐ ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభించాలంటూ మూడేండ్ల కిందే సీసీఐ సాధన కమిటీని ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నారు. ఇందులో భాగంగా పట్టణ బంద్‌తో పాటు దీక్షలు, రాస్తారోకోల వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. సీసీఐ ఫ్యాక్టరీ సామాగ్రిని తుక్కు కింద అమ్మేందుకు 2022లోనూ యాజమాన్యం టెండర్లు పిలిచింది. అప్పుడు ఆందోళనలు జరగడంతో ఆ ప్రక్రియ కాస్తా నిలిచిపోయింది. తాజాగా మరోసారి తుక్కు కింద అమ్మాలని నిర్ణయిండంతో సీసీఐ సాధన కమిటీ ఉద్యమబాట పట్టింది.ఇందులో భాగంగా రెండు రోజులుగా ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేస్తున్నారు. సీసీఐ పునరుద్ధరణపై ఎన్నికల సమయంలో బీజేపీ లీడర్లు హామీలు ఇస్తున్నారే తప్ప.. ఆచరణలో పెట్టడం లేదని, ఫ్యాక్టరీ పునరుద్ధరణలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు విఫలం అయ్యారంటూ ఆరోపిస్తున్నారు. ఈ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే సీసీఐ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

# 1000 కోట్లతో వరంగల్ కార్పొరేషన్ బడ్జెట్




**వరంగల్,మార్చి21( వెలుతురు):**
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) 2025-26 ఆర్థిక సంవత్సరానికి భారీ బడ్జెట్ ను ప్రతిపాదించింది. గతేడాది రూ.650.12 కోట్లతో గ్రేటర్ బడ్జెట్ పెట్టగా.. ఈసారి అంచనాలు భారీగా పెంచేసి రూ.1071.41 కోట్లతో ముసాయిదా బడ్జెట్ ప్రవేశ పెట్టారుఇందులో రూ.337 కోట్ల 38 లక్షలు సాధారణ పన్నుల ద్వారా, రూ.728 కోట్ల 10 లక్షలు వివిధ గ్రాంట్ల ద్వారా, రూ 600 కోట్లు డిపాజిట్లు, అడ్వాన్సుల ద్వారా సమకూరుతాయని అంచనా వేశారు. ఈ బడ్జెట్ సమావేశంలో రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పరకాల, వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.బల్దియా సొంత ఆదాయం ద్వారా వచ్చే 337 కోట్ల 38 లక్షల రూపాయలలో 100 కోట్ల రూపాయలు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది జీతభత్యాలు, 29 కోట్ల 92 లక్షల రూపాయలు పారిశుద్ధ్య నిర్వహణకు వినియోగించనున్నారు. మరో 34 కోట్ల 30 లక్షల రూపాయలు విద్యుత్తు చెల్లింపులు, 33 కోట్ల 74 లక్షల రూపాయలు గ్రీన్ బడ్జెట్, 41 కోట్ల 5 లక్షల రూపాయలు ఇంజనీరింగ్ విభాగానికి కేటాయించారు. 21 కోట్ల 15 లక్షల రూపాయలు సాధారణ నిర్వహణకు, కోటి 40 లక్షల రూపాయలు టౌన్ ప్లానింగ్ కోసం, కోటి 50 లక్షల రూపాయలు డిజాస్టర్ రెస్పాన్స్ కొరకు కేటాయించారు.విలీన గ్రామాలు, బలహీనవర్గాలు నివసించే ప్రాంతాల్లోని స్లమ్ ఏరియాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.24 కోట్ల 77 లక్షలు, అలాగే ప్రజా సౌకర్యాల కల్పన, పార్కుల అభివృద్ధి, జంతువధ శాలలు, వీధి వ్యాపారులు, వెండింగ్ జోన్లు, ఓపెన్ జిమ్ ల ఏర్పాటుకు రూ. 10 కోట్ల 40 లక్షలు, వార్డుల వారీగా అత్యవసర అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.39 కోట్ల 15 లక్షలు కేటాయించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న రూ.187 కోట్ల స్టాంప్ డ్యూటీ ఫండ్స్ ను ముఖ్యమంత్రి మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా ఆ బడ్జెట్ పారిశుద్ధ్య కార్మికులు, ఎలక్ట్రికల్ వర్కర్ల జీతభత్యాలు పెంచడానికి స్లమ్ ఏరియాల అభివృద్ధికి 1/3 బడ్జెట్ కేటాయించేందుకు తోడ్పడిందన్నారు.గ్రేటర్ వరంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారని, రాష్ట్ర రెండో రాజధానిగా డెవలప్ చేస్తున్నారని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ అభివృద్ధిలో మనమంతా భాగస్వాములు కావాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగరాన్ని అన్నివిధాలా సుందరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో టెల్ పార్క్ , విమానాశ్రయం, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, స్ట్రోమ్ వాటర్ డ్రైన్, ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాజకీయాలకతీతంగా వరంగల్ నగరాభివృద్ధికి అందరు సమష్టిగా కృషి చేయాలని కోరారు.గ్రేటర్ వరంగల్ పాలకవర్గం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యం గా ఉందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన 13 విలీన గ్రామాలున్నాయని, వాటిని అభివృద్ధి పరిచేలా నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారుపరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ కు ధీటుగా వరంగల్ ను అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారన్నారు. అభివృద్ధిలో కార్పొరేషన్కు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. బల్దియాలో అభివృద్ధి జరగాలంటే వివిధ పన్నుల ద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని సూచించారు.

cinema

# మత్తెక్కిస్తున్న వామికా గబ్బి

సోషల్ మీడియాలో ఎవరు ఎప్పుడు ట్రెండ్ అవుతారో చెప్పలేం. అలా ఈ హాట్ బ్యూటీ ఇప్పుడు యమా ట్రెండింగ్ అవుతోంది. ఈ బ్యూటీ ఓరకంటతో చూస్తున్న ఫోటోలు నెట్టింట తెగ ట్రెండ్ అవుతోంది. ఇంతకీ ఆమె ఎవరా అని అనుకుంటున్నారా.! కేవలం ఒకే ఒక్క తెలుగు సినిమా చేసిన ఈమె మరెవరో కాదు.. వామికా గబ్బి. సుధీర్ బాబు హీరోగా తెరకెక్కిన 'భలే మంచి రోజు' సినిమాతో టాలీవుడ్‌కి పరిచయమైంది. ఈ మూవీ కమర్షియల్‌గా ఫెయిల్ కావడంతో వామికా మళ్లీ తెలుగులో మరే చిత్రంలో నటించలేదు పంజాబీ, హిందీ, మలయాళం, తెలుగు సినిమాల్లో నటించింది వామికా గబ్బి. 2007లో 'జబ్ వి మెట్' సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి వచ్చినా.. ఇప్పటివరకు ఈ బ్యూటీకి సరైన బ్రేక్ దక్కలేదు. 2023లో 'ఖుఫియా' అనే హిందీ సినిమాతో వామికా బాగా ఫేమస్ అయింది. ఈ చిత్రంలో ఆమె నటించిన బోల్డ్ సీన్స్ సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అయ్యాయి. దాంతో ఈ బ్యూటీకి క్రేజ్ కూడా డబుల్ అయ్యింది. తాజాగా వరుణ్ ధావన్ హీరోగా వచ్చిన 'బేబీ జాన్' మూవీతో ప్రేక్షకులను పలకరించింది. ఇందులో వామికా.. టీచర్ పాత్రలో నటించి తన నటనకు గానూ మంచి మార్కులు తెచ్చుకుంది. ఇక అడివి శేష్ హీరోగా వస్తోన్న 'గూఢచారి -2' సినిమాతో మరోసారి తెలుగులో రీ-ఎంట్రీ ఇవ్వనుంది.





# సోషల్‌మీడియాలో ఫొటోలతో మేఘాఆకాశ్ హల్‌చల్

టాలీవుడ్ హీరోయిన్ మేఘా ఆకాష్‌కు యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఉందన్న సంగతి తెలిసిందే. కొన్నాళ్లుగా సినిమాల్లో సైలెంట్ అయిన ఈ బ్యూటీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఏ అమ్మడి అందానికి కుర్రాళ్ళు ఫిదా అవుతున్నారు. నితిన్ నటించిన లై సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది ఈ బ్యూటీ. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ కాగా.. అందం, అభినయంతో మంచి మార్కులు కొట్టేసింది మేఘా. మొదటి సినిమాతోనే తెలుగు అడియన్స్ కు దగ్గరైంది. కానీ ఆ తర్వాత కథానాయికగా అనుకున్నంతగా అవకాశాలు మాత్రం రాలేదు. ఈ మూవీ తర్వాత మరోసారి నితిన్ సరసన ఛల్ మోహన్ రంగ చిత్రంలో నటించినప్పటికీ ఈ మూవీ కూడా నిరాశపరిచింది. కానీ నటన పరంగా మేఘా ఆకట్టుకుంది. దీంతో ఈ అమ్మడుకు తెలుగులో ఆఫర్స్ రాకపోవడంతో కోలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. తమిళంలో వరుస సినిమాలు చేస్తూ అక్కడే టాప్ హీరోయిన్‌గా మారింది. అప్పుడప్పుడు తెలుగులో ఒకట్రెండు చిత్రాల్లో మెరిసింది. కొన్నాళ్లు గ్యాప్ తీసుకున్న మేఘా ఆకాష్ రాజా రాజ చోర.. డియర్ మేఘా, గుర్తుందా శీతాకాలం, ప్రేమదేశం, రావణాసుర, మనుచరిత్ర వంటి చిత్రాల్లో నటించింది. ఈ సినిమాలకు పాజిటివ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ మేఘాకు సరైన బ్రేక్ మాత్రం రాలేదు. సోషల్ మీడియాలో నిత్యం ఏదోక ఫోటో షేర్ చేస్తూ ఫాలోవర్లకు టచ్‌లో ఉంటుంది.

# అప్పటికీ.. ఇప్పటికీ శ్రీయది ఒకటే అందం

టాలీవుడ్ సీనియర్ నటి శ్రీయా శరన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఒకప్పుడు వరస సినిమాలతో మంచి ఫేమ్ సంపాదించుకుంది ఈ చిన్నది. తెలుగు చిత్ర పరిశ్రమలో అందరి స్టార్ హీరోల సరసన నటించడమే కాకుండా లేడీ ఓరియెంటెడ్ ఫిల్మ్స్‌తో కూడా తన సత్తా చాటింది. ఇక చాలా కాలంగా ఈ బ్యూటీ అంతగా సినిమాలు చేయడం లేదు. ముఖ్యంగా కరోనా తర్వాత సినిమాలకు గుడ్ బై చెప్పి తన కూతురును చూసుకుంటూ ఉంది. ఈ మధ్య ఈ అమ్మడు పలు సినిమాల్లో స్పెషల్ పాత్రల్లో కనిపిస్తూ సందడి చేస్తుంది. ఇక సినిమాల్లో కంటే ఈ బ్యూటీ ఈ మధ్య సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటుంది. వరస ఫొటో షూట్స్‌తో కుర్రకారు మతిపోగొడుతుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ పింక్ కలర్ డ్రెస్‌లో సరికొత్త లుక్‌లో దర్శనం ఇచ్చింది. కుర్ర హీరోయిన్స్‌కు ఏ మాత్రం తీసిపోకుండా తన అందంతో మాయ చేస్తుంది ఈ చిన్నది.



# ఆ స్టార్ హీరో నాకన్నా చిన్నపిల్లాడిలా కనిపిస్తాడు

## – జాన్వీకపూర్

బాలీవుడ్ ముద్దగుమ్మ జాన్వీ కపూర్ హీరోయిన్ గా హిందీలో రాణిస్తుంది. కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ మూవీస్ లోనూ నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోతుంది ఈ చిన్నది. ఇక సోషల్ మీడియాలో జాన్వీ అందాలకు యమా క్రేజ్ ఉంది. అందాలు ఆరబోస్తూ కుర్రాళ్లను కవ్విస్తుంది ఈ చిన్నది. ఇక ఈ బ్యూటీ దేవర సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో తన నటనతో పాటు అందంతోనూ మెప్పించి మంచి మార్కులు కొట్టేసింది జాన్వీ. ఇక ఇప్పుడు ఈ అమ్మడు దేవర 2లో నటిస్తుంది. అలాగే రామ్ చరణ్ తోనూ నటిస్తుంది. ఇదిలా ఉంటే జాన్వీ కపూర్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. జాన్వీ కపూర్ గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ టాలీవుడ్ స్టార్ హీరో గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఆయన వయసు రోజు రోజుకు తగ్గుతుంది అని చెప్పుకొచ్చింది. ఇంతకూ ఆ స్టార్ హీరో ఎవరో తెలుసా.? మీరు గెస్ చేసే ఉంటారు ఆయన ఎవరో కాదు సూపర్ స్టార్ మహేష్ బాబు. గతంలో ఓ ఇంటర్వ్యూలో మహేష్ గురుంచి జాన్వీ మాట్లాడింది. మహేష్ బాబు గురించి మాట్లాడుతూ.. ఆయనకు వయసు అవ్వదు. ఆయనకు రోజు రోజుకు వయసు తగ్గిపోతుంది. ఎంతో హ్యాండ్సమ్ గా ఉంటారు. కొన్నిసార్లు నా కన్నా చిన్నవాడిగా కనిపిస్తారు అని తెలిపింది జాన్వీ. ఈ కామెంట్స్ ను మహేష్ అభిమానులు సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. మహేష్ ప్రస్తుతం రాజమౌళి సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఈ సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తుంది. ఇటీవలే ఒడిశాలో షూటింగ్ పూర్తి చేశారు టీమ్. అలాగే జాన్వీ ప్రస్తుతం రామ్ చరణ్ బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది.



# టర్కిష్ ఐస్‌క్రీమ్ వెండర్‌కు చుక్కలు చూపించిన కీర్తిసురేష్



టర్కిష్ ఐస్‌క్రీమ్ వెండర్లు గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఇండియాలో ప్రతి షాపింగ్ మాల్‌లో లేదా మెట్రో సీటీలలోని విధులలో కనిపిస్తుంటారు. కేవలం ఐస్‌క్రీమ్ అమ్మడం మాత్రమే కాదు, కస్టమర్లతో ఐస్‌క్రీమ్ ఇవ్వకుండా ఒక ఆట ఆడుకుంటారు. ఐస్‌క్రీమ్ కోన్‌ను కస్టమర్‌కు ఇచ్చేలా చేసి, చివరి క్షణంలో దాన్ని తిరిగి లాగేసుకుంటారు. ఐస్‌క్రీమ్‌ను పైకి ఎత్తడం, తిప్పడం, లేదా కోన్‌ను ఖాళీగా ఇచ్చి ఆశ్చర్యపరచడం వంటివి చాలా వరకు వీడియోలలో చూసే ఉంటాము. అయితే టర్కిష్ ఐస్‌క్రీమ్ తిందాం అని షాప్‌కి వెళ్లిన స్టార్ నటి కీర్తి సురేష్‌ని చాలాసేపు ఆటపట్టించాడు ఒక ఐస్‌క్రీమ్ వెండర్. ఐస్‌క్రీమ్ ఇచ్చినట్లే ఇచ్చి తీసుకోవడం. మళ్లీ కోన్ కీర్తి సురేశ్ చేతిలో పెట్టడం చేశాడు. చివరగా కీర్తి చేతిలో ఐస్‌క్రీమ్ పెట్టాడు. అయితే ఐస్‌క్రీమ్ ఇచ్చిన అనంతరం అసలు ఆటను చూపించింది కీర్తి సురేష్. తన వద్ద ఉన్న డబ్బులను తీసుకోమంటూ వాళ్లు వాడిన ట్రిక్ వారిమీదే ప్రయోగించింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

# సమంతకు ఓటీటీ అవార్డు

టాలీవుడ్ స్టార్ నటి సమంతకు ఓటీటీ ఉత్తమ నటి అవార్డు దక్కింది. సామ్ నటించిన వెబ్ సిరీస్ 'సిటాడెల్ : హనీ బన్నీ' లో ఉత్తమ నటన కనబరిచినందుకు ఓ మీడియా సంస్థ సమంతను ఈ పురస్కారంతో సత్కరించింది. దీన్ని గెలుచుకోవడంపై సామ్ సంతోషం వ్యక్తం చేసింది. ప్రతికూల పరిస్థితుల మధ్య ఈ సిరీస్‌ను పూర్తి చేయడమే తనకు ఒక అవార్డు అని పేర్కొంది. రాజ్ అండ్ డీకే, వరుణ్ ధావన్ వల్లే తాను ఈ సిరీస్‌ను విజయవంతంగా పూర్తి చేయగలిగినట్లు చెప్పుకొచ్చింది. ఈ సిరీస్‌ను కంప్లీట్ చేయడం కోసం వారు ఎంతో ఓపికతో వ్యవహరించారని, తనను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారని తెలిపింది. తనను నమ్మిన వారందరికీ ఈ అవార్డును అంకితం చేస్తున్నట్లు సామ్ చెప్పుకొచ్చింది.



# గృహహింసపై ఆల్బమ్ రిలీజ్ చేసిన ధనశ్రీవర్మ



టీమ్‌ఇండియా క్రికెటర్ యజువేంద్ర చాహల్‌తో ధనశ్రీ వర్మ విడిపోయిన విషయం తెలిసిందే. వీరికి ముంబైలోని ఫ్యామిలీ కోర్టు గురువారం విడాకులు మంజూరు చేసింది. ధనశ్రీకి భరణం కింద రూ. 4.75 కోట్లు ఇచ్చేందుకు చాహల్ ఇప్పటికే అంగీకరించారు. ఈ మొత్తంలో ఇందులో రూ. 2.37 కోట్లు చెల్లించాడు కూడా. కాగా, దంత వైద్యురాలైన ధనశ్రీ వర్మను 2020 డిసెంబర్ 22న చాహల్ పెండ్లి చేసుకున్నారు. కొరియోగ్రాఫర్‌గా, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది ధనశ్రీ. ఇదిలావుంటే చాహల్‌తో విడిపోయిన కొద్ది గంటల్లోనే కొత్త ఆల్బమ్‌ను విడుదల చేసింది ధనశ్రీ వర్మ. తన తాజా మ్యూజిక్ వీడియో దేఖా జీ దేఖా మైనే ఆల్బమ్‌ను టీ-సిరీస్ యూట్యూబ్ ఛానల్ మార్చి 20న విడుదల చేసింది. ఈ పాట చూస్తే.. రాజ కుటుంబంలోకి కోడలిగా వెళ్లిన ధనశ్రీ అక్కడ తన భర్తతో గృహ హింసతో పాటు శారీరక, మానసిక హింసను ఎదుర్కొంటున్నట్లు చూపించారు మేకర్స్. భర్తతో విసిగిపోయిన ఆ యువతి చివరికి అతడిని వదిలిపెట్టి స్వేచ్ఛగా బయటకి వెళుతున్నట్లు ఆల్బమ్‌లో ఉంది. అయితే ఈ వీడియో ధనశ్రీ వర్మ నిజ జీవితానికి దగ్గరగా ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మరోవైపు ఈ పాటను విమర్శిస్తూ.. విడాకుల రోజున ఇలాంటి పాటను విడుదల చేయడం ఉద్దేశపూర్వకంగా ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు.

### ఒక ప్రశ్నా పత్రానికి బదులు..

# మరో ప్రశ్నా పత్రం

- పదో తరగతి విద్యార్థులు షాక్.. రెండుగంటల సమయం వృథా
- విచారణకు ఆదేశించిన కలెక్టర్

**హైదరాబాద్, మార్చి21( వెలుతురు):**
అధికారుల నిర్లక్ష్యంతో మెయిన్ పరీక్షల్లో కొన్నిసార్లు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈక్రమంలో పదోతరగతి పరీక్షలు ప్రారంభమైన తొలిరోజే అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. ఎగ్జామ్‌సెంటర్ పరీక్ష రాయటానికి కూర్చున్న విద్యార్థులకు ఒక ప్రశ్నా పత్రానికి బదులు మరో ప్రశ్నాపత్రాన్ని ఇవ్వడంతో విద్యార్థులు షాక్‌కు గురయ్యారు. మంచిర్యాల జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో దాదాపు రెండు గంటలు ఆలస్యంగా పదో తరగతి పరీక్షలు మొదలయ్యాయి. ఉదయం విద్యార్థులంతా పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష హాల్లో తమకు కేటాయించిన సీట్లలో కూర్చుకున్నారు. పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యాయి. అక్కడి ఇన్విజిలేటర్లు ప్రశ్నాపత్రాన్ని విద్యార్థులకు ఇచ్చారు. అయితే ఆ ప్రశ్నాపత్రాన్ని చూసి విద్యార్థులంతా అవాక్కయ్యారు. ఏంటిది అంటూ ఒకింత భయాందోళనకు గురయ్యారు. ఒక ప్రశ్నాపత్రానికి బదులుగా మరో పేపర్‌ను అధికారులు పంపిణీ చేశారు. విద్యార్థులు దాన్ని గుర్తించి చెప్పడంతో అధికారులు హైరానా పడ్డారు. హడావుడిగా మరో పేపర్ తెప్పించడంతో దాదాపు రెండు గంటలు ఆలస్యంగా విద్యార్థులు పరీక్ష రాశారు. అయితే ప్రశ్నాపత్రం తారుమారైన విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో ప్రశ్నాపత్రాల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం, పరీక్ష ఆలస్యంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఒక ప్రశ్నాపత్రం బదులు మరో పేపర్ రావడంతో వెంటనే విచారణ జరిపి నివేదిక అందించాల్సిందిగా డీఈవోకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాల విషయంలో అధికారుల నిర్లక్ష్యం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యం




**హైదరాబాద్, మార్చి21( వెలుతురు):**
అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మచ్చబోల్లారంకు చెందిన ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యం అయ్యారు. తమ కుమార్తెలు రెండు రోజుల నుంచి కనబడడం లేదని బాలికల తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. బాలికల పేరెంట్స్ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇన్ స్టాగ్రామ్‌లో పరిచయమైన ఇద్దరు యువకులు బాలికలిద్దరితో కలసి ఓయో రూమ్‌లో గడిపినట్లు పోలీసులు గుర్తించారు. ఒకరు ఈసీఐఎల్, మరొకరు దమ్మాయి గూడకు చెందిన వారిగా సమాచారం. కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు ఈ నెల 11న హైదరాబాద్‌కు చెందిన 17 ఏళ్ల బాలిక తనకు పరిచయమున్న 45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తితో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కొద్ది రోజులకు పోలీసులు వెతికి పట్టుకున్నారు. భరోసా సెంటర్?కు తరలించి విచారించడంతో బాలిక ప్రెగ్నెంట్ అని తేలింది. నిందితుడిపై పోక్సో (ప్రోటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్) కేసు నమోదు చేసి రిమాండ్?కు తరలించారు. అనంతరం బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ తరహా కేసులు గణనీయంగా పెరుగుతుండడం ప్రస్తుతం ఆందోళన కలిగిస్తోంది. తెలిసీ తెలియని వయసులో ప్రేమ పేరుతో ఆడపిల్లలు తల్లిదండ్రులకు దూరమవుతున్నారు. వీరిలో చాలా మందిని పోలీసులే గుర్తిస్తున్నారు. మరికొందరు వారంతటవారే ఇంటికి వచ్చేస్తున్నారు. మరికొంతమంది అయితే తిరిగి రావడానికి భయపడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు ప్రతి రోజూ వార్తల్లో చూస్తున్నాం. యువతులు తమకు సన్నిహితంగా మెలిగే వారితో ఆకర్షణకు లోనవడం.. ప్రేమ పేరుతో ఇంటి నుంచి వెళ్లిపోతున్నారు.

# ఆశలను చిదిమేసిన మృత్యువు

- తొలిరోజే ఉద్యోగానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- మృతి చెందిన యువకుడు



**హైదరాబాద్, మార్చి21 ( వెలుతురు):**
విధి ఆడే ఆటలో ఓటమి ఎప్పుడూ మనిషిదేనేమో. ఈ ఘటన గురించి చదివితే మీ గుండె తరుక్కుపోవడం ఖాయం. జాబ్ వచ్చింది.. ఇక తల్లీతండ్రులను మంచిగా చూసుకోవచ్చు అనుకున్న ఆ కుర్రాడు.. ఆఫీసుకు వెళ్లిన తొలి రోజే కనుమరుగు అయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నార్సింగ్‌లో తొలిరోజు ఉద్యోగం చేసి ఇంటికి వస్తుండగా యువ ఇంజనీర్ నవీన్ చారి మృతి చెందిన ఘటన అందర్నీ కలచివేస్తుంది. నార్సింగి కోకాపేట్ టీ గ్రీల్ వద్ద తన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వెహికల్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన అతడిని స్థానికులు నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో నవీన్ చారి చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ పుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. నవీన్ చారీ మెదక్ జిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన అతడు జాబ్ ప్రయత్నంలో ఉన్నాడు. దీనిలో భాగంగానే హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీలో ఇటీవల జాబ్ కొట్టాడు. దీంతో ఎంతో హ్యాపీగా తొలిరోజు ఆఫీసుకి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా అనుకోని ప్రమాదంతో నవీన్ చారి మరణించాడు. దీంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. నవీన్ చారి మృతితో అతని స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# అప్పులు ఘనం.. అభివృద్ధి శూన్యం

## మండలి వద్ద ప్లకార్డులతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నిరసన




**హైదరాబాద్, మార్చి21( వెలుతురు):**
15 నెలల్లోనే లక్షా 50వేల కోట్లు అప్పు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు, రాష్ట్రానికి ఏం మేలు చేసిందో చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. అప్పులపై నాటి బీఆర్ఎస్ పార్టీని విమర్శించి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ చేస్తున్నదేమిటో అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు శాసనమండలి ఆవరణలో వినూత్న నిరసన తెలిపారు. అప్పులు ఘనం.. అభివృద్ధి శూన్యం అంటూ ప్లకార్డులతో నిరసన వ్యక్తంచేశారు. అప్పులు ఆకాశంలో, అభివృద్ధి పాతాళంలో అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. రూ. లక్ష 58 వేల కోట్ల అప్పు చేసి ఎంతమంది మహిళలకు రూ.2500 ఇచ్చారని ప్రశ్నించారు. రూ.లక్ష 58 వేల కోట్ల అప్పు చేసి ఎంతమంది వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ ఇచ్చారన్నారు. ఎంత మంది ఆడపిల్లలకు స్కూటీలు ఇచ్చారని, తులం బంగారం ఎంతమందికి ఇచ్చారని నినదించారు. 15 నెలల్లో రూ.1.58 లక్షల కోట్లు అప్పుచేసినా అభిమాత్రం సున్నా అని విమర్శించారు. అనంతరం మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. శాసనమండలిలో ప్రశ్నోత్తరాలు రద్దు చేయడం ఖండిస్తున్నామన్నారు. సభలో ప్రజల సమస్యలు చర్చించడం లేదని, కేవలం బిల్లులు ప్రవేశపెట్టడం పాస్ చేయించుకోవడమే జరుగుతున్నదని మండిపడ్డారు. ప్రశ్నోత్తరాల వల్ల ప్రజల సమస్యలు సభ దృష్టికి వచ్చేవన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. తూతూ మంత్రంగా సభను నడిపిస్తున్నరని, పనిగంటలు తగ్గించారన్నారు. సభలో చర్చించే అవకాశం లేకున్నా ప్రజా క్షేత్రంలో పోరాడుతామని స్పష్టం చేశారు. 15 నెలలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్ష 58 వేల కోట్ల అప్పు చేశామని చెబుతున్నారని, 9 ఏండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు కేవలం 4 లక్షల 17 వేల కోట్లు అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. రేవంత్ రెడ్డి 15 నెలల్లోనే లక్ష 58 వేల కోట్ల అప్పు చేశారని, పదే పదే ప్రజల్లో కేసీఆర్‌ను బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇది సభను, ప్రజలను తప్పు పట్టించడమేనని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రతి అప్పుకు కరెక్ట్ లెక్కలు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు, ఖర్చులపై శ్వేతపత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై ఈ రోజు ప్రభుత్వం చేసిన అప్పులను ఎండగడుతామన్నారు.

# బడ్జెట్‌పై చర్చలో పరస్పర విమర్శలు

- హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు

**హైదరాబాద్, మార్చి21( వెలుతురు):**
బడ్జెట్‌పై చర్చ సందర్భంగా విమర్శలు, ప్రతి విమర్శలు, సవాళ్లతో అసెంబ్లీ దద్దరిల్లింది. బడ్జెట్ చర్చలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన విమర్శలపై అధికార పార్టీ సభ్యులు ఘాటుగా సమర్పించారు. సిఎం భాషపై హరీష్ రావు ప్రతి విమర్శలు చేశారు. దీంతో సభలో లేని నాయకుడిపై విమర్శలు చేయడం సరికాదని స్పీకర్ ప్రసాదరావు సూచించారు. ఒకానొక సందర్భంలో చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం దారుణమని మంత్రి శ్రీధర్ బాబు ఎదురుదాడి చేశారు. బిఆర్ఎస్ హయాంలో తమకు కనీసం ఐదు నిముషాలు కూడా మాట్లాడనిచ్చేవారు కాదని, ఇప్పటికే హరీష్ రావు రెండుగంటలకు పైగా మాట్లాడారని అన్నారు. సభా నాయకుడిని పట్టుకొని అజ్ఞానం అని మాట్లాడడం సరికాదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హితువు పలికారు. కాంగ్రెస్ వారికి బుద్ధిమాంద్యం ఉందని మాట్లాడడం సరికాదని, విజ్ఞులైతే స్పీకర్ చెప్పింది విని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై శాసన సభలో సాధారణ చర్చ సందర్భంగా హరీష్ రావుకు భట్టి కౌంటర్ ఇచ్చారు. 'సభాపతితో కూడా వాగ్వాదం చేయడం సరికాదు, మాకు బుద్ధి ఉందో మీకు ఉందో లెక్కలు వేసుకుని చెబుతాం, సభా నాయకుడు, ప్రభుత్వ పెద్దల గురించి సరైన భాష వాడాలని సూచించారు. బడ్జెట్ పరిధి దాటి అడ్డగోలుగా మాట్లాడడం సబబుకాదని భట్టి హెచ్చరించారు. ఇకపోతే అదేపనిగా కెసిఆర్‌ను విమర్శించడం మాని పాలనపై దృష్టి పెట్టాలని హరీష్ రావు అన్నారు. భారాస హయాంలో చేసిన మొత్తం అప్పు రూ.4.22 లక్షల కోట్లు అని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రం దివాళా తీసిందని పదే పదే చెప్పవద్దని.. భారాసపై కోపంతో అప్పుల లెక్క ఎక్కువ చేసి చూపొద్దని కోరారు. ఇది అవాస్తవిక బడ్జెట్.. గాలి మేడల బడ్జెట్ అని తీవ్రంగా విమర్శించారు. కృష్ణా నదీ జలాలపై ఈ బడ్జెట్‌లోనే చర్చ పెట్టాలి. మీ నిర్వాకం వల్ల ఈ ఏడాది 34 శాతం వాడాల్సిన నీళ్లలో.. 24 శాతమే వాడారు. ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పంటలు ఎండుతున్నాయి. నీటిని రాబట్టడంలో ప్రభుత్వం ఎలా విఫలమైందో చర్చించాలి. తెలంగాణకు వరంగా ఉన్న సెక్షన్3ని భారాస సాధించింది. ట్రిబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించాలి.





తెలంగాణకు న్యాయబద్ధమైన 575 టీ-ఎంసీలను రాబట్టాలని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ అప్పు రూ.8.6 లక్షల కోట్లు-గా ఉందని భాజపా శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రోజుకు రూ.1700 కోట్లకుపైగా కాంగ్రెస్ సర్కారు అప్పు చేస్తోందని విమర్శించారు. బడ్జెట్‌పై శాసనసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిమిషానికి రూ.కోటికిపైగా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేస్తోంది. రాష్ట్రంలో ఒక్కో వ్యక్తిపై రుణభారం రూ.2.27 లక్షలుగా ఉంది. పెద్ద ఎత్తున రుణాలుంటే తెలంగాణ ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పాలి. యూపీఏ కంటే ఎన్డీఏ హయాంలో ఆర్థిక సంఘం నిధులు పెరిగాయి. యూపీఏ హయాంలో రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో 32 శాతం వాటా ఉండేది. అప్పుడు కేంద్ర పన్నుల్లో వాటా 2-3 శాతం కూడా పెంచలేదు. మోదీ ప్రభుత్వం వచ్చాక కేంద్ర పన్నుల్లో వాటా 10 శాతం పెంచి 42 శాతం చేశారు. పన్నుల్లో వాటా పెంచాక కూడా కేంద్రాన్ని విమర్శించడం సరికాదని ఆయన అన్నారు.

# ఎంత వ్యత్యాసమో... రంగారెడ్డికి... మలుగుకు...

**హైదరాబాద్, మార్చి21( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్రంలో 2023-24 సంవత్సరపు 33 జిల్లాల జీడీడీపీ లెక్కలను ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టింది. తెలంగాణ సోషియో ఎకనామిక్ అవుట్ లుక్ -2025 బుక్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. 33 జిల్లాల్లో జీడీడీపీలో రంగారెడ్డి జిల్లా తొలిస్థానంలో ఉండగా, ములుగు జిల్లా చివరలో ఉంది.జీ.ఎస్.డీ.పీ అనేది రాష్ట్ర ప్రగతికి సూచికగా ఆర్థిక నిపుణులు చెబుతారు. జీ.ఎస్.డీ.పీ అంటే గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రోడక్ట్ అంటారు. అదే దేశం విషయానికి వస్తే జీడీపీగా అంటే గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్‌గా లెక్క గడతారు. ఇక జిల్లా పరిధిలో చూస్తే దాన్ని జీడీడీపీ అంటే గ్రాస్ డిస్ట్రిక్ డొమెస్టిక్ ప్రొడక్ట్‌గా లెక్క గడతారు. ఒక ఏడాదిలో ఆ దేశంలో ఉత్పత్తి అయిన వ్యవసాయ, పారిశ్రామిక, సేవల రంగాల ఉత్పత్తుల విలువను స్థూల జాతీయోత్పత్తి విలువ ( జీడీపీ) అదే రాష్ట్రంలో అయితే జీఎస్డీపీగా, జిల్లా పరిధిలో జీడీపీపీ లెక్క గడతారు. ఇలా చూస్తే 3,12,998 రూపాయలతో రంగారెడ్డి జిల్లా తొలి స్థానంలో ఉండగా రూ. 2,57,949 తో హైదరాబాద్ జిల్లా రెండోస్థానంలో నిలిచింది. మేడ్చేల్ -మల్కాజ్ గిరి జిల్లా రూ.1,04,710తో మూడో స్థానంలో నిలిచాయి. ములుగు జిల్లా రూ.8,873తో చిట్ట చివరి స్థానంలో ఉంది. రాష్ట్రతలసరి ఆదాయం రూ.4 లక్షల దిశగా దూసుకెళ్తున్నది. 2024-25 సంవత్సరంలో 3.80 లక్షలకు చేరింది. నిరుడు పర్ క్యాపిటా ఇన్కం రూ.3,46,457 తో పోల్చినప్పుడు ఈసారి రూ.32,452 పెరిగి, 9.6% వృద్ధి రేటు నమోదు చేసింది. దేశ తలసరి ఆదాయం రూ.2,05,579 కన్నా ఇది 1.8 రెట్లు ఎక్కువ. కాగా, తలసరి ఆదాయంలో రంగారెడ్డి, హైదరాబాద్మొదటి రెండు స్థానాల్లో కొనసాగుతుండగా, వికారాబాద్ చిట్టచివరన నిలిచింది. ఈ సారి హనుమకొండ, వికారాబాద్తప్ప మిగిలిన జిల్లాలన్నింటి తలసరి ఆదాయం 2 లక్షల మార్క్ దాటడం విశేషం. 2024%-%25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ జీఎస్డీపీ (గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్) రూ.16 లక్షల12 వేల 579 కోట్లకు చేరింది. గతేడాది రూ.14,64,378 లక్షల కోట్లతో పోల్చినప్పుడు 10.1శాతం వృద్ధి రేటు నమోదైంది. దేశ వృద్ధి రేటు(9.9)తో పోలిస్తే ఇది 0.2 ఎక్కువ కావడం విశేషం. దేశ జీడీపీలో తెలంగాణ వాటా ఈ ఏడాది 4.9 శాతం కాగా, అంతకుముందు రెండేండ్లలో వరుసగా 5, 4.8, 4.9 శాతంగా ఉంది. ఈ లెక్కన నిరుడితో పోలిస్తే జీడీపీలో తెలంగాణ వాటా స్వల్పంగా 0.1 శాతం తగ్గింది. మరోవైపు తెలంగాణ జీఎస్డీపీ కి జిల్లాల నుంచి కంట్రిబ్యూషన్ లో చాలా తేడా కనిపిస్తున్నది. ఐటీ, ఫార్మా, నిర్మాణ, తదితర రంగాలతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి, సంగారెడ్డి, నల్గొండ లాంటి జిల్లాల్లో జీడీడీపీ (గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్) ఎక్కువగా ఉంటే పారిశ్రామికంగా వెనుకబడి, వ్యవసాయం తప్ప మరే ఇతర ఆదాయ వనరులు పెద్దగా లేని ములుగు, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, నారాయణపేట లాంటి జిల్లాల్లో జీడీడీపీ అతి తక్కువ గా ఉంది.

ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల జిల్లాల్లోనే ఏర్పాటుకావడం, ఇక్కడే రియల్ ఎస్టేట్, సేవా రంగం కూడా విస్తరించడమే ఇందుకు కారణమంటున్నారు. మిగిలిన జిల్లాల్లో ఐటీ, ఇతర పరిశ్రమల ఏర్పాటును ప్రభుత్వాలు ప్రోత్సహించకపోవడంతో కొన్ని జిల్లాలు ఆర్థికంగా వెనుకబడుతున్నాయి. ఫలితంగా ఆయా జిల్లాల నుంచి హైదరాబాద్కు ఉపాధి కోసం వలసలు పెరుగుతున్నాయి.

తలసరి ఆదాయంలో రంగారెడ్డి టాప్.. వికారాబాద్ లాస్ట్..
2024-25 సంవత్సరానికి తలసరి ఆదాయంలో రంగారెడ్డి జిల్లా రూ. 10 లక్షల55 వేల913తో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవగా.. వికారాబాద్ జిల్లా రూ. 1,98,401తో చివరి స్థానంలో ఉంది. తలసరి ఆదాయంలోనూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, మేడ్చల్లాంటి జిల్లాలు మొదటి నాలుగు స్థానాల్లో ఉండగా, నారాయణపేట, మహబూబాబాద్లాంటి జిల్లాలు అట్టడుగున నిలిచాయి.
2014-15లో 1.24 లక్షలుగా ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయం పదేండ్లలో రూ.3.80 లక్షలకు పెరిగింది. అదే సమయంలో పదేండ్ల కింద 2014--15లో రూ.72,658 కోట్లుగా ఉన్న రాష్ట్ర అప్పులు ఈ ఏడాది ఫిబ్రవరి 28 నాటికి 7 లక్షల38 వేల 707 కోట్లకు చేరాయి. అంటే తలసరి ఆదాయం 305 శాతం పెరిగితే రాష్ట్ర అప్పులు మాత్రం ఏకంగా వెయ్యి రెట్లు పెరగడం గమనార్హం. అంటే రాష్ట్ర అప్పులు పెరిగిన నిష్పత్తిలో తలసరి ఆదాయం పెరగడం లేదని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

అతి ఎక్కువ తలసరి ఆదాయం కలిగిన 5 జిల్లాలు

| జిల్లా | తలసరి ఆదాయం |
|---|---|
| రంగారెడ్డి | 10,55,913 |
| హైదరాబాద్ | 5,54,105 |
| సంగారెడ్డి | 3,45,478 |
| మేడ్చల్- మల్కాజ్గిరి | 3,43,130 |
| భద్రాద్రి కొత్తగూడెం | 3,21,281 |

అతి తక్కువ తలసరి ఆదాయం కలిగిన 5 జిల్లాలు

| జిల్లా | తలసరి ఆదాయం |
|---|---|
| వికారాబాద్ | 1,98,401 |
| హనుమకొండ | 1,99,490 |
| జగిత్యాల | 2,05,273 |
| నారాయణపేట | 2,07,784 |
| మహబూబాబాద్ | 2,12,232 |

2023-24 సంవత్సరానికి జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ)

| ప్రస్తుత ధరల వద్ద జిల్లా | జీడీడీపీ |
|---|---|
| రంగారెడ్డి | రూ.3,17,898 కోట్లు |
| హైదరాబాద్ | రూ.2,57,949 కోట్లు |
| మేడ్చల్ మల్కాజిగిరి | రూ.1,04,710కోట్లు |
| సంగారెడ్డి | రూ.65,190 కోట్లు |
| నల్గొండ | రూ.53,771 కోట్లు |

అతి తక్కువ జీడీడీపీ జిల్లాలు

| | |
|---|---|
| ములుగు | రూ. 8,873 కోట్లు |
| భూపాలపల్లి | రూ. 12,932 కోట్లు |
| కుమ్రంభీమ్ | రూ.13,700 కోట్లు |
| నారాయణపేట | రూ.13,818 కోట్లు |
| రాజన్న సిరిసిల్ల | రూ. 13,981 కోట్లు |

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com